www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 7-11-2024 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 202
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 12.35 తదుపరి సప్తమి; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 11.47 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 7.52-9.29; దుర్ముహూర్తం: ఉ. 10.05-10.50, మ. 2.36-3.21; అమృతఘడియలు: ఉ. 6.49-8.28; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.19; సూర్యాస్తమయం: 5.37

5 రోజులు.. 20.17 లక్షల బుకింగ్‌లు!

ఉచిత గ్యాస్ సిలిండర్లకు విశేష స్పందన
ఇప్పటికి 11.84 లక్షల సిలిండర్లు డెలివరీ
లబ్ధిదారుల ఖాతాల్లో 18కోట్ల సబ్సిడీ జమ
పని ఒత్తిడితో డెలివరీ ప్రక్రియలో జాప్యం
లబ్ధిదారుల్లో ఆందోళన.. టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్లు



12



ఎన్నికల ఫలితాల అనంతరం సతీమణి మెలానియాతో కలిసి ట్రంప్ అభివాదం

శ్వేతసౌధం మళ్లీ ట్రంప్‌దే

అమెరికా ఎన్నికల్లో ఘన విజయం

ఉత్కంఠ పోరులో ట్రంప్‌కే జైకొట్టిన ఓటర్లు
స్వింగ్ రాష్ట్రాల్లో కూడా రిపబ్లికన్లదే హవా
ట్రంప్‌కు 292 స్థానాలు.. కమలకు 224
అమెరికన్లనుద్దేశించి ప్రసంగించిన ట్రంప్
మస్క్, రాబర్ట్ కెన్నడీలపై పొగడ్తల వర్షం
ఉష ఇక్కపై అమెరికా రెండో మహిళ: ట్రంప్
గెలిచి.. ఓడి.. మళ్లీ గెలుపొంది..
131 ఏళ్ల తర్వాత రికార్డు సమం చేసిన ట్రంప్

ఎవరూ ఊహించని విజయం ఇది. భవిష్యత్‌లో కూడా ఇలాంటి విజయం ఉంటుందని అనుకోను. అమెరికా బంగారు భవిత కోసం పరితపిస్తా. నాపై హత్యాయత్నం జరిగాక.. దేవుడు పునర్జన్మనిచ్చాడని చాలా మంది అన్నారు. నా ఊపిరి ఉన్నంత వరకు అవిశ్రాంతంగా అమెరికన్ల కోసం పనిచేస్తా. - డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్, నవంబరు 6: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు. తన ప్రత్యర్థి, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్‌తో ఆద్యంతం ఉత్కంఠగా.. 'నువ్వా-నేనా' అన్నట్లుగా సాగిన పోరులో ట్రంప్ అప్రతిహత విజయాన్ని సాధించారు. 538 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లకు గాను.. అధ్యక్ష పదవిని చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 270ని సునాయాసంగా దాటేసిన ట్రంప్.. కడపటి వార్తలందేసరికి 292 చోట్ల విజయాన్ని నమోదు చేసుకున్నారు. ఆ సమయానికి ట్రంప్ ప్రత్యర్థి, భారత సంతతికి చెందిన డెమొక్రటిక్ అభ్యర్థి కమలాహ్యారిస్ 224 ఎలక్టోరల్ సీట్లను కైవసం చేసుకున్నారు. ముందు నుంచి సర్వేలు ట్రంప్‌నకు అటూ ఇటుగానే ఉన్నా.. ఓటర్లు మాత్రం ఆయనకు అండగా నిలిచారు. ఈ ఘన విజయంతో ట్రంప్ మరో అరుదైన రికార్డును సాధించారు. అమెరికా అధ్యక్షుడిగా పని చేసి, తదుపరి ఎన్నికల్లో ఓడిపోయి అనంతరం మరో పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నిక కావడం 131 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. కోర్టుల్లో క్రిమినల్

మిగతా 13వ పేజీలో...

ఫలించని పోరాటం!

చివరి వరకూ తప్పుకోని బైడెన్..
లభించింది 3 నెలల సమయమే
జాతి వివక్ష, పురుషాధిక్యత ప్రభావం
హక్కుల ప్రచారం.. తటస్థ ఓటర్లు దూరం
కమలా హ్యారిస్ ఓటమికి పలు కారణాలు



మిత్రమా.. కలిసి పని చేద్దాం

ట్రంప్‌కు ప్రధాని మోదీ ఫోన్
ట్రంప్, మోదీ నాయకత్వంలో ఇరుదేశాల అభివృద్ధి
ఎక్స్‌లో సీఎం చంద్రబాబు ట్వీట్



ఆంధ్రా అల్లుడు.. వాన్స్

అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి చిలుకూరి ఉష
వారి పూర్వీకులది తూర్పు గోదావరే
'సెకండ్ లేడీ'గా తొలి భారత సంతతి మహిళ

13



సొంత ఊరు వడ్లూరులో సంబరాలు
గెలుపు ఊహించాను ఉష బామ్మ



బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, సీఎస్

సోషల్ సైకోలకు చెక్

పైశాచిక పోస్టులపై గట్టిగానే కొరడా

నిర్లక్ష్య ఖాకీల దుమ్ము దులుపుడే

కడప ఎస్పీ హర్షవర్ధన్‌పై తొలి వేటు
దూకుడు పెంచిన కూటమి సర్కారు
అరాచక పోస్టులు పెట్టిన వర్రాకు కడప పోలీసుల వత్తాసు
నోటీసులు ఇచ్చి వదిలేసిన వైనం
ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్
అప్పటికప్పుడే కడప ఎస్పీ బదిలీ
వర్రాను తప్పించిన వ్యవహారంలో చిన్నచౌక్ సీఐ తేజమూర్తి సస్పెన్షన్

నెల రోజుల్లో సెట్ చేస్తా



మంచితనాన్ని అసమర్థతగా చూస్తున్నారు
సీఎం చంద్రబాబు ఆగ్రహం.. సోషల్ సైకోలపై పోలీసుల ఉదాసీనతపై సీరియస్
అరాచక పోస్టులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ
పోలీసుల్లో వైసీపీ వాసనలు పోలేదన్న మంత్రులు
కొందరి తీరుతో చెడ్డపేరు వస్తోందని ఆవేదన
పోలీసులపై తన వ్యాఖ్యలను ప్రస్తావించిన పవన్
ఆడబిడ్డల కంటతడి చూసి తట్టుకోలేకపోయా
ఫిర్యాదు చేసినా ఉదాసీనంగా ఉంటున్నారు
గట్టి చర్యలు ఉండాల్సిందేనన్న డిప్యూటీ సీఎం

వైసీపీ సోషల్ మీడియా గుంటూరు కన్వీనర్ అరెస్టు
బోరుగడ్డకు రాచ మర్యాదలు.. ఏడుగురు పోలీసులపై వేటు

2

అమరావతి, కడప, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెతక ప్రభుత్వం అనే అపవాదు చెరిపేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సోషల్ మీడియాలో పైశాచిక పోస్టులు పెడుతున్న సైకోలకు చుక్కలు చూపించడం మొదలైంది. జిల్లాల్లో అక్కడక్కడ జరుగుతున్న అరాచకాలను ఉపేక్షిస్తున్న పోలీసులపై కొరడా ఝళిపించింది. అదే సమయంలో సైకోల్లా రెచ్చిపోయేవారికి ఖాకీ మార్కు కౌన్సెలింగ్ తప్పదని స్పష్టం చేస్తోంది. అత్యంత దారుణమైన వ్యాఖ్యానాలతో సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టే వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టి అరెస్టులు చేయిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రిపైనే నీచమైన పోస్టులు పెట్టిన పులివెందుల వ్యక్తి, వైఎస్ భారతి వ్యక్తిగత సహాయకుడు వర్రా రవీంద్రారెడ్డిని సింపుల్‌గా వదిలేశారన్న కారణంగా ఏకంగా కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేస్తూ

మిగతా 14వ పేజీలో...

భూ ఆక్రమణలపై కొరడా

కబ్జాకోర్లకు 14 ఏళ్లు జైలు శిక్ష.. భూమి విలువతోపాటు నష్టపరిహారమూ వసూలు
ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిషేధ బిల్లుకు కేబినెట్ ఆమోదం.. సీఆర్‌డీఏ పాత పరిధి పునరుద్ధరణ
రూ.331 కోట్ల ఉపాధి బిల్లుల చెల్లింపులు.. న్యాయాధికారులకు 61 ఏళ్లకు రిటైర్మెంట్
కుప్పం, పిఠాపురం అభివృద్ధి అథారిటీల ఏర్పాటు.. కాలేజీల ఖాతాల్లోకే రీయింబర్స్‌మెంట్
3 కీలక పాలసీలకు పచ్చజెండా.. డేటా సెంటర్, సెమీ కండక్టర్, డ్రోన్ విధానాలకు ఓకే
డిజిటలైజేషన్, 5జీ, క్లౌడ్ మార్కెటింగ్, మొబైల్, ఏఐ మార్కెట్‌కు ప్రోత్సాహం
భారీ పెట్టుబడులకు మరిన్ని ప్రోత్సాహకాలు.. రాష్ట్ర మంత్రివర్గ కీలక నిర్ణయాలు

14



కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2

షాతో పవన్ భేటీ

ఉపముఖ్యమంత్రి అయ్యాక ఇదే తొలిసారి
మర్యాదపూర్వక భేటీయే.. ప్రత్యేకత లేదు: జనసేనాని

ఆ 45 టీఎంసీలు ఏపీకే ఇవ్వాలి

కృష్ణా డెల్టాకు మేం వాడుకోవాలి

48 ఏళ్లుగా ప్రాజెక్టుల ఆధారంగా ఉమ్మడి రాష్ట్రానికి నీటి కేటాయింపులు
విభజన తర్వాత కూడా వాటికి తెలంగాణ అంగీకరించింది
కృష్ణా ట్రైబ్యునల్‌లో ఏపీ తరపు సాక్షి గోయల్ వెల్లడి



హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తే.. నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకునేలా గతంలో ఒప్పందం జరిగిందని ఏపీ తరపు సాక్షి అనిల్‌కుమార్ గోయల్ తెలిపారు. ఇప్పటికే కర్ణాటక, మహారాష్ట్ర 35 టీఎంసీలు వాడుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయని, మిగిలిన 45 టీఎంసీలు తెలంగాణకు రావని.. ఆంధ్రప్రదేశ్‌కే చెందుతాయని స్పష్టం చేశారు. అయితే తెలంగాణ ఆ 45 టీఎంసీలు తనకే చెందుతాయని

మిగతా 12వ పేజీలో...

వారంలో నామినేటెడ్ భర్తీ

రెండో జాబితాలో భారీగా పందేరం.. ఇందులో 30-35 కులాల కార్పొరేషన్లు
కొన్ని ఇతర కార్పొరేషన్లకూ నియామకాలు.. జనసేన, బీజేపీ నేతలకూ పదవులు
బాబు సుదీర్ఘ కసరత్తు.. అసెంబ్లీ సమావేశాలకు ముందే ప్రకటించే చాన్స్

అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం వారం రోజుల్లో మరోసారి నామినేటెడ్ పదవులను భర్తీ చేయనుంది. మొదటి జాబితాలో ప్రకటించిన పోస్టుల కంటే రెండో జాబితాలో రెండు మూడు రెట్లు ఎక్కువగా ఉంటాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో 50 వరకు కులాల కార్పొరేషన్లు

మిగతా 14వ పేజీలో...

పీఎం-విద్యాలక్ష్మి

విద్యార్థులకు కేంద్రం కొత్త పథకం

ఉన్నత చదువులకు సర్కారు హామీతో రుణాలు
పథకం పరిధిలోకి ఏటా 22 లక్షల మంది
రూ.3,600 కోట్లు కేటాయించనున్న సర్కారు
కేంద్ర మంత్రివర్గ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబరు 6: విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం-విద్యాలక్ష్మి పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నాణ్యమైన ఉన్నత చదువులు చదివేందుకు ఇకపై ఆర్థిక ఇబ్బందులు ఉండబోవని కేంద్రం పేర్కొంది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 860 'నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థ (క్యూహెచ్ఈఐ)'ల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు పీఎం-విద్యాలక్ష్మి పథకం కింద ఎలాంటి హామీలూ లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు అందించనున్నాయి. ట్యూషన్ ఫీజు, ఇతర ఖర్చుల కోసం

మిగతా 12వ పేజీలో...



వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి

ఇల్లు, కంపెనీలపై ఐటీ నజర్

శ్రీనివాస్ వ్యాపార భాగస్వాముల నివాసాల్లో కూడా అధికారుల సోదాలు
రూ.కోట్ల ఆదాయానికి సంబంధించి పన్నులు ఎగవేసినట్టు ఆరోపణలు
పశ్చిమ, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో ఏకకాలంలో దాడులు

3



ఎమ్మెల్సీ రఘురాజుకు ఊరట

ఎమ్మెల్సీగా సభ్యత్వం పునరుద్ధరించిన హైకోర్టు
వాదన వినకుండా సభ్యత్వం రద్దు సరికాదు
వాదన విని నిర్ణయం వెలువరించాలని నిర్దేశం

3

రాత్రికి రాత్రే బుల్డోజర్లతో రాలేరు

12



నోటీసులు ఇవ్వకుండా చాటింపు వేస్తారా?
ఇది అహంకారం, అరాచకం
ఆక్రమణల పేరుతో ఇలా ఇళ్లను కూల్చలేరు
నిర్దేశిత నిబంధనలు పాటించాల్సిందే
యూపీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
అధికారులపై చర్యలు తీసుకోవాలి
బాధితునికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలంటూ ధర్మాసనం ఆదేశాలు




సభ్యులు, అధికారులతో చైర్మన్ బీఆర్ నాయుడు తొలి భేటీ

కొలువుదీరిన టీటీడీ బోర్డు

చైర్మన్, 15 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం
శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడుకోవాలి
భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం
టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడు

3

జగన్ తప్పు చేస్తే ప్రజలకు శిక్షా!



2

విజయవాడ ధర్నా చౌక్‌లో లాంతర్లతో షర్మిల, జేడీ శీలం తదితరుల ఆందోళన

కరెంటు చార్జీల పెంపు ఉపసంహరించాలి
షర్మిల డిమాండ్.. లాంతర్లతో ప్రదర్శన

నందిగం సురేశ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

▸ వైసీపీ మాజీ ఎంపీకి హైకోర్టులో షాక్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు హైకోర్టు షాక్ ఇచ్చింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం, వెలగపూడి గ్రామానికి చెందిన మరియమ్మ హత్య కేసులో నందిగం సురేశ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. 2020 డిసెంబరు 27న మరియమ్మ హత్యకు గురయ్యారు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నందిగం సురేశ్‌ను ఇటీవల అరెస్టు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. సురేశ్ ప్రోద్బలంతోనే రెండు వర్గాల మధ్య రాళ్లదాడి జరిగిందన్నారు. దాడికి ప్రణాళిక రచించి మందు, డబ్బు సమకూర్చారన్నారు. సురేశ్ ఓ వర్గంవారిని రెచ్చగొట్టి మరో వర్గంవారిపై దాడి చేయించారని సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని వివరించారు. కేసు దర్యాప్తును ట్యాంపర్ చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేసేందుకు పిటిషనర్ ప్రయత్నించారని దిగువ కోర్టు సైతం గుర్తించిందని తెలిపారు. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

భద్రతను పునరుద్ధరించాలి

▸ హైకోర్టును ఆశ్రయించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తనకు గతంలో ఉన్న 1 ప్లస్ 1 భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఫుడ్ కమిషన్ చైర్మన్ చింతా విజయ్ ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా భద్రతను తొలగించారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

మా కుమార్తె ఆచూకీ తెలపండి

▸ కళాశాల నుంచి అదృశ్యమై 16 రోజులు గడుస్తోంది

▸ న్యాయం కోసం డిప్యూటీ సీఎం పవన్‌కు తల్లిదండ్రుల వినతి


ప్రత్తిపాడులో మీడియాతో మాట్లాడుతున్న దంపతులు

ప్రత్తిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం చదివే తమ కుమార్తె అదృశ్యమై 16రోజులు గడుస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా, కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. తమ కుమార్తె అదృశ్యంపై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన నెల్లి నూకరత్నం, రామకృష్ణ దంపతులు బుధవారం ప్రత్తిపాడులో విలేకరులతో మాట్లాడారు. తమ కుమార్తె ప్రత్తిపాడులోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోందని, కళాశాలకు వెళ్లి వచ్చే సమయంలో తమ గ్రామానికే చెందిన బొడ్డు జాన్ తమ కుమార్తెను ప్రతిరోజూ కాలేజీ బస్సులో వేధించేవాడని తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 6న అతడు తమ ఇంటికి వచ్చి తమ కుమార్తెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని, దీనిపై గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు. అక్టోబరు 22న తమ కుమార్తె కాలేజీకి వెళ్లగా బొడ్డు జాన్ ఆమెను తీసుకెళ్లిపోయాడని తెలిసిందన్నారు.దీనిపై ఎస్ఐ లక్ష్మీకాంతాన్ని వివరణ కోరగా బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మేరుగుపై తప్పుడు ఫిర్యాదు చేశా!

▸ బాధిత మహిళ అఫిడవిట్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి మేరుగు నాగార్జునపై నమోదైన అత్యాచారం కేసులో బుధవారం కీలక పరిణామం చోటు చేసుకొంది. ఆయనపై తప్పుడు ఫిర్యాదు చేశానని, రాజకీయ ఒత్తిడి కారణంగా కేసు పెట్టానని బాధిత మహిళ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో నాగార్జునపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని ఆమె తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. అయితే, ఈ వాదనతో న్యాయస్థానం విభేదించింది. ఫిర్యాదుదారు కోరిన వెంటనే నేరుగా కేసును కొట్టివేయలేమని పేర్కొంది. తప్పుడు ఫిర్యాదు చేసినవారు కూడా దీనికి సంబంధించిన పరిణామాలు ఎదుర్కోవాల్సిందేనని కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసు డైరీ, దర్యాప్తు వివరాలను కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 12కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌లో జెత్వానీ ఇంప్లీడ్

విజయవాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీపై వేధింపుల కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లో తాజాగా ఆమె ఇంప్లీడ్ అయ్యారు. విద్యాసాగర్ బెయిల్‌పై జరిగే విచారణలో తన వాదనలు వినాలని ఇంప్లీడ్ పిటిషన్‌ను బుధవారం దాఖలు చేశారు. బెయిల్ మంజూరు చేయాలని విద్యాసాగర్ విజయవాడ మహిళా సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సీఐడీ అధికారులు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది.

టూరిజం ఎండీగా ఆమ్రపాలి బాధ్యతలు


మంత్రి దుర్గేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టూరిజం కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం విజయవాడలోని కార్యాలయానికి చేరుకున్న ఆమె.. ఎండీ బాధ్యతలతో పాటు ఏపీ టూరిజం అథారిటీ సీఈవోగా కూడా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం అమరావతి సచివాలయానికి వెళ్లారు. అక్కడ పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, సెక్రటరీ వినయ్‌చంద్‌ను కలిశారు.

టూరిజం ఎండీగా ఆమ్రపాలి బాధ్యతలు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం విజయవాడలోని కార్యాలయానికి చేరుకున్న ఆమె.. ఎండీ బాధ్యతలతో పాటు ఏపీ టూరిజం అథారిటీ సీఈవోగా కూడా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం అమరావతి సచివాలయానికి వెళ్లారు. అక్కడ పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, సెక్రటరీ వినయ్‌చంద్‌ను కలిశారు.

అర్చకులకు రూ.15వేల వేతనంపై ఉత్తర్వులు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అర్చకుల కనీస వేతనం రూ.15 వేలకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెలకు రూ.50 వేలు పైబడి ఆదాయం ఉన్న అన్ని ఆలయాల్లో అర్చకులకు కనీస వేతనం రూ.15 వేలు అందించనున్నారు. కామన్ గుడ్ ఫండ్ నిబంధనల్లోని సెక్షన్ 70లోని 1(బి) ప్రకారం దీనిని అమలు చేయనున్నట్లు దేవదాయ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అసెంబ్లీలో పారదర్శకతకు ప్రాధాన్యం: అయ్యన్న

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ శాసనసభలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరుగుతున్న 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. 'శాసనసభ కమిటీలు ఇంకా పూర్తిగా పారదర్శకతను ప్రదర్శించడం లేదు. కమిటీ సమావేశాలను అందరికీ అందుబాటులో ఉంచేలా మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉంది. తదుపరి శాసనసభ పేపర్‌లెస్‌గా మారేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని అయ్యన్న తెలిపారు.

ఆంగ్లో ఇండియన్స్ సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి ఫరూక్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ఆంగ్లో ఇండియన్ కుటుంబాల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఏపీ, తెలంగాణ సహా 7 రాష్ట్రాలకు చెందిన ఆంగ్లో ఇండియన్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి బృందం బుధవారం సచివాలయంలో ఆయనతో సమావేశమైంది. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఏ రాయ్‌రోజారియో, ప్రధాన కార్యదర్శి ఎస్ ప్యాట్రిక్ డూలాండ్ ఇతర సభ్యులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

చదవలేక చనిపోతున్నా..!


దువ్వూరు పణత్

▸ పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

▸ అమ్మా నన్ను క్షమించు.. అంటూ తల్లికి లేఖ!

▸ నెల్లూరులోని ఓ ప్రైవేటు స్కూల్లో ఘటన

▸ కేసు నమోదు.. విద్యాశాఖ అధికారుల ఆరా

నెల్లూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): 'అమ్మా.. నన్ను క్షమించు. నేను చదవలేకపోతున్నా. నేను ఉన్నా ఒకటే, చనిపోయినా ఒకటే.' నంటూ నెల్లూరులో ఓ విద్యార్థి తన తల్లికి లేఖరాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నెల్లూరు రూరల్ మండలం ధనలక్ష్మీపురం వద్ద ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్న విద్యార్థి దువ్వూరు పణత్ బుధవారం హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూలు సిబ్బంది ఒత్తిడివల్లే తమ బిడ్డ చనిపోయాడంటూ మృతుడి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నెల్లూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. ముత్తుకూరులోని ఆర్ఆర్ కాలనీకి చెందిన దువ్వూరు హరినాథ్‌రెడ్డి, అనితల పెద్ద కుమారుడు పణత్ ధనలక్ష్మీపురంలోని వీబీఆర్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజనానికి వచ్చిన పణత్ తిరిగి తరగతి గదికి కాకుండా హాస్టల్ గదికి వెళ్లాడు. అక్కడే ఫ్యానుకు తాడుతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విద్యార్థి క్లాసుకు రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది గదిలో చూడగా తాడుకు పణత్ వేలాడుతూ కనిపించాడు. దీంతో అతడిని కిందికి దించి హుటాహుటిన సమీపంలోని నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే పణత్ మరణించాడని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని స్కూల్ యాజమాన్యం ముత్తుకూరులోని పణత్ తల్లిదండ్రులకు చేరవేసింది. వారంతా హాస్పిటల్‌కు చేరుకుని విగతజీవిగా పడిఉన్న పణత్‌ను చూసి బోరున విలపించారు. అక్కడి నుంచి మృతదేహాన్ని వీబీఆర్ స్కూల్‌కు తరలించా రు. విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు, ఆందోళనలతో అక్కడ కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది.

ఒత్తిడి వల్లే

పణత్ ఆత్మహత్య ఘటనపై అతడి తల్లిదండ్రులు, బంధువులు స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన బిడ్డ చదువులో వెనకబడ్డాడని, ఒత్తిడి తీసుకురావద్దని పదేపదే చెప్పామంటూ మృతుడి తల్లి అనిత అన్నారు. పది వరకైనా చదివించాలన్న ఉద్దేశంతోనే స్కూల్లో చేర్పామని, ఎవరి ఒత్తిడి వల్లో తన బిడ్డ తమకు కాకుండాపోయాడంటూ కన్నీటిపర్యంతమయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ సీఐ జి.వేణు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కాగా ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు వీబీఆర్ స్కూల్ వద్దకు చేరుకుని విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు.

శిక్షణ తరగతుల్లో హెచ్‌ఎం మృతి

▸ భగ్గుమన్న ఉపాధ్యాయ సంఘాలు

▸ శిక్షణ కార్యక్రమం రద్దు

▸ ఆన్‌లైన్‌లో శిక్షణకు ప్రకటన


వెంకట రత్నకుమార్(ఫైల్)

ఆగిరిపల్లి/ఉండి, అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుల నాయకత్వ శిక్షణ తరగతులకు హాజరైన ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించారు. మూడు రోజులుగా శిక్షణ శిబిరాల్లోనే ఉంచి ఉదయం నుంచి రాత్రి వరకు శిక్షణ కొనసాగించడం వల్లే ఆయన మరణించారని తోటి ప్రధానోపాధ్యాయులు ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయ సంఘాలు కూడా ఘటనపై మండిపడ్డాయి. దీంతో అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని నిలిపివేసి, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని ప్రకటించారు. హెచ్‌ఎంలు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు వేర్వేరుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎంలకు లీడర్‌షిప్‌పై రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది కేంద్రాల్లో, ఎస్జీటీలకు ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీపై 8 కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారు. రెసిడెన్షియల్ విధానంలో టీచర్లు వరుసగా 6 రోజులు శిక్షణ కేంద్రాల్లోనే ఉండి శిక్షణ పొందుతున్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలోని హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో హెచ్‌ఎంలకు ఈ నెల 4న తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులకు హాజరైన పశ్చిమ గోదావరి జిల్లా ఉణుదుర్రు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తోట వెంకట రత్నకుమార్(54) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం ఆరు నుంచి రాత్రి 9వరకు శిక్షణ తరగతులు కొనసాగుతుండటం వల్ల ఒత్తిడికి లోనై రత్నకుమార్ చనిపోయారంటూ తోటి ప్రధానోపాధ్యాయులు ఆరోపించారు. ఘటనపై ఉపాధ్యాయ సంఘాలూ భగ్గుమన్నాయి. రెసిడెన్షియల్ తరహా శిక్షణ వద్దని మొదటి నుంచీ చెబుతున్నా అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డాయి. శిక్షణ కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఉంటే ఆయన మరణించేవారు కాదని అంటున్నాయి. టీచర్లు ఇంటి నుంచి వచ్చి వెళ్లేలా నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ఏపీ సమగ్ర శిక్షా అదనపు స్పెషల్ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి తదితర అధికారులు ఘటన స్థలానికి వచ్చి చర్చలు జరిపారు. ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామన్నారు.

నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు..

మరణించిన ప్రధానోపాధ్యాయుడు రత్నకుమార్ భార్య చంద్రకళ కూడా ఉణుదుర్రు పాఠశాలలోనే ఇంగ్లీషు టీచరుగా పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం కేశవరం. వీరికి ఇద్దరు సంతానం. పిల్లల చదువు నిమిత్తం వీరు భీమవరంలో నివాసం ఉంటున్నారు. గురువారం స్వగ్రామంలో రత్నకుమార్ అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు

పాఠశాల విద్య ప్రక్షాళన

భారీగా ఏడీ, జేడీ, డీడీలు బదిలీ

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌గా ఎంవీ కృష్ణారెడ్డి

పరీక్షల విభాగం డైరెక్టర్‌గా శ్రీనివాసులురెడ్డి

పాఠ్యపుస్తకాల డైరెక్టర్‌గా మధుసూదనరావు

ప్రతాప్‌రెడ్డికి అప్రాధాన్య పోస్టు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖను ప్రక్షాళన చేసింది. అదనపు డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లను భారీగా బదిలీ చేసింది. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీతో అంటకాగినట్లు ఆరోపణలున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌ను బదిలీ చేసి వయోజన విద్య జేడీగా నియమించింది. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బాధ్యతలను జేడీ ఎంవీ కృష్ణారెడ్డికి అప్పగించింది. కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదనరావును బదిలీ చేసి పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్‌గా నియమించింది. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డిని బదిలీ చేసి కేజీబీవీ కార్యదర్శిగా నియమించింది. అదనపు ఎస్పీడీ-1 కేవీ శ్రీనివాసులురెడ్డిని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్‌గా, అదనపు డైరెక్టర్ ఎ.సుబ్బారెడ్డిని టెట్ జేడీగా నియమించింది. ఆయనకు టీచర్ల సర్వీసు అంశాలు కూడా అప్పగించింది. గురుకుల విద్యాలయాల అదనపు డైరెక్టర్ ఆర్.నరసింహారావును ఓపెన్ స్కూల్ సొసైటీ అదనపు డైరెక్టర్‌గా బదిలీ చేసింది. గత ప్రభుత్వంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న జేడీ వై.రాఘవరెడ్డిని జవహర్ బాల భవన్ డీడీ పోస్టుకు పంపింది.

ఆయుష్ కమిషనర్‌పై వేటు

▸ అవినీతి, మహిళా వైద్యుల ఫిర్యాదులే కారణం

▸ 'ఆంధ్రజ్యోతి' కథనాలపైనా స్పందించిన ప్రభుత్వం

▸ జీఏడీలో రిపోర్ట్ చేయాలని రాజేంద్రకుమార్‌కు ఆదేశం

▸ ఈఎస్ఐలో అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

▸ ఆయుష్‌లోనూ విచారణకు ఉద్యోగుల డిమాండ్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఆయుష్ కమిషనర్ ఎల్.ఎస్.బి.రాజేంద్రకుమార్‌పై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయన మహిళా వైద్యులను ఇబ్బంది పెట్టడంతో పాటు అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఈఎస్ఐ డైరెక్టర్‌గా పనిచేసిన రాజేంద్రకుమార్‌పై.. ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్న తీవ్రమైన అభియోగాలున్నాయి. దీంతో పాటు ఈఎస్ఐలో మందుల కొనుగోలులో భారీగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఆ తర్వాత ఆయుష్ కమిషనర్‌గా వచ్చినా, ఆయన వ్యవహార శైలిలో మార్పురాలేదు. రెండు నెలల క్రితం ఆయుష్‌లో పనిచేస్తున్న కొంత మంది మహిళా వైద్యులు, ఉద్యోగులు నేరుగా ఆయనపై సీఎంవోలో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచే సీఎంవో అధికారులు ఆయనపై రహస్యంగా విచారణ చేపట్టారు. ఇటీవల 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' చానెల్‌లో జరిగిన చర్చలో కూడా ఆయుష్ కమిషనర్ రాజేంద్రకుమార్ వ్యవహారం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని ఉపేక్షించవద్దని చాలా మంది సీఎంవోకు ఫిర్యాదులు చేశారు. దీంతో ప్రభుత్వం స్పందించింది. వెంటనే ఆయన్ను ఆయుష్ కమిషనర్‌గా తొలగిస్తూ, సాధారణ పరిపాలక శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన్ను కేంద్ర సర్వీసులకు పంపించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వాస్తవానికి.. రాజేంద్రకుమార్ ఐఆర్ఎస్ అధికారి అయినప్పటికీ ఎంబీబీఎస్ చదువుకున్నారు కనుక, గత ప్రభుత్వం ఈఎస్ఐ డైరెక్టర్‌గా అవకాశం కల్పించింది. అయితే, ఈఎస్ఐలో ఆయన చేయని అక్రమాలు లేవు. మందుల కొనుగోలు దగ్గర నుంచి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం వరకూ అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వంలోనే రాజేంద్రకుమార్‌పై ప్రత్యేకంగా విచారణాధికారిని నియమించారు. ఆరోపణలు నిజమేనని, విజిలెన్స్ లాంటి పెద్ద సంస్థలతో విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని సదరు విచారణాధికారి సూచించారు. ఆమేరకు విచారణలు కూడా మొదలయ్యాయి. కానీ గత ప్రభుత్వంలో సీఎంవోలో కీలకంగా వ్యవహరించిన అధికారితో అత్యంత సన్నిహితంగా ఉండడంతో రాజేంద్రకుమార్‌ను ఆయుష్ కమిషనర్‌గా నియమించారు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కొంత అండగా నిలవడంతో ఆయనపై కొత్త సర్కారు కూడా ప్రత్యేకంగా దృష్టి లేదు. ఆయుష్ విభాగంలో ప్రింటింగ్ మెటీరియల్ కొనుగోలు, ఇతర వ్యవహారాల్లోనూ కమిషనర్ పాత్ర ఉందన్న ఆరోపణలున్నాయి. వీటన్నింటిపైనా విచారణ చేయాలన్న డిమాండ్లు ఉన్నాయి.

బెయిల్‌పై భానుకిరణ్ విడుదల

▸ సూరి హత్య కేసులో 12 ఏళ్లుగా చంచల్‌గూడ జైల్లో

సైదాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్దెల చెరువు సూరి హత్య కేసులో ప్రధాన నిందితుడు భానుకిరణ్ బుధవారం బెయిల్‌పై విడుదలయ్యారు. 12 ఏళ్లుగా చంచల్‌గూడ జైల్లో ఉన్న ఆయన... సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బయటికొచ్చారు. కాగా, 2011 జనవరి 4న సూరిని భానుకిరణ్ కాల్చి చంపారు.

రౌడీషీటర్ బోరుగడ్డకు ఖాకీల రాచ మర్యాదలు

ఆర్ఎస్ఐ సహా ఏడుగురు పోలీసులపై వేటు

▸ రిమాండ్ ఖైదీకి ఖాకీల ప్రత్యేక సేవలు

▸ రెస్టారెంట్‌లో పసందైన మటన్ బిర్యానీ

▸ సెల్‌ఫోన్‌లో మాట్లాడుకునే అవకాశం

▸ వీడియో తీసిన యువకుడిపై దౌర్జన్యం


రెస్టారెంట్‌లో వీడియో తీసిన యువకుడితో గొడవ పడుతున్న పోలీసులు, బిర్యానీ తిని వెళ్తున్న బోరుగడ్డ

విజయవాడ/గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు పోలీసులు రాచమర్యాదలు చేశారు. రెస్టారెంట్‌కు తీసుకెళ్లి మటన్ బిర్యానీకి ఆర్డర్ ఇచ్చారు. సెల్‌ఫోన్‌తో మాట్లాడుకునే అవకాశం ఇచ్చారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఏడుగురు పోలీసులపై వేటు పడింది. గుంటూరులోని ఏఈఎల్సీ చర్చి కోశాధికారి కర్లపూడి బాబు ప్రకాశ్‌ను 50 లక్షలు ఇవ్వాలని బెదిరించిన కేసులో రిమాండ్‌పై అనిల్ రాజమహేంద్రవరం జైలులో ఉన్నాడు. ఎన్నికల సమయంలో జరిగిన గొడవలకు సంబంధించి కేసుల్లో తుళ్లూరు, తాడికొండ పోలీసులు పీటీ వారెంట్‌పై అతడిని బుధవారం మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. మంగళగిరి న్యాయస్థానం రెండు వారాల పాటు రిమాండ్ విధించింది. కాగా ఇటీవల అనిల్‌ను జైలుకు తరలించే రెండు సందర్భాల్లో మీడియాతో మాట్లాడుతూ గతంలో లాగే రెచ్చిపోయాడు. ఈ నేపథ్యంలో అనిల్ విషయంలో జాగ్రత్త వహించాలని గుంటూరు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఎస్కార్ట్ పోలీసులను ముందస్తుగానే హెచ్చరించారు. అయినా ఎస్కార్ట్ పోలీసులకు తలకు ఎక్కలేదు. అనిల్‌ను మంగళగిరి కోర్టు నుంచి తిరిగి కేంద్ర కారాగారానికి తరలించే క్రమంలో పోలీసులు అతడికి రాచమర్యాదలు చేశారు. వాహనం గన్నవరం సమీపాన ఉన్న కేసరపల్లి వద్దకు వెళ్లేసరికి తనకు నాన్‌వెజ్ భోజనం కావాలని అనిల్ అడిగాడు. అక్కడున్న రెస్టారెంట్ వద్ద ఆపి మటన్ బిర్యానీ ఆర్డర్ ఇచ్చారు. అంతకు ముందు పక్కకు వెళ్లి ఫోన్‌లో మాట్లాడుకునే వెసులుబాటు కల్పించారు. అనిల్ రెస్టారెంట్‌లో కూర్చుని భోజనం చేస్తుండగా, పోలీసులు పక్కన కూర్చున్నారు. ఈ దృశ్యాలను అక్కడే ఉన్న మైలవరానికి చెందిన ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అతడు వీడియో తీస్తున్నాడని గుర్తించిన అనిల్ పక్కనే ఉన్న పోలీసులకు సైగ చేశాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడి వద్దకు వేగంగా వెళ్లి సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశారు. వీడియో ఎందుకు తీశావని బెదిరించి, ఒత్తిడి చేసి దాన్ని డిలీట్ చేయించారు. ఆ యువకుడు ఎదురుతిరిగాడు. కస్టడీలో ఉన్న నిందితుడిని ఏకంగా రెస్టారెంట్‌కు తెచ్చి రాచ మర్యాదలు చేస్తే తప్పులేదు కానీ తాను వీడియో తీస్తే తప్పయిందా అంటూ వారిపై మండిపడ్డాడు. వివాదం పెరగడం, జనం గుమిగూడడంతో పోలీసులు హడావుడిగా బోరుగడ్డను తీసుకుని వెళ్లిపోయారు. అయితే హోటల్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయిన ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో ఆర్ఎస్ఐ, ఏఎస్ఐ సహా మొత్తం ఏడుగురు పోలీస్ సిబ్బందిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో ఆర్ఎస్ఐ పి.నారాయణరెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కే శ్రీనివాసరావు, ఏఆర్ కానిస్టేబుళ్లు టి.శంకర్రావు, కే బుచ్చయ్య, తుళ్లూరు ఏఎస్ఐ బాల ఎం శౌరి, తుళ్లూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నాగరాజు, తాడికొండ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎస్‌పి సాదుల్లా ఉన్నారు.

అమిత్ షాతో పవన్ భేటీ

▸ మర్యాదపూర్వక భేటీయే.. ప్రత్యేకత లేదు: జనసేనాని


అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

న్యూఢిల్లీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. బుధవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్న పవన్.. షా నివాసానికి వెళ్లే ముందు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇప్పుడు తొలిసారి షాను కలిసేందుకు వచ్చాను. ఇం దులో ప్రత్యేకంగా చెప్పడానికేమీ లేదు. ఇది మర్యాదపూర్వక భేటీ. హరియాణా ఎన్నికల సమయంలో నే ఆయన్ను సమయం అడిగాను' అని పవన్ తెలిపారు. ఆ తర్వాత నేరుగా షా నివాసానికి వెళ్లి.. 25 నిమిషాలకు పైగా ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ చర్చించినట్లు తెలిసింది.

జగన్ తప్పు చేస్తే.. ప్రజలకు శిక్షా!

▸ విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి: షర్మిల

విజయవాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఐదు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు హై వోల్టేజీ షాక్‌లు ఇస్తోందని పీసీసీ అధ్యక్షురా లు వైఎస్ షర్మిల విమర్శించారు. ఈ నెల నుంచి రూ.6 వేల కోట్ల భారం ప్రజలపై మోపుతున్నారని, మరో రూ.11 వేల కోట్ల భారం మోపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా విజయవాడలో బుధవారం కాంగ్రెస్ పార్టీ లాంతర్లతో నిరసన ప్రదర్శన జరిపింది. షర్మిల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిందని, ఇప్పుడు రూ.35 వేల కోట్ల భారం మోపి చంద్రబాబు ప్రజలను ఏడిపిస్తున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం తప్పులు చేసింది కాబట్టే ప్రజలు కూటమికి అధికారం ఇచ్చారన్నారు. చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు.


పాదయాత్ర చేస్తున్న వారితో సిక్కోలు జిల్లా వాసులు

బద్రీనాథ్ టు శబరిమల

▸ 8 వేల కిలోమీటర్ల కేరళవాసుల పాదయాత్ర

కంచిలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది రాష్ట్రాల ప్రజలకు శబరిమల పుణ్యక్షేత్రం విశిష్టతను చాటిచెప్పడమే లక్ష్యం గా కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు అయ్యప్ప మాలధారులు బద్రీనాథ్ నుంచి శబరిమల వరకు 8 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. వారికి బుధవారం శ్రీకాకుళం జిల్లా కంచిలిలోని రాజు గురుస్వామి సన్నిధికి చెందిన గుడియా మిట్టు స్వామి తదితరులు స్వాగతం పలికారు. కేరళ రాష్ట్రం కేసరిగుడ్, రామ్‌దాస్ నాగర్ కూడ్లు ప్రాంతానికి చెందిన తాము జూన్ 2న పాదయాత్ర ప్రారంభించామని యాత్ర చేపట్టిన సనత్ కుమార్, సంపత్ కుమార్ తెలిపారు. ఉత్తరాది ప్రజలకు అయ్యప్ప దీక్షల విశిష్టత గురించి తెలియజేస్తూ వస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు 5,800 కిలో మీటర్ల యాత్ర పూర్తి చేశామన్నారు.

'గోదావరి' టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 16,316 మంది ఓటర్లు ఉన్నారు. బుధవారం ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాను ప్రకటించింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో 13,677 మంది ఓటర్లు ఉండగా, తాజాగా ప్రకటించిన తుది జాబితాలో ఆ సంఖ్య 16,316కి చేరింది.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ అరెస్టు

▸ వెంకటరామిరెడ్డికి 14 రోజుల రిమాండ్

▸ మార్ఫింగ్ ఫొటోలతో బాబు, రఘురామపై పోస్టులు


మేకా వెంకట రామిరెడ్డి

గుంటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన కేసులో గుంటూరు జిల్లా వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకట రామిరెడ్డిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను గుంటూరు ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ స్రవంతి 14 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం ఆయనను జిల్లా జైలుకు తరలించారు. కేసు వివరాలను విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్ మీడియాకు వివరించారు. మేకా వెంకటరామిరెడ్డి గతంలో మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికు ప్రధాన అనుచరుడుగా పనిచేశారు. ఆ తర్వాత వైసీపీ అధిష్ఠానం ఆయనను వైసీపీ సోషల్ మీడియా గుంటూరు జిల్లా కన్వీనర్‌గా నియమించింది. ఆ క్రమంలో సీఎం చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుల ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపై గుంటూరుకు చెందిన మాగులూరి కోటేశ్వరరావు మంగళవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. ఈ కేసులో నగరంపాలెం పోలీసులు బుధవారం నిందితుడు మేకా వెంకట రామిరెడ్డిని అరెస్టు చేశారు. కాగా, మేకాకు నేర చరిత్ర ఉంది. టీడీపీ కార్యాలయం పై జరిగిన దాడి కేసులో వెంకటరామిరెడ్డి నిందితుడు. ఎన్నికల సమయంలో నారా లోకేశ్ నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ కార్యకర్త బొమ్మనబోయిన బాల ఈశ్వర్‌ను చంపుతానని బెదిరించిన కేసులోనూ ఆయన నిందితుడు.

రూ.75 వేలు వేతనం ఇచ్చేవారు: ఇంటూరి రవికిరణ్

మరో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు ఇంటూరి రవికిరణ్‌కు గుంటూరులోని అరండల్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకుని.. నోటీసులు ఇచ్చి పంపించారు. నేతలపై అసభ్యకర పోస్టులు పెట్టేందుకు గత ప్రభుత్వం తనకు నెలకు రూ.75వేలు వేతనం ఇచ్చిందని, ఫైబర్ నెట్ ద్వారా నాడు చెల్లింపులు చేసేవారని పోలీసులకు ఆయన తెలిపినట్టు సమాచారం. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఉన్న సమయంలో, 2019లో సోషల్ మీడియాలో ఆయన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి వైరల్ చేసిన కేసులో గుడివాడకు చెందిన ఇంటూరి రవికిరణ్ నిందితుడు.



అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన లోకేశ్ అభినందిస్తున్న మంత్రులు

మీ కష్టం.. మాకందరికీ ఆదర్శం

- లోకేశ్‌కు సహచర మంత్రుల అభినందనలు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమెరికాలో వారం రోజులపాటు పెట్టుబడుల జైత్రయాత్రను పూర్తిచేసి, అమరావతి విచ్చేసిన మంత్రి నారా లోకేశ్‌ను సహచర మంత్రులు అభినందించారు. బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో లోకేశ్‌ను మంత్రులు కలిశారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు, పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించడానికి మీరు పడుతున్న కష్టం తమకందరికీ ఆదర్శమని మంత్రులు అన్నారు. మీరు చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలబెట్టడంలో గేమ్ చేంజర్ కాగలవని మంత్రులు వ్యాఖ్యానించారు.

ఉజ్బెకిస్తాన్‌లో గాజువాక వాసి మృతి

- మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు

గాజువాక (విశాఖపట్నం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఉజ్బెకిస్తాన్ వెళ్లిన గాజువాక వాసి అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. నగరంలోని న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధి యాతపాలెం ప్రాంతానికి చెందిన కొప్పనాతి ఆనంద్ (43) వెల్డర్. ఉపాధి నిమిత్తం గాజువాక ఆటోనగర్‌లో గల ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీన ఉజ్బెకిస్తాన్ వెళ్లాడు. ఈ నెల రెండో తేదీ రాత్రి పది గంటలకు ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. మరుసటిరోజు ఉదయం అక్కడ నుంచి ఒకరు ఆనంద్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అతను చనిపోయినట్టు చెప్పారు. అక్కడ ఆనంద్ పనిచేస్తున్న సంస్థ అధికారులను ఫోన్‌లో సంప్రతించేందుకు యత్నించగా స్పందించలేదని ఆనంద్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆనంద్ ఎలా చనిపోయాడో తెలియడం లేదని, తమకు అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు బుధవారం న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యూ పోర్టు సీఐ దాలిబాబును సంప్రతించగా సంబంధిత ఏజెన్సీ ప్రతినిధితో మాట్లాడామన్నారు. మృతదేహం రహదారిపై ఉందని, రోడ్డు ప్రమాదం అయిఉండవచ్చునని సమాచారం ఉందన్నారు.

వైసీపీ నాయకులకు భయపడి నిప్పంటించుకున్న యువకుడు మృతి

బుక్కపట్నం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గౌతమ్(21) బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. వైసీపీ నాయకుల బెదిరింపులకు భయపడి నాలుగు రోజుల క్రితం గౌతమ్ పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన బాధితుడిని బెంగళూరుకు తరలించారు. నాలుగు రోజులపాటు మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు.

కొలువుదీరిన టీటీడీ బోర్డు

చైర్మన్, 15 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం

- శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడుకోవాలి
- మా ముందు చాలా సవాళ్లు ఉన్నాయి
- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం
- టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడు
- బోర్డు సభ్యులు, అధికారులతో తొలి సమావేశం



శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుకుంటున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల నూతన ధర్మకర్తల మండలి కొలువుదీరింది. టీటీడీ బోర్డు చైర్మన్‌గా బీఆర్ నాయుడుతో పాటు మరో 14 మంది సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత ఆలయంలోని బంగారు వాకిలి వద్ద బీఆర్ నాయుడుతో ఈవో శ్యామలరావు ప్రమాణం చేయించారు. అనంతరం టీటీడీ బోర్డు సభ్యులుగా దేవదాయ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, మల్లెల రాజశేఖర గౌడ్, జాస్తి పూర్ణ సాంబశివరావు, ఎంఎస్ రాజు, నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి, రంగశ్రీ, రామ్మూర్తి, ఆనంద్‌సాయి, జానకీదేవి, దర్శన్, శాంతారామ్, నరేష్‌కుమార్, అదిత్ దేశాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రమాణం చేయించారు. బుధవారం సాయంత్రం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు సభ్యులు, సీనియర్ అధికారులతో తొలి సమావేశం, పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. 'టీటీడీలో చాలా సవాళ్లు ఉన్నాయి. వాటన్నిటినీ అధిగమిస్తాం. శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడుకోవాలి. భక్తులకు మెరుగైన సౌకర్యాలపై నిర్ణయాలు తీసుకుంటాం' అని అన్నారు. వచ్చే బోర్డు మీటింగ్‌లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటామని, వివిధ అంశాలపై చర్చించి సీఎం సలహాలతో మార్పులు చేస్తామని చెప్పారు. టీటీడీలో శాశ్వత ఉద్యోగుల నియామకంపై అధ్యయనం చేస్తామని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు రద్దు చేస్తామని ప్రజల్లో ఒక అపోహ ఉందన్నారు. ఈ ట్రస్టులో పలు అవకతవకలు జరిగాయని చాలా మంది అనుకుంటున్నారని, అయితే అది ఎంతవరకు నిజమో తెలియదని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరిగిందని, నివేదిక వచ్చిన తర్వాత సీఎం ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ నివేదికను ప్రజల ముందుంచి చర్యలు తీసుకుంటామని మరో ప్రశ్నకు బదులిచ్చారు. టీటీడీలో ఇప్పటికే ప్రక్షాళన మొదలైంది కాబట్టే బ్రహ్మోత్సవాలు బాగా జరిగాయని తెలిపారు. బోర్డు లేకపోయినప్పటికీ బ్రహ్మోత్సవాలను అధికారులు అద్భుతంగా నిర్వహించారని ప్రశంసించారు. తిరుమలలో అన్యమత ప్రచారం జరిగితే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. టీటీడీలో అన్యమత ఉద్యోగుల విషయంలో లీగల్‌గా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. టీటీడీ మెడికల్ విభాగాల్లో కొన్ని ఇబ్బందులున్నాయని అధికారులు తన దృష్టికి తెచ్చారని, దానిపై బోర్డు సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు. టీటీడీ బతికి బట్టకట్టాలంటే కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని చైర్మన్ స్పష్టం చేశారు.



టీటీడీ బోర్డు సమావేశంలో చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయా..

గతంలో తాను కూడా శ్రీవారి దర్శనం లభించక పుష్కరిణిలో నీళ్లు చల్లుకుని, కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయిన సందర్భాలున్నాయని బీఆర్ నాయుడు తెలిపారు. 'రద్దీ పెరిగిపోతే ఏమీ చేయలేం. రోజుకు 2, 3 లక్షల మంది వస్తే ఎక్కడ దర్శనం చేయించగలం. ఎలా కుదురుతుంది? ప్రస్తుతం రోజుకు 70 వేల నుంచి 80 వేల మందికే దర్శనం చేయించడం సాధ్యమవుతోంది. అది కూడా వీఐపీ బ్రేకులు వంటివి రద్దు చేస్తే' అన్నారు. కాగా, టీటీడీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై ఈవో శ్యామలరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తిరుమల శ్రీవారి ఆలయం, స్థానిక ఆలయాలు, అన్నప్రసాదం, విజిలెన్స్, ఆరోగ్యం, రవాణా, ఐటీ, గోశాల, ఉద్యానవనం, అటవీ శాఖ, విద్యాసంస్థల ప్రాముఖ్యతను వివరించారు. ఆస్పత్రులు, పీఆర్ వింగ్, రిసెప్షన్, కల్యాణకట్ట, హిందూ ధార్మిక ప్రాజెక్టులు, యాత్రికుల దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలను చూసుకోవడంతో పాటు నిబద్ధతతో సంస్థ ఖ్యాతిని అన్ని స్థాయుల్లో ముందుకు తీసుకెళ్లడంపై ఉద్యోగులు అంకితభావంతో ఉన్నారని ఈవో పేర్కొన్నారు.

లంచం ఇస్తేనే పరిహారం ఇస్తానన్నారు

- రోడ్డు ఆక్రమించేశారు.. తప్పుడు రికార్డులతో భూకబ్జా చేశారు
- వైసీపీ నేతలపై టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పరిహారం ఇప్పించమంటే.. ఒక వైసీపీ నేత లంచం అడిగారు.. భార్యకు తెలియకుండా భూమి కబ్జా చేశారు.. రుణం ఇప్పిస్తానని టోకరా వేశారు..అంటూ వైసీపీ బాధితులు ప్రజాదర్బార్‌లో టీడీపీ నాయకులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి, తెలుగు రైతు అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి బుధవారం గ్రీవెన్స్ నిర్వహించి, అర్జీలు స్వీకరించారు. కడప-రేణిగుంట జాతీయ రహదారిలో తమ ఇళ్లు, దుకాణాలు కోల్పోయామని, న్యాయం కోసం వైసీపీ ఎమ్మెల్యేను కలిస్తే.. పరిహారం ఇప్పించకపోగా, రేణిగుంట మండల వైసీపీ నాయకుడు రూ.5 లక్షల చొప్పున డిమాండ్ చేశారని, తాము ఇవ్వకపోవడంతో పరిహారం రాకుండా అడ్డుకున్నారని రేణిగుంట మండలం కరకంబాడి బీసీ కాలనీకి చెందిన బాధితులు వాపోయారు. తమ కాలనీలో వైసీపీ నేత రోడ్డు ఆక్రమించి దారి లేకుండా చేశారని, అతనిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి కొర్లగుంటకు చెందిన వి.రాధ కోరారు. భర్త చనిపోవడంతో తన పేరుతో ఉన్న స్థలానికి వైసీపీ నేతలు తప్పుడు రికార్డులు సృష్టించి కబ్జా చేశారని చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి చెందిన డి.భారతి వాపోయారు.

మద్యం నాణ్యతా పరీక్షలు పెంపు

- ఈఎన్‌ఏపై 13, బ్లెండ్‌పై 9 పరీక్షలు: ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్ కుమార్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం వినియోగదారుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. మద్యం నాణ్యతపై జరిపే పరీక్షల సంఖ్యను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. మద్యం తయారీ ప్రాథమిక స్థాయిలో... ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్(ఈఎన్‌ఏ)పై ఇప్పటి వరకూ ఆరు పరామితుల్లో పరీక్షలు జరుగుతున్నాయి. వాటిని 13కు పెంచామని చెప్పారు. బాట్లింగ్‌కు సిద్ధంగా ఉన్న విస్కీ, బ్రాందీ, రమ్, జిన్, వోడ్కా(బ్లెండ్)లలో ఆల్కాహాల్ శాతాన్ని మాత్రమే ఇప్పటి వరకూ లెక్కిస్తున్నారని అన్నారు. ఇకనుంచి బ్లెండ్ అయిన మద్యాన్ని బాట్లింగ్‌కు ముందు తొమ్మిది రకాలుగా పరీక్షిస్తామని చెప్పారు. ఈ పరీక్షలకు గ్యాస్ క్రోమోటోగ్రఫీ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చామన్నారు. బీఐఎస్, ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలోని ఎక్సైజ్ ప్రయోగశాలల్లో ఈ పరీక్షలు చేస్తామని నిషాంత్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

డిసెంబరులో పీఎస్ఎల్వీ ప్రయోగం

- షార్‌కు చేరిన విదేశీ ఉపగ్రహం

సూళ్లూరుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి డిసెంబరు తొలి వారంలో పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ద్వారా మన దేశానికి చెందిన భూ పరిశీలన ఉపగ్రహంతో బెల్జియం దేశానికి చెందిన ప్రోబో-3 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. బెల్జియంకు చెందిన ప్రోబో-3 ఉపగ్రహం బుధవారం తెల్లవారుజామున భారీ భద్రత నడుమ ప్రత్యేక వాహనంలో షార్‌కు చేరింది. ఇప్పటికే పీఎస్ఎల్వీ వాహక నౌక అనుసంధాన పనులు షార్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. దీనిని డిసెంబరు తొలి వారంలో ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

స్టూడెంట్ కిట్లకు పరిపాలనా అనుమతి

- 954 కోట్ల అంచనాతో టెండర్లు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద ఇవ్వబోయే స్టూడెంట్ కిట్ల కొనుగోలుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 36 లక్షల మందికి గతేడాది ధరలతో కిట్లు కొనుగోలు చేసేందుకు రూ.953.71 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందులో రూ.175 కోట్లు కేంద్రం వాటా ఉంది. ఈ అంచనాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలో టెండర్లు పిలవనున్నారు. గతేడాది కంటే కిట్ల రేట్లు తగ్గుతాయని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. కాగా ఈసారి కొత్త రంగుల్లో యూనిఫాం ఇవ్వాలని నిర్ణయించారు.

అల్లు అర్జున్‌కు హైకోర్టులో ఊరట

- నంద్యాల పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేత
- ఇద్దరు స్నేహితులు కలవడాన్ని నేరంగా పరిగణించలేం
- ఇలాంటి కేసు నమోదు చేయడం మతి లేని చర్య
- తీర్పులో న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ వ్యాఖ్యలు



అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ సినీనటుడు అల్లు అర్జున్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డిపై నంద్యాల పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ బుధవారం తీర్పు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఈ ఏడాది మే 11న అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వచ్చారు. ఈ విషయం తెలిసిన అభిమానులు, ప్రజలు కిశోర్‌రెడ్డి ఇంటికి చేరకున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున అంతమంది ఒకేచోటికి చేరడం ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించినందుకు అల్లు అర్జున్, కిశోర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని నంద్యాల రూరల్ డిప్యూటీ తహశీల్దార్ పి.రామచంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నంద్యాల టూటౌన్ పోలీసులు అల్లు అర్జున్, కిశోర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వారిరువురూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు ముగియంతో న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. బుధవారం నిర్ణయాన్ని వెల్లడించారు.

తీర్పులో ఏముందంటే...

'సినీనటుడు అల్లు అర్జున్, రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఇద్దరూ స్నేహితులు. కిశోర్‌రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వెళ్లడం పూర్తిగా వారి వ్యక్తిగత వ్యవహారం. వీరిద్దరి పిలుపు మేరకు అభిమానులు కిశోర్‌రెడ్డి ఇంటి వద్దకు వచ్చినట్లు ఎలాంటి ఆరోపణ లేదు. గుంపుగా చేరిన అభిమానులను చెదరగొట్టాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిది. అందుకు బదులుగా డిప్యూటీ తహశీల్దార్ క్రిమినల్ చర్యలకు ఉపక్రమించి తప్పుడు మార్గాన్ని అనుసరించారు. డిప్యూటీ తహశీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎప్పటి నుంచో అమల్లో ఉన్న చట్ట నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పులు ఉల్లంఘిస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక స్నేహితుడు... మరో స్నేహితుడిని కలవడాన్ని నేరంగా పరిగణించలేం. పోలీసులు కేసు నమోదు చేయడం మతి లేని చర్య. ఇలాంటి ఎఫ్ఐఆర్‌ను ఉనికిలో ఉంచడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది. ఈ నేపథ్యంలో పిటిషనర్లపై నమోదు చేసిన కేసును కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాజుకు ఊరట

- ఎమ్మెల్సీగా సభ్యత్వం పునరుద్ధరించిన హైకోర్టు
- వాదన వినకుండా సభ్యత్వం రద్దు సరికాదు
- అది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం
- వాదన విని నిర్ణయం వెలువరించండి
- అప్పటిదాకా సభ్యత్వం పునరుద్ధరిస్తున్నాం: హైకోర్టు
- మండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు



అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు హైకోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీగా ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ బుధవారం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. వాదన వినిపించేందుకు అవకాశం ఇవ్వకుండా రఘురాజుపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టింది. చైర్మన్ చర్య సహజ న్యాయసూత్రాలు, చట్ట నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. ఎమ్మెల్సీగా గెలిచిన పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఈ వ్యవహారాన్ని తిరిగి శాసనమండలి చైర్మన్ వద్దకు పంపింది. పిటిషనర్ వాదన విని తగిన నిర్ణయం వెల్లడించాలని స్పష్టం చేసింది. అప్పటివరకు రఘురాజు సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జీ నరేందర్, జస్టిస్ టీ చంద్ర ధనశేఖర్‌తో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు ఇచ్చింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకుపాల్పడుతున్నారని శాసనమండలి వైసీపీ పక్ష విప్ పాలవలస విక్రాంత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఈ ఏడాది జూన్ 3న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇందుకూరి రఘురాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మండలి చైర్మన్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌కు 2027 నవంబరు 27వరకు ఎమ్మెల్సీగా కొనసాగేందుకు అర్హత ఉందన్నారు. రఘురాజు సతీమణి తెలుగుదేశం పార్టీలో చేరారనే కారణంగా ఆయనపై అనర్హత వేటు వేయాలని వైసీపీ ఫిర్యాదు చేసిందన్నారు. సతీమణి చర్యలకు పిటిషనర్‌ను బాధ్యుడిని చేయడం సరికాదని తెలిపారు. వైసీపీ గురించి పిటిషనర్ వ్యతిరేక ప్రకటనలు చేయలేదన్నారు. పత్రికలు, మీడియాలో వచ్చిన కథనాలు ఆధారంగా పిటిషనర్ పై అనర్హత వేటు వేశారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ విషయంలో శాసనమండలి చైర్మన్ సహజ న్యాయసూత్రాలను అనుసరించలేదన్న వాదనతో ఏకీభవిస్తున్నామన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం...'పత్రికలు, మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పిటిషనర్ పై ఫిర్యాదు చేసినట్లు కనపడుతోంది. ఆ కథనాల్లో వాస్తవికత ఎంతో చైర్మన్ తేల్చలేదు. తన భార్యతో పాటు అనుచరులను పార్టీ మారాలంటూ పిటిషనర్ ప్రోత్సహించినట్లు ఆధారాలు లేవు. శస్త్ర చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరానని, విచారణను వాయిదావేయాలని పిటిషనర్...మండలి చైర్మన్‌ను అభ్యర్థించారు. అయితే సంబంధిత డాక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రం సమర్పించలేదని, ఆస్పత్రి పరిపాలనాధికారి ఇచ్చిన సర్టిఫికెట్ చెల్లుబాటు కాదంటూ చైర్మన్ విచారణను కొనసాగించడాన్ని తప్పుపట్టింది. సంబంధిత సర్టిఫికెట్ నకిలీదని చైర్మన్ నిర్ధారించని విషయాన్ని ప్రస్తావించింది. "ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను విమర్శించడం, వ్యక్తుల నిర్ణయాలకు వ్యతిరేకంగా భావాలను వ్యక్తీకరించడం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలుగా గుర్తించలేం. భార్య చర్యలను ఖండించలేదనే కారణంతో అనర్హత వేటు వేయడం సరికాదు. పిటిషనర్ పై అనర్హత వేటు వేసేందుకు చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులలో ఒక్కటి కూడా సరైన కారణం లేదు. వాదనలు చెప్పుకొనేందుకు అవకాశం కల్పించకుండా అనర్హత వేటు వేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు పలు తీర్పులు ఇచ్చాయి. అందువల్ల, అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నాం. పిటిషనర్ వాదన విని తగిన నిర్ణయం వెల్లడించేందుకు వీలుగా వ్యవహారాన్ని తిరిగి ట్రిబ్యునల్ (మండలి చైర్మన్) వద్దకు పంపిస్తున్నాం. అప్పటివరకు వరకు రఘురాజు సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తున్నాం" అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.



కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సులో పురందేశ్వరి

కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సులో మహిళా సాధికారతపై చర్చ: పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌లో దేశంలో మహిళా సాధికారత కోసం ప్రధాని మోదీ చేపడుతున్న సానుకూల, కచ్చితమైన అంశాలను వివరంగా చర్చించామని తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సదస్సులో చర్చిస్తున్న అంశాల పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ పార్లమెంటరీ దేశాల ప్రతినిధులతో కలసి ఉండడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. దేశంలో చేపడుతున్న అనేక పథకాలను సవివరంగా వివరించడానికి ఈ సదస్సు ద్వారా మంచి అవకాశం దొరికిందని, 8వ తేదీ వరకూ కాన్ఫరెన్స్ చర్చల్లో పాల్గొని 11వ తేదీన స్వదేశానికి తిరిగి వస్తానని పురందేశ్వరి పేర్కొన్నారు.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి ఇల్లు, కంపెనీలపై ఐటీ నజర్

- శ్రీనివాస్ వ్యాపార భాగస్వాముల నివాసాల్లో కూడా అధికారుల సోదాలు
- రూ.కోట్ల ఆదాయానికి సంబంధించి పన్నులు ఎగవేసినట్టు ఆరోపణలు
- పశ్చిమ, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో ఏకకాలంలో దాడులు చేసిన అధికారులు

భీమవరం క్రైం/సింగరాయకొండ/నాగాయలంక, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వ్యాపారాలపై ఆదాయపు పన్నుశాఖ(ఐటీ) అధికారులు దాడులు చేశారు. రూ.కోట్ల వ్యాపారాలకు సంబంధించి పన్నులు ఎగవేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన నివాసం సహా గ్రంధి వ్యాపార భాగస్వాముల ఇళ్లు, వ్యాపార సంస్థలలోనూ సోదాలు నిర్వహించారు. పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో బుధవారం ఏకకాలంలో ఐటీ అధికారులు ఈ దాడులు చేశారు. కేంద్ర పోలీసు బలగాల భద్రత నడుమ బుధవారం ఉదయం ఐటీ అధికారులు భీమవరంలోని గ్రంధి ఇంటికి చేరుకుని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కీలక పత్రాలు లభ్యమైనట్టు సమాచారం. రొయ్యల వ్యాపారంలో గ్రంధి శ్రీనివాస్‌కు ప్రాసెసింగ్ యూనిట్‌లు ఉన్నాయి. భీమవరంలోని ఇతర రొయ్యల వ్యాపారులతో లావాదేవీలు సాగించినట్టు కూడా రికార్డుల్లో ఉన్నట్టు తెలిసింది. గ్రంధి నివాసంలో ఐటీ సోదాలు జరగడం ఇది రెండోసారి. మూడు దశాబ్దాల క్రితం ఒకసారి తనిఖీలు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు తనిఖీలు చేశారు.



ప్రకాశం జిల్లాలోని పాత సింగరాయకొండ పరిధిలో ఉన్న జీవీఆర్ కంపెనీ

ప్రకాశంలోని జీవీఆర్ కంపెనీలో

ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సాగర్ గ్రంధి ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్(జీవీఆర్)లో కూడా ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇది గ్రంధి శ్రీనివాస్‌కు చెందిన రొయ్యల ప్రాసెసింగ్, ఎక్స్‌పోర్ట్ కంపెనీ. 11 మంది ఐటీ అధికారులు కంపెనీకి చెందిన రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. సోదాల అనంతరం పలు కీలక రికార్డులను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

నాగాయలంకలో

కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన ప్రముఖ రొయ్యల వ్యాపారి, గ్రంధి శ్రీనివాస్ వ్యాపార భాగస్వామి చెన్ను లక్ష్మణరావు(సీఎల్ రావు) నివాసంలో కూడా ఐటీ అధికారులు సోదాలు చేశారు. తెలంగాణకు చెందిన 9 మంది ఐటీ అధికారులు.. ఆ శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో నాగాయలంకలోని లక్ష్మణరావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. లక్ష్మణరావుకు వక్కపట్లవారిపాలెంలో రొయ్యల కంపెనీ, అవనిగడ్డలో ఐస్ ఫ్యాక్టరీ ఉన్నాయి. అయితే, ఐటీ అధికారులు ఐదు చోట్ల సోదాలు చేసినట్లు సమాచారం. లక్ష్మణరావు 20ఏళ్ల కిందటే నాగాయలంకకు వచ్చి రొయ్యల వ్యాపారం ప్రారంభించారు. ఈ క్రమంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తోనూ కలిసి వ్యాపారం చేస్తున్నారు. లక్ష్మణరావు, గ్రంధి శ్రీనివాస్ భాగస్వామ్యంలో ఇటీవల రూ.75 కోట్ల మేరకు ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు తెలిసింది. అయితే, దీనికి సంబంధించి ఆదాయ పన్నులు చెల్లించకపోవడంతో ఐటీ అధికారులు దాడులు చేసినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రెండో రాకడ...!

డొనాల్డ్ ట్రంప్ మళ్ళీ అమెరికా అధ్యక్షుడయ్యారు. అభ్యర్థులు ఇద్దరి మధ్యా ఈ మారు పోటీ గట్టిగా ఉందనీ, అయినా, కమలదే పైచేయి కాబోతున్నదన్న సర్వేలన్నీ తారుమారైనాయి. కమల మరీ ఇంతదూరంలో నిలిచిపోవడం ఆశ్చర్యపరిచింది. రెండుపర్యాయాలు వరుసగా గెలవడం గతంలో ఉన్నది కానీ, ఒక విడత విరామం తరువాత తిరిగి అధ్యక్షుడు కావడం అమెరికా చరిత్రలో నూటముప్ఫైయ్యేళ్ళ తరువాత ఇదేనట. రెండు దశాబ్దాల తరువాత పాపులర్ ఓటు కూడా సాధించిన రికార్డు కూడా ట్రంప్‌కు దక్కింది. ఈ ఘన విజయానికి ఏయే అంశాలు దోహదం చేశాయో, నాలుగేళ్ళలోనే అమెరికన్లు ఆయనమీద మళ్ళీ ఎందుకంతగా మనసుపడ్డారో రాబోయే కాలంలో మరింత లోతుగా తేలుతుంది.

ట్రంప్ పునరాగమనాన్ని స్వదేశంలోని ఆయన అభిమానులు తప్ప మిగతా ప్రపంచం ఏమాత్రం హర్షించడం లేదని అమెరికన్ పత్రిక ఒకటి వ్యాఖ్యానించింది. ప్రచారాన్ని విద్వేషపూరిత వ్యాఖ్యలతో దట్టించడం, అక్రమవలసదారుల గుప్పిట్లో తనదేశం బందీగా ఉన్నదని వాపోవడం, అమెరికాను విముక్తంచేస్తానని ప్రకటించడం తెలిసినవే. పరోక్షంగానో, ప్రత్యక్షంగానో రంగు, జాతి ప్రస్తావనలు లేకుండా, అవమానకరంగానో, వివక్షాపూరితంగానో ఇతరులపట్ల వ్యాఖ్యానించకుండా ఆయన ఉండలేడు. ఇక మహిళల విషయంలో ఆయన వ్యక్తిగత ప్రవర్తన, మాటల్లో చులకనభావం గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. అధ్యక్ష ఎంపికలో ఇవన్నీ పనిచేస్తాయని మిగతా ప్రపంచం ఆశించడం సహజం. కానీ, ఆయన మీద ఉన్న డజనుకుపైగా కేసులు ఓటర్లను పెద్దగా ప్రభావితం చేసినట్టు లేదు. గతంలో తనను ప్రజలు గద్దెదించినందుకు కోపించి, వారిచ్చిన ఆ తీర్పును వమ్ముచేసేందుకు అన్ని కుట్రలూ చేసి, ఆఖరుకు తన కార్యకర్తలను చట్టసభలమీద దాడికి ఉసిగొల్పిన ఆ ఘట్టాన్ని కూడా ఓటర్లు విస్మరించినట్టే కనిపిస్తోంది. ఏ మాత్రం ఊగిసలాడకుండా తెల్లజాతివారు ఆయనకు అండగా ఉన్న విషయం తెలుస్తూనే ఉంది. అక్రమవలసలు, అడ్డుగోడల మాటలతో పాటు దేశాన్ని ఆర్థికంగా ఉద్ధరిస్తానన్న హామీ కూడా వారిని ప్రభావితం చేసినట్టు ఉంది. అధ్యక్ష అభ్యర్థుల చర్చలో తనది పైచేయి కానందుకు, మరోమారు రావడానికి అంగీకరించని ఆయన, ఎన్నికల సభల్లో మాత్రం అసత్యాలు, అర్థసత్యాలతో ప్రజలను నెగ్గుకురాగలిగారు. జరిగిన హత్యాయత్నం, ఆ సందర్భంలో ఆయన కనబరిచిన ధైర్యం, ఇచ్చిన నినాదాలు, మొత్తంగా ఆ దృశ్యం ఓటర్ల మనసులో నిలిచివుండవచ్చు.

ఇప్పుడు సెనేట్ మీద కూడా రిపబ్లికన్లకు గట్టిపట్టు దొరికింది కనుక ఇక ట్రంప్ దూకుడుకు అడ్డం ఉండదు. పలు అంతర్జాతీయ ఒప్పందాలనుంచి అమెరికాను తప్పించిన ఘనమైన గతం ఆయనది. పర్యావరణ పరిరక్షణ అంటే పడదు కనుక, పారిస్ ఒప్పందం నుంచి తప్పుకున్న చరిత్ర ఉన్నది కనుక, మిగతా ప్రపంచం ఎంత మొత్తుకున్నా, కాలుష్య నియంత్రణ చర్యలకు ఆయన సిద్ధపడడు. ఇరాన్‌తో ఒబామా సాధించిన అణు ఒప్పందాన్ని రద్దుచేసి, ప్రపంచాన్ని ప్రమాదంలో పడవేసిన ట్రంప్ ఇప్పుడు మారిన పరిణామాల నేపథ్యంలో ఇంకెంత దూకుడుగా వ్యవహరిస్తారో చూడాలి. తాను అమెరికా గద్దెమీద ఉన్నట్టయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వచ్చేది కాదని ట్రంప్ అంటున్నారు. నాటో కోసం వెంపర్లాడే లక్షణం లేదు కనుక, ఉక్రెయిన్‌కు ఎక్కువ నష్టంతో పుతిన్ పక్షాన నిలబడతాడన్న విశ్లేషణలను అటుంచితే, అనతికాలంలోనే యుద్ధాన్ని ముగిస్తానన్న ఆయన హామీ కాస్తంత ఆలస్యంగానైనా నెరవేరవచ్చు. కానీ, గాజాతో ఆరంభించి ఇరాన్‌వరకూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ విస్తరించిన ఆ యుద్ధాన్ని ఆపే విషయంలో ట్రంప్ అంత ఉత్సాహం చూపే అవకాశాలైతే లేవు. నెతన్యాహూకు మరింత సాయంతో, ఇంకొంత విధ్వంసంతో యుద్ధాన్ని ముగిస్తే ట్రంప్‌కు చాలు. సమస్త విషయాల్లోనూ చైనాతో ఆయన గతంలో ప్రదర్శించిన కయ్యం, తదనుగుణంగా భారత్‌తో పెరిగిన బాంధవ్యం తెలిసిందే. ఈ మారు కూడా ఆ వాతావరణంలో పెద్ద మార్పేమీ ఉండబోదు. భౌగోళిక రాజకీయాల్లో భారత్‌కు నిర్దేశించిన పాత్రను ప్రశస్తంగా పోషించడంతో పాటు, ట్రంప్‌తో ప్రధాని మోదీకి ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యం కూడా మనకు ఇతరత్రా విషయాల్లో ఉపకరించవచ్చు.

ట్రంప్ గెలుపు మేలుమలుపా?

వాస్తవం ఒక్కటే! వ్యాఖ్యానాలు ఎన్నో! అమెరికా 47వ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ విజయంపై కూడా ఎన్నో వ్యాఖ్యానాలు చేయవచ్చు. ఏ విషయంపైనా అన్ని వ్యాఖ్యానాలు ఒకే స్థాయిలో ఉండవు. మౌలిక వ్యాఖ్యానం అంటూ ఒకటి ఉంటుంది. ట్రంప్ విజయంపై కూడా అటువంటి మౌలిక వ్యాఖ్యానం నిస్సందేహంగా చేయవచ్చు! దీని కోసం ట్రంప్‌కు వచ్చిన ఓట్లో, ఆయనకు పట్టం కట్టిన రాష్ట్రాల జాబితానో చూడనక్కర్లేదు. 2016 నుంచి ట్రంప్‌ది ఒకటే బాట. ఆ బాటను బట్టే ట్రంప్ విజయంపై మౌలిక వ్యాఖ్యానం చేయవచ్చు. ఆ బాట స్వభావంపై ఇప్పటికే చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవి సృష్టించే విపరిణామాల గురించి చాలా వ్యాఖ్యానాలూ వెలువడ్డాయి. ఆ బాటను అనుసరించి మున్ముందు మరింత ఉధృతంగా రాజకీయాలు నడిస్తే ప్రజాస్వామ్యానికి, ప్రపంచానికి మంచే జరుగుతుందని విశ్వసించలేం! అమెరికా ప్రయోజనాలనే అన్నింటా ముందు నిలబెడతామన్న ట్రంప్ నినాదాన్ని పైపైన చూస్తే అసహజంగా అనిపించదు. జాతీయవాద దృష్టితో ఆ నినాదం ఇచ్చారని సరిపెట్టుకునే పరిస్థితీ లేదు. లోతుగా చూస్తే పొంచి ఉండే ప్రమాదాలు కనపడతాయి.

ఏ నినాదం అందరికీ ఒకేలా అర్థాన్ని ఇవ్వదు. భిన్న వర్గాలు, దేశాల ప్రజలకు అది విభిన్నంగా అర్థం అవుతుంది. అసలు సిసలైన అమెరికన్లకు దేశంలో ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయనీ, అమెరికా ఉత్పత్తుల అమ్మకాలకు అన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయన్నదే ట్రంప్ నినాదం సారాంశంగా భావించొచ్చు. ట్రంప్ పదేపదే చెబుతున్నట్లుగా.. అమెరికా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు కారణం నాలుగు దశాబ్దాలుగా ఆ దేశ పాలకులు అనుసరించిన విధానాలేనని ఇటీవల చరిత్రను చూస్తే ఎవరికైనా స్పష్టమవుతుంది. అందులోనూ రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష పగ్గాలు చేపట్టిన రోనాల్డ్‌రీగన్ 1980ల్లో మొదలుపెట్టిన ఆ విధానాలలోనే అమెరికా ఇప్పుడు ఎదుర్కొంటున్న పరిస్థితికి మూలాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక విధానాలను నయానా భయాన సరళీకరించి విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచేలా చేసింది అమెరికా విధానకర్తలే. చౌక శ్రమ, చౌక ముడిసరుకులు పుష్కలంగా లభ్యమయ్యే ప్రాంతాలకూ దేశాలకూ అమెరికా పరిశ్రమలు తరలిపోవటానికి ప్రోత్సాహకాలు ఇచ్చింది వారే. ఆసియా దేశాల పారిశ్రామిక ఉత్పత్తులపై ఆధారపడే విధంగా అమెరికా మార్కెట్‌ను మలిచింది వారే. ఫలితంగా పారిశ్రామిక రంగంలో ఉద్యోగాలు పోయాయి. ఒకనాటి పారిశ్రామిక ప్రాంతాలు మ్యూజియంలుగానో, నిర్జన ప్రదేశాలుగానో మారిపోయాయి. పోయిన ఉద్యోగాలకు సమానంగా కొత్త ఉద్యోగాలు రాని మాట నిజమే. 1990ల నుంచి బాగా ఊపందుకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక దశ దాటిన తర్వాత అవసరమైన స్థాయిలో అమెరికన్ యువతకు ఉద్యోగాలను సృష్టించలేదు. ఈ రంగంలో కూడా చౌకగా లభ్యమయ్యే ఆసియా నిపుణులే ఎక్కువగా లబ్ధి పొందారు. అలా లబ్ధి పొందేలా ఆ నిపుణులను రప్పించుకున్నదీ వారే! ఇటీవల వచ్చిన కృత్రిమ మేధో సాంకేతిక పరిజ్ఞానం వల్ల కూడా ఊడిపోయే ఉద్యోగాలతో పోల్చితే సృష్టి అయ్యే ఉద్యోగాల సంఖ్య తక్కువే. కోవిడ్ అనంతరం ఐటీ రంగంలో హేమాహేమీలు అనదగిన కంపెనీలు కూడా పోటీలు పడి ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఉన్నత ఉద్యోగాలను ప్రధానంగా ఆసియా వాసులు, కిందిస్థాయి ఉద్యోగాలను హిస్పానిక్‌లు దక్కించుకోవటం అమెరికాలో సహజంగా జరిగిపోయింది. దీనికి ఎవరినైనా నిందించదలిస్తే మొదటగా వేలెత్తి చూపాల్సింది అమెరికా కార్పొరేట్ సంస్థలని, అక్కడి విధానకర్తలను తప్ప వేరే దేశాలని కాదు.



> అమెరికా రాజకీయాల్లో ట్రంప్ నిర్వహిస్తోన్న పాత్రను చూస్తే రానున్న కాలంలో ప్రపంచం చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. నియంతలే కాకుండా, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారం చేపట్టి నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్న నేతలు ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టటాన్ని తమకు సానుకూలంగా భావిస్తున్నారు. రష్యా అధినేత పుతిన్ కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. రష్యా పెట్టే షరతులకు ఉక్రెయిన్ అంగీకరించేలా చేసి యుద్ధాన్ని విరమింపచేస్తానని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ నేత నెతన్యాహుకు కూడా ట్రంప్ పట్ల వ్యతిరేకత ఉందని చెప్పలేం. హమాస్ నిర్మూలన పేరుతో గాజాలో సాగుతున్న నరమేధాన్ని ఆపేలా ట్రంప్ తనపై ఒత్తిడి తెస్తారని ఇజ్రాయెల్ పాలకవర్గాలూ భావించటం లేదు.

ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ప్రధానంగా మధ్య తరగతి శ్వేత జాతీయులను ఆకర్షించడమే లక్ష్యంగా చేసుకుని రాజకీయాలను మొదలుపెట్టారు. మొదటిదఫా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడేనాటికే ఆ దిశలో అడుగులు వేసి విజయం సాధించారు. శ్వేతజాతి మధ్యతరగతికి ఉద్యోగ అవకాశాలు దక్కకపోవటానికి విదేశాలే కారణమని దుమ్మెత్తిపోశారు. తన ఉత్పత్తులతో అమెరికా మార్కెట్‌ను ముంచెత్తిన చైనాతో మొదలుపెట్టిన రాజకీయ యుద్ధంలో అవసరమనుకున్న చోట భారత్‌నీ లాగారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ విపరీతంగా దిగుమతి సుంకాలు విధిస్తోందని విరుచుకుపడ్డారు. తాజా ఎన్నికల్లో అయితే మంచి జీతాలుండే ఉద్యోగాలన్నిటినీ భారతీయులు కొట్టేస్తున్నారనీ ఆక్షేపించారు. వివిధ రంగాల్లో అమెరికా ఆధిపత్యం తగ్గటానికి, ఉద్యోగాల క్షీణతకు ఇతర దేశాల చర్యలే కారణమన్నట్లుగా ఆయన చేసిన ప్రచారానికి లక్ష్యం శ్వేత జాతీయులను ఆకర్షించడమే. అమెరికా జనాభాలో 60 శాతానికి కాస్త అటుఇటుగా ఉన్న శ్వేతజాతీయులను తనవైపు తిప్పుకోవటంలో మొదటిసారిలాగే రెండోసారి విజయం సాధించారు. ఆయన తాజా విజయానికి మహా వ్యాఖ్యానంగా దీన్నే చెప్పుకోవాలి. అమెరికన్ అస్తిత్వానికి ముఖ్యంగా శ్వేతజాతీయుల ఆధిపత్యానికి ముప్పు ముంచుకొస్తుందనే ఒకరకమైన భయాన్ని, ఆందోళనను కలిగించటంలో ట్రంప్ సఫలీకృతమయ్యారు. అణగారిన వర్గాలే తమ అస్తిత్వాన్ని కాపాడుకోటానికి పోరాటాలు చేస్తాయన్న సూత్రీకరణ అన్ని సందర్భాల్లోనూ నిజం కాదు! ఆధిపత్య వర్గాలను ఆధారం చేసుకుని కూడా అస్తిత్వ రాజకీయాలను నడపొచ్చు అనటానికి పదేళ్ల నుంచి అమెరికాలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం. ఏదో విధంగా జనాకర్షణే ప్రధానం అనుకుని రాజకీయాలు చేసే వారికి నిరంతరం వైరి వర్గాలు కావాలి. ఆ వైరివర్గాల వల్లే సకల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పటం నిరంతరం జరగాలి. ఉద్యోగ భద్రతను, ఉద్యోగ కల్పనను తగినంత ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థ అభద్రతా సమాజాన్ని సృష్టిస్తుంది. 1990ల తర్వాత మరీ ముఖ్యంగా 2007–2008 ఆర్థిక సంక్షోభం తర్వాత అభద్రతా భావం అమెరికా ప్రజల జీవితాల్లోకీ చొచ్చుకు వెళ్లింది. అభద్రతాభావనలో వేగిపోయే వారి ముందు శత్రువులుగా కొన్ని దేశాలనూ, కొన్ని వర్గాలను ప్రవేశపెట్టటంలోనే జనాకర్షణ నేతల విజయం దాగివుందని చెబుతూ ప్రముఖ ఆర్థికవేత్త ప్రణబ్‌బర్ధన్ అభద్రతా ప్రపంచం పేరుతో ఒక పుస్తకాన్నే రాశారు. అన్ని చోట్లా వ్యాపిస్తున్న అభద్రతా సమాజం ప్రజాస్వామ్యంలో ఉదాత్త సంప్రదాయాలను పలచనచేసి ఉన్మత్త, నిర్హేతుక నినాదప్రాయులైన నాయకులను ఎలా సృష్టిస్తోందో కూడా ప్రణబ్ బర్ధన్ విశ్లేషించారు.

అమెరికా రాజకీయాల్లో ట్రంప్ నిర్వహిస్తోన్న పాత్రను ప్రణబ్ బర్ధన్ కోణం నుంచి చూస్తే రానున్న కాలంలో ప్రపంచం చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల్లో మార్పుని చూడటం సహజం. కానీ ట్రంప్‌ని నిశితంగా చూసిన వారెవరూ ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చిందని భావించటం లేదు. నియంతలే కాకుండా, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారం చేపట్టి నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్న నేతలు ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టటాన్ని తమకు సానుకూలంగా భావిస్తున్నారు. రష్యా అధినేత పుతిన్ కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. రష్యా పెట్టే షరతులకు ఉక్రెయిన్ అంగీకరించేలా చేసి యుద్ధాన్ని విరమింపచేస్తానని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ నేత నెతన్యాహుకు కూడా ట్రంప్ పట్ల వ్యతిరేకత ఉందని చెప్పలేం. హమాస్ నిర్మూలన పేరుతో గాజాలో సాగుతున్న నరమేధాన్ని ఆపేలా ట్రంప్ తనపై ఒత్తిడి తెస్తారని ఇజ్రాయెల్ పాలకవర్గాలూ భావించటం లేదు. మానవహక్కుల గురించి డెమొక్రటిక్ పార్టీ సిద్ధాంతపరంగానైనా ఎంతో కొంత మాట్లాడుతుంది. రిపబ్లికన్ పార్టీకి ఈ విషయంపై డెమొక్రాట్లంతగా నోరు విప్పిన చరిత్ర లేదు. ఐరాస, ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటి అంతర్జాతీయ సంస్థలపై మొదటి దఫా అధ్యక్షుడైనపుడే ట్రంప్ చాలా విమర్శలను ఎక్కుపెట్టారు. ఈసారి అయినా వాటిపట్ల ట్రంప్ ధోరణి మారుతుందన్న నమ్మకం లేదు. వీటన్నిటికంటే ముఖ్యమైంది వాతావరణ మార్పులపై కార్యాచరణ. అసలు వాతావరణ మార్పులే ప్రమాదకరంగా లేవనీ ప్రమాదకరమని ప్రచారం చేసే వాళ్లవి డొల్ల వాదనేనని ట్రంప్ అనేకసార్లు ఈసడించారు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు తాను గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రకటించారు. పాత వైఖరికే కట్టుబడి ట్రంప్ వ్యవహరిస్తే ప్రపంచానికి వాతావరణపరంగా గడ్డుకాలం తప్పదనే అనుకోవాలి.

> అణగారిన వర్గాలే తమ అస్తిత్వాన్ని కాపాడుకోటానికి పోరాటాలు చేస్తాయన్న సూత్రీకరణ అన్ని సందర్భాల్లోనూ నిజం కాదు! ఆధిపత్య వర్గాలను ఆధారం చేసుకుని కూడా అస్తిత్వ రాజకీయాలను నడపొచ్చు అనటానికి పదేళ్ల నుంచి అమెరికాలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం.

ఇతర దేశాల సంగతెలా ఉన్నా ట్రంప్ గెలుపుతో భారత్‌కు లాభిస్తుందనే వారి సంఖ్య తక్కువేమీ కాదు. ట్రంప్ అతి జాతీయవాదంతో ఏకీభావం ఉండొచ్చు. కానీ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నకాలంలో భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు అభద్రతతో వణికిపోయారు. చదివిన డిగ్రీకి అనుగుణంగా చేస్తున్న ఉద్యోగాల్లేవని వారిని స్వదేశానికి పంపించిన ఘటనలు చాలా ఉన్నాయి. వీసాలను, ఉద్యోగ నిబంధనలను కట్టుదిట్టంచేసి అవకాశాలను కుదించివేస్తారన్న భయం భారతీయుల్లో ఇప్పటికీ ఉంది. ఇక చైనాను కట్టడి చేయటానికి ట్రంప్ ప్రయత్నిస్తారనీ దీంతో అక్కడ నుంచి కంపెనీలు తరలి వస్తాయనే ఆశ ఇక్కడి అధికారపార్టీకి ఉంది. యాపిల్ లాంటి దిగ్గజ కంపెనీయే భారత్‌లో ఐఫోన్ల ఉత్పత్తిని ఇబ్బడిముబ్బడిగా పెంచుతోంది. ట్రంప్ రాజకీయాలే యాపిల్ లాంటి కంపెనీల కార్యకలాపాల తరలింపునకు అసలు కారణమని చెప్పలేం. 1990ల నాటి పరిస్థితి చైనాలో లేదు. అక్కడ వేతనాలు పెరిగాయి. ముడిసరుకుల ధరలు హెచ్చాయి. కంపెనీల దృష్టి భారత్ వైపు మళ్లటానికి ఇవి కీలకపాత్రను పోషించాయి.

ఈ పరిణామాల సంగతి ఎలా ఉన్నా... పరిపక్వత చెందిన ప్రజాస్వామ్య దేశమంటే ఒకనాడు వెంటనే గుర్తుకొచ్చేది అమెరికా. ఇటీవల కాలంలో అక్కడ కూడా జనాకర్షణ రాజకీయం విపరీతంగా పరిపక్వత పొందుతోంది! అభద్రతా భావన అక్కడి ప్రజల్లోనూ రాజ్యమేలుతోంది. నినాదప్రాయ రాజకీయాల్లో నిపుణులైన నేర్పరులే జనాభిమానాన్ని పొందుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఊహించని మలుపులు తిప్పుతున్నారు. అన్ని మలుపులూ మేలుమలుపులు కావన్నదొక్కటే ప్రస్తుతానికి నిజం!



▪ రాహుల్ కుమార్

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

భావజాలాన్ని ఎన్‌కౌంటర్ చేయలేరు!

నరేంద్ర మోదీ, అమిత్ షాలు వామపక్ష పార్టీలను ప్రధాన బద్ధశత్రువుగా చూస్తున్నారు. వామపక్ష భావాలు కలిగిన వారిపై ఊపా, రాజద్రోహం కేసులు పెడుతూ బెయిల్ రాకుండా సంవత్సరాల తరబడి జైళ్ళల్లోనే మగ్గేట్టు చేస్తున్నారు. గొంతెత్తి మాట్లాడే వారి గొంతులను అక్రమ అరెస్టులతో నొక్కుతున్నారు. అర్బన్ నక్సలైట్‌లు అని ముద్రవేస్తున్నారు. ఇప్పుడు మావోయిస్టు ఏరివేత లక్ష్యంగా వందలాది మంది మావోయిస్టులను బలికొన్నారు. వచ్చే ఏడాదికి నక్సలైట్‌లను నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు ఇస్తున్నారు. దీనికి కారణం భారతదేశంలో వామపక్ష పార్టీలు లేకుండా చేయాలన్న దుర్బుద్ధి తప్ప మరొకటి కాదు. మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ ప్రజల మధ్యన చిచ్చుపెట్టే ఆరెస్సెస్ ఆడిస్తున్న నాటకంలో బీజేపీ పాత్ర వహిస్తున్నది.

కమ్యూనిస్టులు వామపక్ష పోరాటాల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పద్ధతులలో హక్కులను పొందాలని ప్రయత్నిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలలో రకరకాల ఆలోచనలు ఉన్నాయి. మావోయిస్టులు తుపాకి గొట్టం ద్వారానే మన హక్కులను సాధించుకుంటామనే ఆలోచనతో పోరాటం చేస్తున్నారు. వారు చేస్తున్న పోరాటం తప్పు కావచ్చు. కానీ భార్యాపిల్లలను వదలి ప్రాణాలకు తెగించి ఎప్పుడు ఎక్కడ తింటారో, నిద్రిస్తారో తెలియని అగమ్యగోచర పరిస్థితులలో సమాజ శ్రేయస్సు కోసమే వారు పోరాడుతున్నారు. దోపిడి వర్గాల అణచివేతలను అరికట్టాలన్న లక్ష్యంతో వారు ఆ పంథాను ఎంచుకున్నారు.



> ఎక్కడ అణచివేత, దోపిడీ ఉంటుందో అక్కడ వామపక్ష పార్టీలు ఉంటాయి. మావోయిస్టు ఉద్యమం తాత్కాలికంగా అణచివేయబడినప్పటికీ అంతరాలు లేని, దోపిడీ రహిత సమాజం ఏర్పడే వరకు దాని ఉనికి, ప్రభావం అలా ఉంటూనే ఉంటాయి.

పార్లమెంట్ పంథాలో పని చేస్తున్న వామపక్షాలు కూడా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. ఎన్నికలు ఐదేళ్ళకు ఒకసారి జరుగుతాయి. ఆ ఎన్నికలతో దేశ ప్రజల జీవన ప్రమాణాలలో మార్పులు రావాలి. కానీ ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓట్ల కోసం నాయకులు అడ్డమైన దారులు తొక్కుతూ డబ్బు, మద్యం, సంక్షేమ పథకాల ఎర చూపి ఓటర్లకు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాసేవకులు కనుమరుగై, హంతకులు, గూండాలు, కార్పొరేట్ సంస్థల అధిపతుల నుంచి రియలెస్టేట్ వ్యాపారుల వరకు ఎంపీలూ ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారు. ప్రజలు గెలవాల్సిన ప్రజాస్వామ్యంలో దోపిడి శక్తులూ, వారికి అండగా నిలిచే మతోన్మాద శక్తులూ గెలిచి అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నాయి. కార్మిక వర్గాలు, బడుగు బలహీన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయి. ఎక్కడ అణచివేత, దోపిడీ ఉంటుందో అక్కడ వామపక్ష పార్టీలు ఉంటాయి.

ఉగ్రవాద చర్యలను సామాజిక, ఆర్థిక అంశంగా గుర్తించి పరిష్కరించే బదులుగా శాంతిభద్రతల సమస్యగా పరిగణించి ఎన్‌కౌంటర్‌లే ప్రధానమని గతంలో భావించారు. ఇప్పటికీ మోదీ ప్రభుత్వం ఇదే ధోరణిని అవలంబిస్తూ ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామంటున్నారు. మావోయిస్టు ఉద్యమం తాత్కాలికంగా అణచివేయబడినప్పటికీ అంతరాలు లేని, దోపిడీ రహిత సమాజం ఏర్పడే వరకు దాని ఉనికి ప్రభావం అలా ఉంటూనే ఉంటుంది.

వామపక్ష తీవ్రవాదానికి ప్రజల పునాది ఉన్నదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. అలాగే ప్రజలు కూడా ప్రజాస్వామ్య ఫలాలు పొందడానికి చైతన్యవంతం కావాలి. పాలకులను ఆలోచింపచేసే విధంగా ప్రజా చైతన్యాన్ని ప్రదర్శించాలి. ఇటీవల ప్రొఫెసర్ సాయిబాబా అకాల మరణం చెందారు. ఇందుకు పాలకులే కారణం. అన్యాయంగా ఊపా కేసులు మోపి 90శాతం కదలలేని స్థితిలో ఉన్న మేధావిని పదేళ్ళు అండా సెల్‌లో బంధించారు. చివరకు కోర్టు నిర్దోషిగా తేల్చింది. హర్యానా ఎన్నికల్లో ఓట్ల కోసం డేరా సచ్చా సౌదా గురువు రాం రహీమ్ సింగ్‌కు బీజేపీ ప్రభుత్వం పెరోల్ ఇచ్చింది. కానీ, ప్రొఫెసర్ సాయిబాబా తల్లి చనిపోయినప్పుడు చూసేందుకు పెరోల్ ఇవ్వలేదు. చివరికి ఆయన నిర్దోషి అని తేలింది. ఏమి లాభం? జైలులో పడిన అష్టకష్టాలతో బైటికి వచ్చిన నెలల్లోనే అనారోగ్యంతో అకాల మృత్యువుకు గురయ్యారు. కేవలం వామపక్ష భావజాలం కలిగి ఉన్నారనే ఒకే ఒక్క కారణంతో ఆయనను బంధించి మానసికంగా హింసించడమే కాకుండా, చివరికి ఆయన మరణానికి కూడా పాలకులు కారణమయ్యారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పేర్లతో మావోయిస్టుల అంతానికి పంతం పట్టింది. వారి ఉద్దేశం ఛత్తీస్‌గఢ్ ఇతర అటవీ ప్రాంతాలలో ఆదివాసీల అభిమానాన్ని చూరగొన్న మావోయిస్టులను నిర్మూలించి, ఆ పచ్చని అడవిలోని వనరులనూ, గనులనూ తమ వందిమాగధ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే అన్న మాట ప్రచారంలో ఉంది.

ఇలాంటి తరుణంలో మావోయిస్టులు కూడా అంతర్మథనం చేసుకుంటూ ప్రత్యామ్నాయ ఆలోచనలకు పదును పెట్టాలి. ప్రజాస్వామ్య పద్ధతులలోనే ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను తిప్పికొట్టాలి. చావుకు చావు అనే సిద్ధాంతం నుండి వైదొలగి కమ్యూనిస్టులతో కలిసి ఐక్యపోరాటం చేసి వర్గరహిత సమాజాన్ని నిర్మించాలి.

వివిధ పార్టీలుగా చీలిపోయిన కమ్యూనిస్టులు, మావోయిస్టులు, ఇతర వామపక్ష శక్తుల మధ్య అనుసరించే మార్గంపై భిన్నాభిప్రాయాలు వుండవచ్చే తప్పా సమసమాజ స్థాపనే అందరి అంతిమ లక్ష్యం. మితవాద, మతవాద శక్తుల నుంచి దేశం తీవ్ర ప్రమాదం ఎదుర్కొంటున్న ఈ దశలో వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా దానిని తిప్పికొట్టాలి.

• చాడ వెంకటరెడ్డి
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

వంద శాతం నమోదు సాధ్యమే!

చదువుల పండగ, బడికి పోతాం– అంటూ దశాబ్దాల కాలం నుంచి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ బడి బైటి పిల్లలను బడుల్లో చేర్చలేకపోతున్నాం. రాష్ట్రంలో ఇంటర్ వరకు చదివిన తర్వాత 3,58,218 మంది విద్యార్థులు బడి బయట ఉన్నారని, పదవ తరగతి ఉత్తీర్ణులైన తర్వాత 1,55,427 మంది బడి బయట ఉన్నారని, 1 నుండి 10వ తరగతి వరకు బడి బయట ఉన్న పిల్లల సంఖ్య 2,02,791 అని పాఠశాల విద్యాశాఖ లెక్క తేల్చింది.

రాష్ట్ర విద్యాశాఖ జిల్లాల్లోని విద్యాశాఖ అధికారులను ఆదేశిస్తూ బడి బయట పిల్లలు ఎవరు లేకుండా 100 శాతం నమోదు కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఈ కార్యక్రమానికి కొన్ని లక్ష్యాలను నిర్దేశించారు. వీటి ప్రకారం– అర్హత ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లోకి 100 శాతం నమోదు చేయాలి, 6–14 సంవత్సరాల వయస్సు గల పిల్లలెవరూ పాఠశాలలకు దూరంగా ఉండకుండా చూసుకోవాలి.

సమగ్ర శిక్షా జిల్లా విద్యా అధికారులు, అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు బడి బయట ఉన్న పిల్లలను రెగ్యులర్ పాఠశాలలు/ కెజిబివిలు/ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నమోదు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, హెడ్‌మాస్టర్లు, గ్రామ విద్యా సంక్షేమ సహాయకులు, వార్డు వాలంటీర్లు నిర్దేశించిన ప్రొఫార్మాలో నమోదు డేటాను ప్రతి వారం తప్పనిసరిగా రాష్ట్ర ఎస్ఎస్ కార్యాలయానికి పంపించాలని ఆదేశాలు వచ్చాయి. బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం వసతి గృహాలు పునరావాస కేంద్రాలను బలోపేతం చేయాలి. సమస్య ఎక్కువ ఉన్న చోట ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తే వలసలు ద్వారా ఏర్పడే డ్రాప్ అవుట్లను తగ్గించవచ్చు. బాల కార్మికులచేత పని చేయించుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యాశాఖ విభాగాలు చిత్తశుద్ధితో పనిచేస్తే 100 శాతం నమోదు సాధ్యమే.

– సి.వి. ప్రసాద్
రాష్ట్ర అధ్యక్షులు, ఏపీటీఎఫ్ అమరావతి

గాంధర్వ యోగి... సంగీత రత్నాకరుడు

> ద్వారం వెంకటస్వామి నాయుడు వయోలిన్ వాయిస్తే పంచదశ గమకాలు వినిపిస్తూ అందులో రవ్వ, పొడి ప్రత్యేకంగా శ్రావ్యంగా ఉంటాయి. ఎవరి వాద్యంలో వినపడని నాదశుద్ధి నాయుడుగారి చేతిలోనే వినపడుతుంది. కర్ణాటక బాణీలో వయోలిన్ వాద్య విద్యకు ఆయన సింహద్వారం వంటివారు. 'నాయుడుగారూ! మీ వ్రేళ్ళు ఘనరాగ పంచకం! మీ శరీరమాకాశం! మీ హస్తం హరివిల్లు! చిత్రచిత్ర వర్ణాలు శ్రీవారి వ్రేళ్ళు! మీ వ్రేళ్ల పలికే వేళల విశ్వరూపమే వినిపిస్తుంది కనిపిస్తుంది' అని ద్వారం వారికి సన్నిహితుడు అయిన 'రుధిరజ్యోతి' కవి శ్రీరంగం నారాయణ బాబు కీర్తించారు.



శాస్త్రీయ సంగీతంలో ఎందరెందరో ఫిడేలు వాయిద్యాన్ని చేతపట్టినా భారతావనిలో ఒకే ఒక్కరికి 'ఫిడేలు నాయుడుగారు' అనే పేరు లభించడటం ఆంధ్రులకు గర్వకారణం. ఫిడేలు వాయిద్యం కోసమే ద్వారం వెంకటస్వామి నాయుడు జన్మించారని లోకులు అనుకోవడలో ఆశ్చర్యంలేదు. ఆయన జీవితమంతా వాయులీనానికే అంకితమైంది. పుట్టుకతోనే వచ్చిన దృష్టి మాంద్యమనే లోటు నాయుడు జీవితంలో మరేలోటు లేకుండా చేసింది. ఈ వైకల్యమే వారి వైదుష్య వికాసానికి కారణమైంది. ఒక దురదృష్టం మరొక అదృష్టానికి దారితీసి ఫిడేలు వాదనలో 'ద్వారం నాయుడు బాణీ'గా విఖ్యాతి పొందుటకు అంకురార్పణ అయింది. తాను నేర్చి, ఏర్పరచుకొన్న బాణీ సుస్థిరమయ్యేటందుకు ప్రతీ రోజు సుమారు ఏడు గంటల పాటు పదకొండు సంవత్సరాలు కఠోరమైన క్రమశిక్షణ, దీక్షతో గతి తప్పకుండా సాధకం చేసి ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడుగా కచేరీలు చేస్తుండేవారు. వంశపారంపర్యంగా వచ్చిన మిలిటరీ మనస్తత్వపు లక్షణాలు కావలసిన మానసిక ధైర్యాన్ని, పట్టుదలను ఇచ్చాయి. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ యుద్ధంలో పోరాడే సైనికునిలా జీవితరంగంలో ముందుకు దూసుకుని వెళ్లడమేగాని వెనక్కు అడుగువెయ్యని సాహసి నాయుడు గారు. ఆయన వేషం నిరాడంబరం, మనస్సు సాగర గంభీరం.

అప్పటికి దక్షిణ దేశంలో సంగీత కళాశాలలు లేవు. విద్యలకు నిలయమైన విజయనగరంలో 1919లో ప్రప్రథమ సంగీత కళాశాలను మహారాజావారు స్థాపించి 'హరికథా పితామహ' శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసును మొదటి ప్రిన్సిపాల్‌గా నియమించారు. అప్పటికే నాయుడుగారు చాలా ప్రాంతాలలో తమ వాయులీన విద్యను ప్రదర్శిస్తూ శ్రోతల మన్ననలు పొందుతూ ఉన్నారు. అయినప్పటికీ సంగీత కళాశాలలో చేరి మరింత ఉన్నత విద్యను అభ్యసించాలనేది ఆయన అభిలాష. కళాశాల ప్రారంభోత్సవం నాడు మహారాజావారు, నారాయణదాసు, ఇంకా ఇతర ప్రముఖుల సమక్షంలో నాయుడుగారు కచేరి చేశారు. ఆయన ప్రతిభను గుర్తించిన రాజావారు, దాసుగారు నాయుడును విద్యార్థిగా గాక నేరుగా వయోలిన్ అధ్యాపకులుగా నియమించారు. సుమారు మూడు పుష్కరాల పాటు అనగా మొదటి పదిహేనేళ్ల అధ్యాపకునిగా, (నారాయణదాసు ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేసిన అనంతరం) ప్రధానాచార్యులుగా బాధ్యతలు చేపట్టి మరో పద్దెనిమిది సంవత్సరాలు సంగీత విద్యకు ఉత్కృష్ట సేవలు అందించారు. అధ్యాపకులుగా ఉన్న రోజుల్లో కూడా ఆయన విద్యార్థిలాగా నిరంతర సాధన చేసేవారు. రోజూ లెక్కలేనన్ని త్రిస్థాయిలు వాయించేవారు. అయన దినచర్య సంగీతజ్ఞులకు ఆదర్శప్రాయంగా ఉండేది. శ్రావ్యమైన వయోలిన్ వాదనం ప్రతీరోజు చెవిని పడుతూ ఉండాలని, అదీ సాధనే అని నాయుడు అభిమతం.

ఒకానొక సందర్భంలో అన్న వెంకటకృష్ణయ్య తమ్ముడిని అమృత్‌సర్‌లో ఉన్న ప్రఖ్యాత నేత్రవైద్యుని వద్దకు తీసుకువెళ్లాలని తలపెట్టారు. నాయుడుగారు అందుకు అంగీకరించలేదు. కారణమేమని ప్రశ్నించగా 'సంగీతానికి మనోనేత్రం అవసరం. బాహ్యనేత్రాలు నాకు లేకపోవడం నుంచి నా మనోనేత్రాన్ని నేను వికసించేటట్లుగా చేసుకోగలిగాను. నా సంగీతం కూడా పరిపక్వదశకు వస్తోంది. మన సంగీతం ఏకత్వాన్ని సూచిస్తుంది. అందుకే ఇది ఏకస్వర సంగీతం. దీనికి తపస్సు అవసరం. కన్నులు ఉండడంవల్ల చూపులు బుద్ధికి చాంచల్యాన్ని కలిగిస్తాయి. ఏ వైద్యుడైనా నాకు ఇప్పుడు కన్నులు ప్రసాదిస్తే నా మనోనేత్రం భగ్నమై నా సంగీతానికి ముప్పు రావచ్చు. అందుచేత నా సంగీతం కోసం నేను నా బాహ్య నేత్రాలను సంపర్పించుకోదలచుకున్నాను' అని నాయుడు అన్నారు.

1927లో మద్రాసులో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలో నాయుడుగారు కచేరీ చేసి దక్షిణాది విద్వాంసుల, శ్రోతల మనస్సులను ఆకట్టుకున్నారు. ఆ రోజులలో దక్షిణాది విద్వాంసులలో వయోలిన్ వాయిద్యానికి గోవిందస్వామి పిళ్ళై గారిది పెట్టింది పేరు. చాలా రోజులకు ఆ మహావిద్వాంసునికి సరియైన వారసుడుగా నాయుడుగారు దొరికారని అందరూ ఆనందించారు. 1929 దసరా ఉత్సవాలలో కాకినాడ సరస్వతీ గానసభలో గోవిందస్వామి పిళ్ళై వయోలిన్ కచేరి చేయవలసి ఉంది. అనారోగ్య కారణంగా రాలేక ఆయన సంస్థ వారికి రాసిన లేఖలో తనకు బదులుగా వెంకటస్వామి నాయుడు సోలో కచేరీ జరిపించమన్నారు. శ్రోతలందరి కరతాళ ధ్వనుల మధ్య నాయుడుగారి కచేరీ జరగటం; నాటినుంచి వారి సోలో కచేరీలు, సహకార వాద్య కచేరీలు భారతావని అంతటా జరుగటం ఆరంభమయింది. ఆయన కీర్తిప్రతిష్ఠలు దినదినమూ పెరిగాయి. వేరేవారి వాద్యంలో లేని గొప్పతనం నాయుడు వాద్యంలో ఉందని అందరూ గుర్తించారు. ద్వారం వెంకటస్వామి నాయుడు వయోలిన్ వాయిస్తే పంచదశ గమకాలు వినిపిస్తూ అందులో రవ్వ, పొడి ప్రత్యేకంగా శ్రావ్యంగా ఉంటాయి. ఎవరి వాద్యంలో వినపడని నాదశుద్ధి నాయుడుగారి చేతిలోనే వినపడుతుంది. కర్ణాటక బాణీలో వయోలిన్ వాద్య విద్యకు ఆయన సింహద్వారం వంటివారు. ఏ వ్యక్తికైనా నిమిత్తమాత్రంగా ఒక గురువు ఉండి తీరాలి. అందుచేతనే త్యాగయ్య గారు 'గురులేక ఎటువంటి గుణికి తెలియగబోదు' అంటారు. అన్న వెంకటకృష్ణయ్య చూపిన మార్గంలో అవధులు దాటి వాయులీన వాదనంలో ఉన్న మర్మములను వశపరచుకున్నారు. చాలా సందర్భాల్లో 'నాకు ఇద్దరే గురువులు. ఒకరు మా అన్నయ్య వెంకటకృష్ణయ్య, ఇంకొకరు నా చెవి. ఇంకెవరి దగ్గరా నేను నేర్చుకోలేదు' అని నాయుడుగారు అంటుండేవారు. తమ ప్రజ్ఞాపాటవాలతో తన ముందుతరం వాయులీన విద్వాంసులు చూపని అనేక ప్రక్రియలను తన వాద్యంలో చేర్చుకుని వాటికి గౌరవాదరాలు సాధించిన సంగీత భాస్కరుడు నాయుడుగారే. ఫిడేలు వాద్యం చాలా బాగా వాయించే విద్వాంసులు ఎంతోమంది ఉన్నప్పటికీ నాయుడు వాద్యంలో ఉన్న లాఘవం, నాదశుద్ధి, శృతిశుద్ధి, మాధుర్యం, సర్వతోముఖ వాద్య విధానం మొదలైనవి నాయుడుగారిని సింహాసనం మీద కూర్చోబెట్టి సార్వభౌముడిని చేశాయి. ఆయన వాద్యంలో రసావేశమే కానీ వీరావేశం ఉండేది కాదు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ చెన్నపురిలో నాయుడుగారి వయోలిన్ వాదన విని 'ఆయన ఏ రాగాన్ని వాయించినా, ఎంత మృదువుగా, ఎంత ఘనంగా కమాను తీడినా నాదమునందు స్నిగ్ధత, గాంభీర్యము కొంచమైనను చెదరినదన్నమాట ఒక్కసారైనను మా అనుభూతికి రాలేదు' అని అన్నారు. భైరవి వంటి ఘనరాగాలు అయన ప్రస్తారం చేసినప్పుడు మంద్రంలో నాదపుష్టి మేఘపు ఉరుమును, అతితారంలో వారు చూపే కొన్ని ద్రుత ప్రక్రియలు మెరుపును స్ఫురింపచేసేవి. కమాను తేల్చి రాగప్రస్తారం చేసేవారాయన. రెండు తీగలమీద ఒకే పర్యాయం వ్రేలువేసి కమానును ద్రుతంగా త్రిప్పుచు కొన్ని నాదాలు సృష్టించడంలో, ఇంకా ఇటువంటి ప్రక్రియలలో ఆయనకు ఆయనే సాటి. 'శుభపంతువరాళి' వంటి రాగం వాయిస్తే శ్రోత తప్పనిసరిగా కంటి వెంట బాష్పాలు రాల్చవలసిందే.

దృఢసంకల్పంతో, ఏకాగ్ర దృష్టితో బహిరంగమైన చేష్టలేమీ లేక ఫిడేలే తామై, తామై ఫిడేలయ్యి నాదామృత సొగసులు కురిపించిన 'ఫిడేలు నాయుడుగారు' జనం హృదయాలలోనే గాక నాలుకపై నాట్యమాడడం సహజం.

కవీశ్వరులు నాయుడుగారిని కీర్తించారు. 'ఈ వాయులీన సాహిత్య మాధుర్యముల్.. దేవతాస్త్రీ కంఠదీప్తరావమ్ములో, పారిజాతామోద భావమ్ములో, సురనదీ జీవమ్ములో...' అని విశ్వనాథ సత్యనారాయణ ప్రశంసించగా; 'ఒక గంధర్వుడు బంధముక్తుడయి నీలోన్మీలితాకాశ వీథికి ఏగెన్..' అని గుంటూరు శేషేంద్రశర్మ ప్రస్తుతించారు. నాయుడుగారికి సన్నిహితులైన శ్రీరంగం నారాయణబాబు 'నాయుడుగారూ! మీ వ్రేళ్ళు ఘనరాగ పంచకం! మీ శరీరమాకాశం! మీ హస్తం హరివిల్లు! చిత్రచిత్ర వర్ణాలు శ్రీవారి వ్రేళ్ళు! మీ వ్రేళ్ల పలికే వేళల విశ్వరూపమే వినిపిస్తుంది కనిపిస్తుంది' అని కీర్తించారు. నాయుడుగారి వైదుష్యం తలచుకున్నపుడల్లా మనకు అన్నమయ్య పదాలు 'ఏమని పొగడవచ్చు నీతని ప్రభావము.. అనంత సూర్య తేజుఁడట కాంతి చెప్పనంత.. దనుజాంతకుండట ప్రతాపమెంత...' స్ఫురణకు వస్తాయి. ఆంధ్ర, తమిళ, కన్నడ సంగీత ప్రియులను ఒక్కటిగా కలిపిన కర్ణాటక సంగీతములాగ కన్నడనాడులో పుట్టి, తెలుగునాట మనుగడ గడిపి, తమిళనాడులో స్థిరపడి సుమారు అర్థశతాబ్ది పాటు సంగీతప్రియులకు వయోలిన్ వాదనలో వర ప్రసాదిత నిపుణతతో, అందచందాల పరిశీలనతో అపాకృతం, అనిర్వచనీయం అయిన ఆత్మానందం చేకూర్చిన ఫిడేలు నాయుడు గారు మరువలేని మరపురాని మధురమైన మహామనీషి. ఇటువంటి మహోన్నత వ్యక్తికి జాతి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలదు?

▪ యనమండ్ర వేంకటకృష్ణయ్య
(నవంబర్ 8: ద్వారం వెంకటస్వామి నాయుడు జయంతి)



దుర్గమ్మకు రూ.2.83 కోట్ల ఆదాయం

- 15 రోజుల హుండీల లెక్కింపు
- భారీగా బంగారం, వెండి కూడా..

కానుకలుగా పలు దేశాల కరెన్సీ

8లో

11 నుంచి భవానీ దీక్షల స్వీకరణ

- డిసెంబరు 21 నుంచి విరమణలు
- 25న ముగింపు, మహాపూర్ణాహుతి

డిసెంబరు 14న కలశజ్యోతి ఉత్సవం

దివిలో ఐటీ కలకలం

- నాగాయలంకలో రొయ్యల వ్యాపారి ఇల్లు, ఆఫీసులపై దాడులు
- వైసీపీ నేత గ్రంథి శ్రీనివాసరావుతో లావాదేవీలే కారణమా
- కీలకమైన డాక్యుమెంట్లు స్వాధీనం

6లో



రెచ్చిపోతున్న రేషన్ మాఫియా





పటమట పోలీసులకు వరుసగా రెండోసారి పట్టుబడిన డాన్ శివప్రసాద్

జిల్లావ్యాప్తంగా యథేచ్ఛగా బియ్యం అక్రమ వ్యాపారం

- పటమటకు చెందిన బియ్యం అక్రమంగా తరలించే వ్యాపారి శివప్రసాద్ కిందటి నెల 25వ తేదీన పేదల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. తిరిగి ఈ నెల 4న రెండోసారి పోలీసులకు దొరికిపోయాడు.
- సెప్టెంబరులో పరిటాల రైస్‌మిల్లులో పోలీసులు అక్రమ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ మరుసటి నెలలో సివిల్ సప్లయిస్ మంత్రి ఆ మిల్లును తనిఖీ చేయగా, అక్రమ బియ్యం కనిపించింది.
- మచిలీపట్నానికి చెందిన అక్రమ బియ్యం డాన్‌పై గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా బహిష్కారం విధించారు. తిరిగి కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అక్రమ బియ్యం వ్యాపారం చేసిన అతను ప్రస్తుతం కూడా అదే పనిలో నిమగ్నమయ్యాడు.
- అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్న రెండు ప్రధాన ముఠాల ఆధిపత్యపోరుతో ఏ.కొండూరులో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

జిల్లావ్యాప్తంగా పేదలకు అందాల్సిన అక్రమ రేషన్ బియ్యాన్ని ముఠాలు తన్నుకు పోతుంటే.. ఆధిపత్య పోరులో ఒకరినొకరు తన్నుకుంటుంటే.. పట్టించుకోవాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. విజయవాడ కేంద్రంగా పటమట, సింగ్‌నగర్, ఏ.కొండూరు, జి.కొండూరు, తిరువూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం మండలాల్లో భారీ ఎత్తున డాన్లు పుట్టుకొస్తున్నా.. అక్రమ బియ్యం వ్యాపారం భారీగా జరుగుతున్నా.. దేశాలు దాటిపోతున్నా అడిగేవారు కరువయ్యారు.

- అన్నీ తెలిసినా పట్టని సివిల్ సప్లయిస్ అధికారులు
- పోలీసులు పట్టుకుంటేనే డాన్‌ల బాగోతం బట్టబయలు
- అయినా సరిహద్దులు దాటించేస్తున్న వ్యాపారులు
- సింగ్‌నగర్, పటమట కేంద్రంగా డాన్‌ల వ్యాపారం
- ఏ.కొండూరులో వ్యాపారుల మధ్య ఆధిపత్యపోరు
- ఒకరినొకరు కార్లతో ఢీకొని రచ్చకెక్కిన వివాదాలు






ఏ.కొండూరులో ఆధిపత్య పోరులో నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్‌లో) ఇబ్రహీంపట్నం కేంద్రంగా రేషన్ మాఫియా గొడవలో వ్యక్తికి గాయాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో అక్రమ బియ్యం వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా సాగుతోంది. పటమట పోలీసులకు వరుసగా రెండుసార్లు పట్టుబడిన అక్రమ బియ్యం వ్యాపారి శివ ప్రసాద్‌పై కానీ, మచిలీపట్నం బియ్యం డాన్‌పై కానీ, విజయవాడ, ఏ.కొండూరు, ఇబ్రహీంపట్నం బియ్యం వ్యాపారులపై కానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా సివిల్ సప్లయిస్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. సాధారణంగా రెండోసారి పట్టుబడితే డీలర్‌షిప్ రద్దుచేసే అధికారం ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రెండు జిల్లాల్లో రేషన్ మాఫియా విచ్చలవిడిగా పడగ విప్పుతోంది. ముఠాలుగా ఏర్పడి దాడులు చేసుకునే వరకూ

మిగతా 8లో..

అయన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హోదాలో పనిచేస్తున్నారు. నెలకు ప్రభుత్వం నుంచి జీతం రూపంలో సుమారు రూ.50 వేలు తీసుకుంటున్నారు. ఇది సరిపోకపోవడంతో నిరుపేద చర్మ కార్మికుడి అవతారమెత్తారు. ప్రభుత్వం పేద చర్మ కార్మికులకు ఇచ్చే పింఛన్ రూ.7 వేలు కూడా తీసుకోవడం మొదలు పెట్టారు. తన పైఅధికారే ప్రభుత్వాన్ని మోసం చేసి దర్జాగా పింఛన్ తీసుకుంటుంటే.. తాను ఎందుకు చేయకూడదని సహకార సంఘంలో గుమస్తా కూడా నిరుపేద డప్పు కళాకారుడి అవతారమెత్తారు. ఆయన కూడా నెలకు రూ.7 వేల పెన్షన్ తీసుకోవడం మొదలు పెట్టారు. నందిగామ మండలంలోని గోళ్లమూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉద్యోగుల నిర్వాకం ఇది.



కటారపు రామారావు, కటారపు గోవర్ధన్‌రావు పెన్షన్ పత్రాలు

డబుల్ ధమాకా

గోళ్లమూడి పీఏసీఎస్‌లో ఉద్యోగుల నకిలీ పెన్షన్ నిర్వాకం

సహకార సంఘం సీఈవోగా విధులు.. చర్మ కార్మికుడి పింఛన్

సహకార సంఘం గుమస్తా.. డప్పు కళాకారుడిగా పింఛన్

- ప్రభుత్వ జీతం తీసుకుంటూనే పెన్షన్‌తో లబ్ధి
- 2019 నుంచి నెలకు రూ.7 వేల చొప్పున..
- వైసీపీ హయాంలో అధికారం అడ్డు పెట్టుకుని అక్రమం
- గ్రామస్థుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘటన
- గుమస్తా సస్పెన్షన్.. సీఈవోపై వేటుకు మీనమేషాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ప్రభుత్వ సొమ్మును దోచుకు తిన్నారనడానికి నిలువెత్తు నిదర్శనం ఈ ఉదంతం. నందిగామ మండలంలోని గోళ్లమూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కటారపు రామారావు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్నారు. ఆయన కుమారుడు గోళ్లమూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, సర్పంచ్. తన కుమారుడి

మిగతా 8లో..

దారి దోపిడీకి బ్రేక్

- అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారికి షోకాజ్
- పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద నిలిచిపోయిన ప్రైవేట్ వసూళ్లు
- సంబంధం లేని మరో ఎంవీఐకు కూడా నోటీసు..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద దారి దోపిడీకి పాల్పడుతున్న రవాణా శాఖ అధికారికి ఉన్నతాధికారులు షోకాజు నోటీసు జారీ చేశారు. రెండు నెలలుగా సదరు అధికారి పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని వాహనాలు నిలుపుదల చేయిస్తూ, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విషయాన్ని మంగళవారం సంచికలో 'దారి దోపిడీ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అయితే, ఈ వ్యవహారంలో అధికారికి నోటీసు ఇచ్చిన ఉన్నతాధికారులు ఈ విషయంతో సంబంధం లేని మరో ఎంవీఐకు కూడా నోటీసు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ విషయంలో మొక్కుబడి విచారణ జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ఉన్నతాధికారుల స్పందనతో పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట పడింది. విచారణ ముగిసే వరకు క్షేత్రస్థాయిలో విధులు చేపట్టవద్దని ఉన్నతాధికారులు ఆ అధికారిని ఆదేశించినట్టు తెలిసింది. అయితే, ఈ ఉదంతంలో పొట్టిపాడు టోల్‌ప్లాజా నిర్వాహకులపై కూడా విమర్శలు వస్తున్నాయి. టోల్‌ప్లాజా నిర్వాహకులకు, సిబ్బందికి ఇందులో సంబంధాలున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ తర్వాతే ఉచిత ఇసుక

- పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సొంత అవసరాలకు ఇసుకను తీసుకెళ్లానుకున్న వారు ముందు సంబంధిత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఆయన బుధవారం కొన్ని సూచనలు చేశారు. సొంత అవసరాలకే ఇసుకను తీసుకెళ్లాలన్నారు. యంత్రాలతో కాకుండా కార్మికులతో వాహనాల్లో వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో కానీ, ఆన్‌లైన్‌లో కానీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక సంబంధిత పత్రాలను చూపించి ఇసుకను తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఇసుకను అక్రమంగా తరలించే వారి సమాచారాన్ని 112కు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు.

బస్‌షెల్టర్ కబ్జా

షెల్టర్ తొలగించి మరీ ఆక్రమణ

కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నిర్వాకం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఓ వ్యాపారి ఏకంగా బస్‌షెల్టర్‌నే కబ్జా చేశారు. తన స్థలానికి కమర్షియల్ హంగు కోసం ప్రయాణికులకు నీడనిస్తున్న షెల్టర్‌ను రాత్రికి రాత్రే తొలగించేసి తన స్థలంలో కలిపేసుకున్నారు. వన్‌టౌన్‌కు చెందిన ఓ వ్యాపారికి భవానీపురం 40వ డివిజన్ పరిధిలో 500 గజాలకుపైగా స్థలం ఉంది. ఈ స్థలానికి ఓవైపు జాతీయ రహదారి.. మరోవైపు భవానీపురం డాల్ఫిన్ బార్ రోడ్డు ఉన్నాయి. జాతీయ రహదారి పక్కన ప్రయాణికుల సౌకర్యార్థం 15 ఏళ్ల కిందట సిటీ బస్‌షెల్టర్ నిర్మించారు. వ్యాపారి స్థలానికి ఆనుకునే ఈ షెల్టర్ ఉంటుంది. షెల్టర్ ఉంటే తన స్థలానికి కమర్షియల్ విలువ ఉండదని భావించిన సదరు వ్యాపారి రాత్రికి రాత్రే దానిని తొలగించారు. అంతేకాదు.. బస్‌షెల్టర్ స్థలాన్ని తన స్థలంలో కలిపేసుకున్నారు. గతంలో పలు దఫాలు బస్‌షెల్టర్‌ను తొలగించేందుకు ప్రయత్నించినా స్థానికులు అడ్డుకున్నారు. అయితే, మంగళవారం రాత్రి చడీచప్పుడు లేకుండా తొలగించారు. ఈ వ్యవహారంపై పలువురు స్థానికులు వీఎంసీ, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా రాజకీయ ఒత్తిళ్లతో వారెవరూ అటువైపు చూసేందుకు సాహసించలేదు. తక్షణం అధికారులు స్పందించి బస్‌షెల్టర్ స్థలాన్ని కబ్జా నుంచి విముక్తి చేసి తిరిగి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



భవానీపురం లారీస్టాండ్ సమీపంలో తొలగించిన బస్‌షెల్టర్ ప్రాంతం



ఎక్కడైనా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో స్వేచ్ఛగా ఇసుక తీసుకెళ్లవచ్చని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన దళారులకు వరంగా మారింది. టీడీపీ, వైసీపీ కార్యకర్తలు కుమ్మక్కై, మరీ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. క్వారీల్లో సేవ చేస్తున్నామంటూ బాట ఖర్చు పేరుతో ట్రాక్టర్‌కు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. డబ్బు తీసుకుని బాట ఏర్పాటు చేయకపోవడంతో ట్రాక్టర్లు తిరగబడిపోతున్నాయి. ఇసుక అక్రమాలపై ఆరోపణలు వచ్చిన కళ్లంవారిపాలెం క్వారీని మూసివేయించిన అధికారులు చాగంటిపాడు, భద్రిరాజుపాలెం క్వారీల్లోనూ అవే పరిస్థితులు నెలకొన్నా కన్నెత్తి చూడక పోవటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దోచుకున్నోడికి దోచుకున్నంత

- చాగంటిపాడులో యంత్రంతో లోడింగ్
- భద్రిరాజుపాలెంలో పుస్తకం పెట్టి మరీ వసూళ్లు
- ఐలూరులో ఓ రైతు అడ్డగింతపై దళితుల రగడ

తోట్లవల్లూరు మండలంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

తోట్లవల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలంలో ఉచిత ఇసుక అమలు తీరు అస్తవ్యస్తంగా మారింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దోచుకున్న తీరు విమర్శలకు గురైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు ప్రజలకు చవకగా ఇసుక లభించాలని, ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రకటించారు. దీంతో ఈ ఉచిత పథకాన్ని సొమ్ము చేసుకునేందుకు టీడీపీ, వైసీపీ కార్యకర్తలు తయారయ్యారు. కళ్లంవారిపాలెం క్వారీలో వైసీపీ నేత ఇసుక మాఫియా నిర్వహిస్తున్నారని ఆరోపణలు రావటంతో ఆ క్వారీని మూసేసిన అధికారులు చాగంటిపాడు, భద్రిరాజుపాలెం క్వారీలను మాత్రం గాలికి వదిలేశారు. చాగంటిపాడులో కార్మికులు ఇసుక పోసి ఒక ట్రాక్టర్‌కు రూ.1,000 వసూలు చేస్తున్నారు. కొందరు టీడీపీ కార్యకర్తలు దగ్గరుండి కార్మికుల నుంచి ప్రతి ట్రాక్టర్‌కు బాట ఖర్చుకంటూ రూ.200 వసూలు చేస్తున్నారు. అయితే, బయటి గ్రామాల ట్రాక్టర్‌లను రానీయకుండా అడ్డుకోవటం విమర్శలకు దారితీసింది. కార్మికులు ఒకవైపు ఇసుక పోస్తుండగా, మరోవైపు ఏకంగా ఎక్సకవేటర్‌నే క్వారీలోకి ప్రవేశపెట్టడం దుమారం రేపుతోంది.

టీడీపీ, వైసీపీ కుమ్మక్కై వసూలు

భద్రిరాజుపాలెంలో టీడీపీ, వైసీపీ వారు కలిసి క్వారీలో ఒక్కో ట్రాక్టర్ నుంచి బాట ఖర్చుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడా బాట నిర్మించిన దాఖలాలు లేవు. ఇసుకలోనే ట్రాక్టర్లు నడుస్తూ దిగబడిపోతున్నాయి. భద్రిరాజుపాలెం క్వారీలో ఏకంగా పుస్తకంలోనే రూ.200 వసూలు చేస్తున్నట్టు రాయడం గమనార్హం. ఈ క్వారీలో కూడా ట్రాక్టర్‌కు ఇసుక పోసి రూ.1,000 వసూలు చేస్తున్నారు.

అధికారులకు వాటాలు!

క్వారీల్లో బాట ఖర్చుల పేరుతో వసూలు చేస్తున్న డబ్బును రెవెన్యూ, పోలీస్ అధికారులకు కొంత ఇచ్చి, మిగిలింది క్వారీలో నిర్వాహకులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగానే అధికారులెవరూ ఈ క్వారీల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

వినియోగదారులపై భారం

గతంలో టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేసినపుడు ట్రాక్టర్ ఇసుక నింపిన కార్మికులకు రూ.300 మాత్రమే వసూలు చేసేవారు. క్వారీ వద్ద రూ.300 మించి వసూలు చేయకూడదని బ్యానర్ కట్టి పకడ్బందీగా ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేశారు. దాంతో ఉయ్యూరుకి రూ.1,500లకు ట్రాక్టర్ ఇసుక

మిగతా 8లో..

బీమా క్లెయిమ్‌లు పరిష్కరించండి

వరద బాధితుల సేవలో బీమా సంస్థల కృషి భేష్

98.20 శాతం క్లెయిమ్‌ల పరిష్కారం

ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా సమీక్ష



8

కాలుష్య రహిత నగరంపై దృష్టి

- యూనిడో ప్రతినిధులతో కమిషనర్ ధ్యానచంద్ర సమీక్ష

8

గూటి కోసం గోడు

- సమస్యల వలయంలో పలు అంగన్వాడీ కేంద్రాలు
- సబ్జపాడు, జంగాలపల్లిలో శిథిలావస్థకు భవనాలు

6



గన్నవరంలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

రూ. 128 కోట్లతో కృష్ణాలో సబ్ స్టేషన్ల నిర్మాణం

» నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం బాబు

» తొలగనున్న లో ఓల్టేజీ సమస్యలు

పెడన/గన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా వ్యాప్తంగా రూ. 128 కోట్లతో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టగా.. శంకుస్థాపన కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఏపీ ట్రాన్స్‌కో ఎస్‌ఈ భాగ్యరాజ్ తెలిపారు. పెడనలో విద్యుత్ శాఖాధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పెడన, గన్నవరం విమానాశ్రయం, బంటుమిల్లి మండలాల్లో 132/33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఒక్కొక్క సబ్‌స్టేషన్‌కు రూ. 48 కోట్ల చొప్పున మంజూరయ్యాయని తెలిపారు. వీటి నిర్మాణం వల్ల భవిష్యత్తులో ఆయా మండలాలలో లో ఓల్టేజి సమస్య పరిష్కారమవుతుందన్నారు. పెడన మండలంలోని కూడూరు వద్ద నిర్మిస్తున్న 132/33 కేవీ భవిష్యత్తులో 220/33 కేవీగా అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో పెడన కేంద్రంగా అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుందని ఆయన పేర్కొన్నారు. గురువారం ఉదయం వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ప్రారంభిస్తారన్నారు. పెడనలో జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, జిల్లా కలెక్టర్ బాలాజీలు హాజరవుతారన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈలు ఎం.సత్యానందం, సత్యనారాయణ, మచిలీపట్నం ఈఈ శ్రీనివాసరావు, పెడన ఏడీఈ సీహెచ్. మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్లను వారం రోజుల్లో క్లియర్ చేయాలి

» ఉద్యోగులతో డీఈవో రామారావు



మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఫైళ్లను త్వరితగతిన వారం రోజుల్లోగా క్లియర్ చేయాలని డీఈవో రామారావు ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం డీఈవో కార్యాలయంలో వివిధ సెక్షన్ల ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారంరోజుల్లో ఏ ఫైల్ అయినా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఏడీలు, సూపరింటెండెంట్‌లు తమ తమ సెక్షన్ల పరిధిలో ఉండే ఫైళ్లను బేరీజు వేసుకోవాలన్నారు. ఉద్యోగుల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఉద్యోగ సంఘ నేత పవన్‌కుమార్ తదితరులు కోర్టు కేసుల్లో జాప్యంపై వివరించారు. దీనికి డీఈవో మాట్లాడుతూ, కోర్టు కేసులను స్వయంగా పరిశీలిస్తానన్నారు. కార్యక్రమంలో ఏడీ మనోహరనాయక్, సూపరింటెండెంట్ పవన్ తదితరులు సమస్యలను డీఈవో ముందుంచారు.



సీడీని ఆవిష్కరిస్తున్న శ్రీరాం తాతయ్య, పెనుగొండ రాజీవ్

వాసవీ మాత భక్తిగీతాల సీడీ ఆవిష్కరణ

జగ్గయ్యపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కైకలూరుకు చెందిన విద్యాంజలి విద్యాసంస్థల అధినేత, ప్రిన్సిపాల్ సయ్యద్ జమీల్ అహ్మద్ ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరీ అమ్మవారిపై స్వయంగా రచించి, గానం చేసిన ఆడియో సీడీని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. మతమేదైనా సాహిత్యం, భక్తికి అడ్డు కాదని జమీల్ అహ్మద్ నిరూపించారని ప్రశంసించారు. వాసవీ కన్యక పరమేశ్వరీ జీవిత చరిత్రను చదివి స్ఫూర్తిని, ఆర్తిని పొంది పాటలు రాసి అందరికీ చేరువ చేయాలని సీడీని విడుదల చేస్తున్నట్టు రచయిత, గాయకుడు జమీల్ అహ్మద్ అన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట దేవస్థానం ధర్మకర్త, జేఆర్సీ విద్యాసంస్థల సెక్రటరి పెనుగొండ రాజీవ్, ఏపీఎంపీఏ అధ్యక్షుడు కాకరపర్తి వెంకట రమేష్, ఆర్యవైశ్య నేత గెల్లా వైకుంటేశ్వరరావు, టీడీపీ నేతలు పైడిమర్రి మాల్యాద్రి, వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు

» ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



కూచిపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకను సొంత అవసరాలకు కాకుండా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హెచ్చరించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిరా అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇసుక ఇబ్బందులను తొలగించి అందరి అవసరాలు దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. దుర్వినియోగం చేస్తే సహించేది లేదన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములవుదామన్నారు.

పాండురంగని ఉత్సవాలకు సర్వం సిద్ధం

» 13న రథోత్సవంలో ఏనుగు అంబారీ



మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు కొంగుబంగారం చిలకలపూడి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. 11న విఠలకోటి పూజ, లక్ష్మీగణపతి హోమం, పల్లకీ ఉత్సవాలు, 12న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, బ్రహ్మోత్సవం జరుపుతారు. మంగళవారం రాత్రి 7 గంటలకు రుక్మిణి పాండురంగ స్వామి కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. 13న పాండురంగ స్వామి వారి రథోత్సవం ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. రథోత్సవంలో కేరళ నుంచి ఏనుగు అంబారీని తీసుకురావడానికి మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక చొరవ చూపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు చలమలశెట్టి నరసింహారావుతో పాటు నగర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. మేళతాళాలతో జరిగే ఈ ఊరేగింపులో ఆశాంతం కోలాటం, పగటి వేషధారణలు, ఊరేగింపులో పాల్గొంటారు. 13న దేవాలయ ప్రాంగణంలో భక్తబృందం 700 శ్లోకాల సంపూర్ణ భగవద్గీత పారాయణ చేస్తారు. 14న విష్ణుసహస్ర నామ పారాయణ, సహస్ర దీపారాధనలు జరుగుతాయి. 15న రుక్మిణి అమ్మవారికి కుంకుమపూజలు, పల్లకీ ఉత్సవాలు, గోపాలక ఉత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు టీకె నరసింహం తెలిపారు.

దివిలో ఐటీ దాడుల కలకలం!

» నాగాయలంకలో రొయ్యల వ్యాపారి ఇల్లు, కార్యాలయాలపై ఏకకాలంలో సోదాలు

» వైసీపీ నేత గ్రంధి శ్రీనివాసరావుతో లావాదేవీలే కారణమంటున్న ఆక్వా వర్గాలు



దివి ప్రాంతంలో ఐటీ దాడుల్లో పాల్గొన్న సిబ్బంది

అవనిగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక మండలానికి చెందిన ప్రముఖ రొయ్యల వ్యాపారి చెన్ను లక్ష్మణరావు ఇల్లు, కార్యాలయం, ఐస్‌ఫ్యాక్టరీలపై బుధవారం ఐటీదాడులు దివిప్రాంతంలో సంచలనం రేకెత్తించాయి. బుధవారం ఉదయం చెన్ను లక్ష్మణరావుకు చెందిన ఐస్ ఫ్యాక్టరీ, నాగాయలంకలోని ఇళ్లపై తెలంగాణ నుంచి వచ్చిన ఐటీ అధికారులు దాడులు నిర్వహించి సోదాలు చేపట్టారు. లక్ష్మణరావు స్వగ్రామమైన ఈలచెట్లదిబ్బ గ్రామంలోనూ, మోపిదేవి మండలం వార్పు సమీపంలో కొద్దికాలం క్రితం ప్రారంభించిన ఐస్‌ఫ్యాక్టరీలపై ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

వైసీపీ నేత గ్రంధి శ్రీనివాస్‌తో వ్యాపార సంబంధాలే కారణమా?

నాగాయలంకలో రొయ్యల వ్యాపారిగా ఉన్న చెన్ను లక్ష్మణరావు ఐఆర్‌జి కంపెనీ అధినేత, వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. గ్రంధి శ్రీనివాస్‌పై ఆరోపణల నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన కార్యాలయాలు, దిగుమతి కేంద్రాలపై దాడులు నిర్వహించిన ఐటీ అధికారులు అదే సమయంలో నాగాయలంక, మోపిదేవి, ఈలచెట్లదిబ్బ ప్రాంతాల్లో చెన్ను లక్ష్మణరావుకు చెందిన వ్యాపార కేంద్రాల్లోనూ, సన్నిహితుల ఇళ్లలోనూ, ఐస్ ఫ్యాక్టరీలోనూ దాడులు నిర్వహించారు. తెలంగాణ నుంచి సుమారు 10 కార్లలో ఐటీ అధికారులు ఈ దాడుల్లో పాల్గొనేందుకు వచ్చినట్టు సమాచారం. ఐఆర్‌జి కంపెనీతో చెన్ను లక్ష్మణరావు లావాదేవీల్లో భాగంగా సుమారు రూ.77 నుంచి రూ.200 కోట్ల మేర జరిగిన లావాదేవీలకు సంబంధించి లెక్కలు లేవని ఐటీ అధికారులు తేల్చినట్టు విశ్వసనీయ సమాచారం.

వ్యాపార వర్గాల్లో కలకలం..

రాష్ట్రంలోనే ప్రధానమైన ఆక్వాసాగులో అవనిగడ్డ నియోజకవర్గంలో రొయ్యల దిగుమతి వ్యాపారాలు నిర్వహిస్తున్న చెన్ను లక్ష్మణరావుపై ఐటీ అధికారులు దాడులు నిర్వహించటంతో ఈ ప్రాంత వ్యాపారులు ఉలిక్కిపడ్డారు. నిత్యం కోట్లాది రూపాయల విలువైన మత్స్యసంపద, రొయ్యలు ఇక్కడి నుంచి దేశవిదేశాలకు ఎగుమతి అవుతుంటాయని, దీనిలో భాగంగా దిగుమతి చేసే కంపెనీలు లావాదేవీలు మొత్తం బ్యాంకుల ద్వారా నిర్వహిస్తుంటాయని, ఇందులో తమకు మిగిలేది కమీషన్ మాత్రమేనని, లావాదేవీలు మొత్తం ఎగుమతి చేసే కంపెనీలకు, రైతులకు మధ్య నేరుగా జరుగుతుంటాయని, అలాంటిది ఓ వ్యాపారిపై పెద్ద ఎత్తున ఐటీ దాడులు జరగటంతో వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రొయ్యల వ్యాపారిగానే కాక పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే లక్ష్మణరావు ఇంటిపై దాడులు స్థానికంగా చర్చనీయాంశమైంది.

నేడు ఎన్ఎంయూఏ సెంట్రల్ కమిటీ సమావేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ వేదికగా ఆర్టీసీ గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూ) సెంట్రల్ కమిటీ సమావేశాలు గురువారం జరగనున్నాయి. ఈ సమావేశాలు మొగల్రాజపురంలోని సిద్దార్థ ఆడిటోరియంలో జరుగుతున్నాయి ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించుకునేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 128 ఆర్టీసీ డిపోల నుంచి ఈ సమావేశానికి వేలాదిగా ఆర్టీసీ ఉద్యోగులు తరలి వస్తున్నారు. ఈ సమావేశాలకు ఏపీఆర్టీసీ చైర్మన్ కొణకళ్ళ నారాయణరావును ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఎమ్మెల్సీ పీ అశోక్‌బాబు, ఏపీఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవి శివారెడ్డి, సీహెచ్ పురుషోత్తంనాయుడు, పశ్చిమ కృష్ణా ఎన్జీఓ నాయకులు ఏ విద్యాసాగర్‌లు కూడా పాల్గొంటారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఉద్యోగులనుద్దేశించి ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై శ్రీనివాసరావులు ప్రయోగిస్తారు.

ఎల్‌హెచ్ఎంఎస్‌పై అవగాహన

విజయవాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్)పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఒక ప్రచార రథాన్ని ఏర్పాటు చేశారు. ప్రచారంలో భాగంగా పోస్టర్‌ను కమిషనర్ రాజశేఖర్‌బాబు, క్రైమ్స్ డీసీపీ టి.తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు కమిషనర్ చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ ప్రచార రథాన్ని విజయవాడతోపాటు, గ్రామాల్లో తిప్పుతారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం

» పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి



60వ వార్షికోత్సవ వేడుకలో పూర్వ విద్యార్థులు, మాట్లాడుతున్న సుజనా

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నేటి తరం విద్యార్థుల ఆలోచనా విధానానికి అనుగుణంగా సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతూ విద్యను అందించటం ద్వారా విద్యావ్యవస్థను బలోపేతం చేయవచ్చని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి అన్నారు. కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల 60వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేబీఎన్ కళాశాల సుదీర్ఘ ప్రస్థానం ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును మార్చిందన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలను ఏర్పాటుచేసి అధ్యాపకుల, సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. విద్యాసంస్థలు రాజకీయాలకు అతీతంగా సేవలు అందించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు కూడా భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. పేద విద్యార్థులకు సహకారం అందిస్తూ కుల, మత, వర్గ బేధాలు లేకుండా సమిష్టిగా విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. పశ్చిమలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎంప్లాయిమెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎడ్యుకేషన్ అనే నూతన కార్యక్రమాన్ని 'విజయ దీపం' పేరిట ప్రారంభించామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, హార్డ్‌వర్క్‌తో స్మార్ట్ వర్క్ చేయటం అలవరచుకోవాలన్నారు. ఎస్‌కెపివి హిందూ హైస్కూల్స్ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి.నారాయణరావు మాట్లాడుతూ, కేబీఎన్ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దటంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌కెపివి హిందూ హైస్కూల్ కమిటీ జనరల్ సెక్రటరీ, కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, కేబీఎన్ కళాశాల సెక్రటరీ తూనిగుంట్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ యు.ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి శుద్ధిపై ప్రత్యేక దృష్టి

» రుద్రవరానికి డంపింగ్ యార్డు మార్చండి

» చెత్తను ఎప్పటికప్పుడు గుంటూరు తరలించాలి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ



హెడ్ వాటర్ వర్క్సును పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాగునీటిని శుద్ధి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై కలెక్టర్ స్పందించారు, హెడ్ వాటర్‌వర్క్స్, డంపింగ్‌యార్డును బుధవారం ఆయన ఆకస్మికంగా ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేసేందుకు మునిసిపల్ అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా గుంటూరు జిందాల్‌కు చెత్తను తరలించే వాహనాలకు మరమ్మతులు చేయించాలన్నారు. మరో వాహనం కొనుగోలు చేసి చెత్తను ఎప్పటికప్పుడు గుంటూరు పంపాలన్నారు. ఒక్కో వాహనంలో 9 టన్నుల చెత్త తరలించవచ్చన్నారు. రోజుకు నగరంలో 84 టన్నుల చెత్త వస్తోందని కలెక్టరుకు కమిషనర్ బాపిరాజు వివరించారు. రుద్రవరంలో డంపింగ్‌యార్డుకు కొనుగోలు చేసిన 13 ఎకరాల స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చెత్తరహిత పట్నంగా రూపొందించేందుకు అధికారులు ముందుకు రావాలన్నారు.

మురుగునీటిని బయటకు తోడండి

హెడ్‌వాటర్ వర్క్సును సందర్శించిన కలెక్టరు మురుగునీటిని వేగంగా బయటకు తోడాలన్నారు. ఫిల్టర్ బెడ్స్‌ను క్లీన్ చేయాలన్నారు. నాలుగు రోజుల్లో పనులు పూర్తి కావాలన్నారు. నగరంలో గొడుగుపేట, భాస్కరపురం, రాజుపేట, హౌసింగ్ బోర్డు కాలనీలలో తాగునీరు కలుషితమవుతోందని వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశీలించాలని మునిసిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కలెక్టర్ పరిశీలనలో హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఫిల్టర్‌బెడ్‌లు మురుగు పట్టి ఉన్నట్టు తేలిందన్నారు. ఫిల్టర్‌బెడ్‌లను పూడిక తీయిస్తున్నామన్నారు. ఈ పని నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనరు బాపిరాజు, మునిసిపల్ చంద్రశేఖర్, డీఈ కుబియా నాయక్ ఏఈ తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హోం శాఖపై పవన్ వ్యాఖ్యలు సరికాదు

» ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య

గుడివాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ హోంమంత్రిత్వ శాఖపై చేసిన వ్యాఖ్యలను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ ఖండించారు. బుధవారం ఒక ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన చేతిలో హోంశాఖ ఉంటే వేరేలా ఉంటుందని పవన్ అనడం సబబు కాదన్నారు. దళితమహిళ హోంశాఖ మంత్రిగా ఉన్న క్రమంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని, వంగలపూడి అనితకు హోంమంత్రిత్వ శాఖ ఇస్తే సరిపోదని, పూర్తిస్థాయి అధికారమిస్తే తానేంటో రాష్ట్రానికి చూపించగల దమ్మున్న మహిళ అని కొనియాడారు. ప్రజాప్రతినిధుల అధిక జోక్యం వల్లే రాష్ట్రంలో నేరాలు పెరుగుతున్నాయని, పోలీస్ వ్యవస్థకు పూర్తి స్వేచ్ఛనిస్తేనే నేరాలు అదుపులోకి వస్తాయని అన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని, కఠినంగా వ్యవహరించాల్సిన చోట పోలీసులకు ప్రజాప్రతినిధులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు చాలాచోట్ల పార్టీలు, కులాలు అడ్డుపడుతున్నాయన్నారు. చట్టాల అమలులో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మాదిగలకు రాజకీయాలు, అధికారం కొత్త కాదని, అధికారం పూర్తిస్థాయిలో లేకపోవడంతో అసమర్థులుగా చిత్రీకరిస్తున్నారన్నారు. సమావేశంలో చర్మకార, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, ఎంఆర్‌పిఎస్ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు కె.కవిత, నాయకులు బొక్కినాల సాంబశివరావు, కంచర్ల సుధాకర్, తాళ్ళూరి ప్రశాంత్, అద్దంకి మాణిక్యాలరావు, రాజ్‌కుమార్, వేశపోగు సామియేలు, కొడాలి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24న 'అన్నగారి అంతరంగం-తారకరామం' పుస్తకావిష్కరణ

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ తొలి సినిమా 'మన దేశం' విడుదలై 75ఏళ్లు అయిన సందర్భంగా ఈ నెల 24న విజయవాడలో 'అన్నగారి అంతరంగం-తారకరామం' పేరుతో భగీరథ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు ఎన్టీఆర్ లిటరేచర్ అండ్ సావనీర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్ తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ నటించిన తొలి చిత్రం 'మన దేశం' 1949 నవంబరు 24న విడుదలైందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ సినీ జీవితంలో ఇచ్చిన అన్ని ఇంటర్వ్యూలతో ఈ పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో 100 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వాన్ని స్థలం అడిగామని, కేటాయించగానే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వలంటీర్లను కొనసాగించండి

» చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పౌర సేవల కోసం గత ప్రభుత్వం నియమించిన వలంటీర్లను కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. వారి వేతనాలను రూ.10 వేలకు పెంచేందుకు చర్యలు తీసుకోవాలంటూ సీఎం చంద్రబాబుకు బుధవారం ఆయన లేఖ రాశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లకు ఉద్యోగ భద్రత కరువై ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గత 5 నెలలుగా వలంటీర్లకు వేతనాలు చెల్లించలేదన్నారు. వలంటీర్లను కొనసాగిస్తామని, వారి వేతనాన్ని రూ. 10 వేలకు పెంచుతామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గూటి కోసం గోడు!

విద్యకు పెద్దపీట వేస్తాం.. నాడు-నేడు కింద పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల రూపురేఖలు మారుస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పినా.. ఐదేళ్ల పాలనాకాలంలో అంగన్వాడీల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా పలుచోట్ల కేంద్రాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుండగా.. కొన్నిచోట్ల సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఉన్న కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి. చిన్నారులు, బాలింతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

» సమస్యల వలయంలో పలు అంగన్వాడీ కేంద్రాలు

» సబ్జపాడు, జంగాలపల్లిలో శిథిలావస్థకు భవనాలు

» కొత్తచంద్రగూడెంలో పదేళ్లుగా అద్దెభవనంలో నిర్వహణ

» ఐదేళ్ల పాలనలో కనీసం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

» నిధులు కేటాయించి పునర్నిర్మించాలని వేడుకోలు



కొత్తచంద్రగూడెంలో అద్దెభవనంలో అంగన్వాడీ కేంద్రం





సబ్జపాడు, జంగాలపల్లిలో పెచ్చులూడిన భవనాల శ్లాబు

(మైలవరంరూరల్, ఆంధ్రజ్యోతి)

మైలవరం మండలంలోని చంద్రగూడెం శివారు సబ్జపాడులో అంగన్వాడీ కేంద్రాన్ని రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. భవనం శ్లాబు పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడి కిందపడుతుండటంతో పిల్లలు, గర్భిణులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. జంగాలపల్లిలోని అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. భవనం శ్లాబు పెచ్చులూడటంతోపాటు ప్రహరీ కుంగిపోయింది. వరండా, తరగది గది, వంట గదిలోని ఫ్లోరింగ్ పగుళ్లిచ్చింది. కొత్తం చంద్రగూడెంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పదేళ్లుగా అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. నాడు-నేడు కింద భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినప్పటికీ స్థలం లేకపోవడంతో అద్దెభవనంలోనే నడుపుతున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరడంతో గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో దెబ్బతిన్న భవనాల్లో కూర్చోవాలంటే ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టేనని భయపడుతున్నారు.

● **దీర్ఘకాలంగా అసంపూర్తిగానే...**

మైలవరం, పుల్లూరు సెక్టార్ల పరిధిలో 56 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 38 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 8 కేంద్రాలను అద్దె భవనాల్లో, మరో 10 కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లోని గదులను తీసుకొని నడుపుతున్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అంగన్వాడీ భవనాల నిర్వహణకు నిధులు అంతంతమాత్రంగా కేటాయించడంతో చాలా భవనాలు శిథిలమయ్యాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు ప్రారంభించినా బిల్లులు రాక పనులను సగంలోనే నిలిపివేశారు. పొందుగలలో భవన నిర్మాణం పూర్తి కావచ్చినా.. పనులను నెలల తరబడి చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలోని ఒకే గదిలో పిల్లలకు వంట, తరగతులను చెప్పాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాలకు, శిథిలావస్థకు చేరిన భవనాలకు నిధులు కేటాయించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్వాడీ కేంద్రాల సమస్యలపై సీడీపీవో పుష్పలత ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా దెబ్బతిన్న భవనాలకు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించామని, నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తామన్నారు. అదేవిధంగా భవనాలు లేని కేంద్రాలకు గ్రామాల్లో స్థలాలను చూసి సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

సమస్యలు పరిష్కరించండి

» మంత్రి సంధ్యారాణికి అంగన్వాడీ సంఘ నేతల వినతి

పెనమలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి తెలుగునాడు అంగన్వాడీ ట్రేడ్‌యూనియన్ నాయకులు సచివాలయంలోని మంత్రి పేషీలో వినతి పత్రం ఇచ్చారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలుచేయాలని, సెంటరు నిర్వహణకు ఇబ్బందిగా ఉన్న నాలుగు యాప్‌లను ఒకే యాప్ కిందికి తీసుకురావాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కూరగాయలు, సరుకుల బిల్లుల ధరలు పెంచాలని తదితర ఇరవై అంశాలతో వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసమ్మ తదితరులు ఉన్నారు.



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న సంఘ నేతలు

విజయవాడ తూర్పు

దాసాంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ. 11.80లక్షలు



గుణదల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాచవరం దాసాంజేయ స్వామి ఆలయ హుండీలో కానుకలు లెక్కించగా రూ. 11.80లక్షల ఆదాయం వచ్చిందని ఈవో పాతూరి లోకేశ్వరి తెలిపారు. బుధవారం జరిగిన లెక్కింపును దేవదాయ శాఖ విజయవాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్ కుమార్ పర్యవేక్షించారు. నగదు రూ. 11.80 లక్షలు రాగా వెండి కేజీ 36 గ్రాములు వచ్చిందని తెలిపారు. సేవాదళ్ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది సమక్షంలో కానుకలను లెక్కించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న తబలారస వ్యవస్థాపకుడు డాక్టర్ బి. ఉదయ భాస్కర్

మానవ సంబంధాలు మెరుగుపరుచుకోవడంపై సదస్సు

మొగల్రాజపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం చేసే చోట సహోద్యోగులతో, పై వారితో, సిబ్బందితో మానవ సంబంధాలు మెరుగుపరుచుకోవడం ముఖ్యమని తబలారస వ్యవస్థాపకుడు డాక్టర్ బి. ఉదయభాస్కర్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంఎస్సీ, ఎంసీఏ విద్యార్థులకు విశాఖపట్నంకు చెందిన తబలారం సంస్థ సహకారంతో మానవ విలువలు-మానవ సంబంధాలు మెరుగు పరుచుకోవడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మానవ విలువలు పాటించినపుడు మనం పనిచేసే చోట గౌరవం పెరుగు తుందని, వృత్తిపరంగా సంతోషం, శాంతి, సంతృప్తి పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, కంప్యూటర్ సైన్స్ హెడ్ డాక్టర్ టీఎస్ రవికిరణ్, సమన్వయకర్త ఏ.కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులను పూర్తి చేయాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర



పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

లబ్బీపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్ వద్దగల ఫ్లైఓవర్ కింద జరుగుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆటోనగర్, బెంజిసర్కిల్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే బెంజిసర్కిల్ ప్రాంతంలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు జరగాలని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆటోనగర్ గార్బేజి ట్రాన్స్‌ఫర్ లో కాటాను నెలలోపు పూర్తి చేయాలని, దానిని పరిశుభ్రంగా ఉంచాలని, దాని పరిరక్షణ కోసం రైలింగ్, గోడను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి. ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి, ఇతర శానిటరీ ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించండి

వన్‌టౌన్: పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నూతన భవనంలో ఉద్యానవనాలపై పార్క్ సూపర్‌వైజర్లతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని, పరిశుభ్రతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, పార్కుల్లో ఆట పరికరాలు ఏమైనా పాడైపోయినట్లయితే ఇంజనీరింగ్ సిబ్బంది సహకారంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసు కోవాలన్నారు. ప్రజలు పార్కుల్లో ఆనందకరంగా గడిపేటట్టుగా చూసుకోవాల్సిన బాధ్యత పార్క్ సూపర్ వైజర్లదేనన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, పార్క్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు పరుపు, దుప్పటి కిట్ల పంపిణీ



బాధితులకు కిట్లను అందజేస్తున్న బార్ కౌన్సిల్ మెంబర్ మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శివరాంప్రసాద్

విజయవాడ లీగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో బుధవారం ఏలూరు ఫ్లాష్‌టీం, విజయవాడ ఫ్లాష్‌టీం, రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో సింగ్‌నగర్, కండ్రిక, పాయకాపురం, రాజీవ్‌నగర్ తదితర ప్రాంత వరద బాధితులకు పరుపులు, దుప్పట్లు, గోడ గడియారం కిట్‌లను అందజేశారు. న్యాయవాది యర్రంశెట్టి శ్రీనివాసరావు సౌజన్యంతో బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.గురునాథం, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ సూరాబత్తుల మల్లేశ్వరరావు, బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా)లు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పడవల ఏడుకొండలు, చీదెళ్ల నాగేశ్వరరావు, సంపర శ్రీనివాసరావు, పీడీఎస్ నారాయణ, ఏలూరు సిటీ 23వ డివిజన్ కార్పొరేటర్ సాంబ, ఏలూరు ఫ్లాష్ టీం, విజయవాడ ఫ్లాష్ టీం, మమ్మీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితుల సేవలో గోల్డెన్ టెంపుల్ ట్రస్టు

5 వేల వస్త్రకిట్లు పంపిణీ చేసిన ట్రస్ట్ ప్రతినిధులు



కిట్లను ముఖ్యమంత్రికి అందిస్తున్న గోల్డెన్ టెంపుల్ ట్రస్ట్ ప్రతినిధులు

కృష్ణలంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరద బారినపడి సర్వం కోల్పోయిన విజయవాడలోని బాధితులకు సాయమందించేందుకు తమిళనాడు, వేలూరులోని గోల్డెన్ టెంపుల్ ట్రస్టు ముందుకొచ్చింది. ఈ మేరకు ట్రస్ట్ ప్రతినిధి కళ్యాణ్ చక్రవర్తి 5 వేల వస్త్ర కిట్లను విజయవాడ తీసుకొచ్చారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కిట్లను చూపించారు. వరద బాధితులను సామాజిక బాధ్యతగా ఆదుకొనేందుకు ముందుకొచ్చిన ట్రస్టును ముఖ్యమంత్రి అభినందించారు. వస్త్ర కిట్లను మంగళ, బుధవారాల్లో ట్రస్ట్ ప్రతినిధులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. ఒక్కో కిట్‌లో దుప్పటి, కండువా, చీర, పంచె వున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు.

మార్కెట్లో కల్తీ ఆహార పదార్థాలను గుర్తించాలి

జిల్లా అఖిల భారతీయ గ్రాహక్ పంచాయతీ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

గుణదల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో సదరు ప్యాకెట్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర, తయారీ గడువు, తేదీలతో కూడిన వివరాలు లేనివి కొనుగోలు చేయరాదని జిల్లా అఖిల భారతీయ గ్రాహక్ పంచాయతీ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు తెలిపారు. మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన సదస్సును కామర్స్ విభాగం నిర్వహించింది. బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మోహనరావు మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాలు మార్కెట్లో బాగా వాడుకలోకి వచ్చేస్తున్నాయని, వాటిని గుర్తించాలని లేని పక్షంలో అనారోగ్యం పాలవుతామని అన్నారు. కల్తీ ఆహార పదార్థాలు ఎక్కడైనా కనబడితే వాటి వివరాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల దృష్టికి తీసుకురావాలని కోరారు. నూతన వినియోగదారుల చట్టం 2019పై యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ కె.నవీన, డాక్టర్ సి.బ్రహ్మయ్య, లక్ష్మీభారతి, రాధిక, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీ కొట్టులో మద్యం విక్రయాలు

- ఖాళీ చేయమన్న బిల్డింగ్ యజమానిపై నిర్వాహకుడు దౌర్జన్యం
- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

రాణిగారితోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీ కొట్టు పేరుతో బెల్టు షాపు నడుపుతున్న వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కృష్ణలంక బాలాజీనగర్‌లో ఉన్న వైన్‌షాపు సమీపంలో ఉన్న ఒక టీ స్టాల్‌లో ఉదయం 5గంటల నుంచి మద్యం షాపు తెరిచే వరకు మద్యం విక్రయాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న బిల్డింగ్ యజమాని ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు చేయవద్దని హెచ్చరించినా వినని సదరు టీ స్టాల్ నిర్వాహకుడు మద్యాన్ని విక్రయిస్తుండడంతో బిల్డింగ్ యజమాని అతన్ని ఖాళీ చేయమని చెప్పినట్లు తెలిసింది. దీంతో టీస్టాల్ నిర్వాహకుడు షాపు ఖాళీ చేయనని బిల్డింగ్ యజమానిపై దౌర్జన్యం చేయడంతో విషయం పోలీసు స్టేషన్‌కు చేరింది. అక్కడ కూడా అతను పోలీసుల మాట కూడా వినకపోవడంతో ఈ వ్యవహారం గత నాలుగు రోజుల నుంచి నలుగుతుంది. అయితే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్న వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు. అదే విధంగా ఈ బెల్టు షాపునకు ఎక్కడి నుంచి మద్యం వస్తుందో కూడా విచారణ చేసి మద్యం సరఫరా చేస్తున్న వారిపై కూడా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న డీన్ గుంటూరు హరిబాబు

కరాటే విజేత పురోహిత్‌కు అభినందనలు

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 23వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థి సంతోష్‌సింగ్ రాజ్ పురోహిత్ బంగారు పతకం సాధించడం గర్వకారణమని శ్రీ చైతన్య కళాశాల (రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్) ఎగ్జిక్యూటివ్ డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. ఈనెల 3న విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్‌స్టేడియంలో పోటీలు జరిగినట్లు తెలిపారు. విద్యార్థికి డే స్కాలర్ డీన్ బి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ గోకర్ణేశ్వరరావులు అభినందనలు తెలిపారు.

ఎన్నికల హామీ నెరవేర్చినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

ఆటోనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్య నగరాల్లో ఈద్గా, ముస్లిం శ్మశానవాటికలకు స్థలాల సేకరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఆదేశాలు జారీ చేసినందుకు ముస్లిం సమాజం తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నామని జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ ఖాలిక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని పేర్కొన్నారు.

కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్ రేపు ప్రారంభం



ప్రాక్టీస్ మొదలు పెట్టిన రైల్వేస్ టీమ్

విజయవాడస్పోర్ట్సు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని డీవీఆర్ గ్రౌండ్స్‌లో ఈనెల 8 నుంచి 11 వరకు కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రా, రైల్వేస్ జట్లు తలపడనున్నాయని, దీనికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆతిథ్య ఆంధ్రా జట్టుతో తలపడేందుకు విజయ వాడకు చేరుకున్న రైల్వేస్ టీమ్ తన ప్రాక్టీస్ మూలపాడు డీవీఆర్ గ్రౌండ్స్‌లో ప్రారంభించింది.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ, బిల్డింగ్ వర్కర్స్ సభ్యులు

కరపత్రాల పంపిణీ

రాణిగారితోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించే సంక్షేమ బోర్డుని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఈ నెల 8న ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రాణిగారితోట 17, 18 డివిజన్ల సీఐటీయూ, కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యునియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాణిగారితోటలో ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తూర్పు సిటీ ఆఫీసు బ్యారర్స్, టి.చంద్రశేఖర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దుర్గగుడి కళావేదిక పై తోలు బొమ్మలాట



దుర్గగుడి కళావేదికపై తోలు బొమ్మలాట

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి కళావేదికపై బుధవారం కాకినాడ సమీపంలోని మాధవపట్నానికి చెందిన శ్రీసాయి నిలయం చలనచిత్ర కళాప్రదర్శన కమిటీ ఆధ్వర్యంలో తోలు బొమ్మలాట జరిగింది. గురువుగా వ్యవహరిస్తున్న తోట బాలకృష్ణకు వంశపారపర్యంగా ఈ కళా ప్రదర్శన ఒనకూరటంతో దానిని కొనసాగిస్తున్నారు. సుందరకాండ, మైరావణ చరిత్ర, సతీ సులోచన, లవకుశ, లక్ష్మణ మూర్ఛ, అంగద రాయబారం, విరాటపర్వం, కీచక వధ, ఉత్తర గోగ్రహణం, శమీపూజ, రామాయణంలోని 5వ ఘట్టం సుందరకాండ, తదితరాలను తోలుబొమ్మలాటలో ప్రదర్శించారు. ఈవో రామరావు, డిప్యూటీ ఈవో రత్నరాజులు కళాబృందాన్ని అభినందించి ప్రశంసాపత్రాలు అందచేశారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు.

యూఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలి



యూఎస్ఎఫ్ఐ మహాసభల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కాసాని గణేష్ బాబు

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 14, 15 తేదీల్లో జరిగే యూఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు కోరారు. పంజా సెంటర్‌లో ఉన్న ఎంసీపీఐ (యు) కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకినేని బసవ పున్నయ్య భవనంలోని షాహిద్ భగత్‌సింగ్ ప్రాంగణంలో మహాసభలు జరగనున్నాయని తెలిపారు. నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా ఐక్య విద్యార్థి సమాఖ్య పోరాటాలకు విద్యార్థులు మద్దతుగా నిలబడాలని, ఈ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలను కోరుతున్నామన్నారు.

ఠాగూర్ గ్రంథాలయానికి సాహితీ పుస్తకాలు అందజేత



గవర్నర్‌పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, విశ్రాంత తెలుగుశాఖాధిపతి డాక్టర్ జంధ్యాల పరదేశి బాబు తాను రచించి, ప్రచురించిన 19 సాహిత్య గ్రంథాలను బుధవారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జంధ్యాల మాట్లాడుతూ ఈ గ్రంథాలు సాహిత్య విద్యార్థులకు, పోటీ పరీక్షలకు శిక్షణ పొందే అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.



11 నుంచి భవానీ దీక్షల స్వీకరణ

● డిసెంబరు 21 నుంచి దీక్షల విరమణలు ప్రారంభం ● 25న ముగింపు, మహాపూర్ణాహుతి

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 11 నుంచి భవానీల దీక్ష స్వీకరణ ప్రారంభమవుతుందని ఈవో కేఎస్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీకశుద్ధ దశమి అనంతరం ఏకాదశి తిథిలో ఈనెల 11న ఉదయం 7 గంటలకు మండల దీక్ష స్వీకరణ ప్రారంభమవుతుంది. 15న సమాప్తి అవుతాయి. డిసెంబరు 1న అర్ధ మండల దీక్షల స్వీకరణ ప్రారంభమవుతుంది. 5న ముగుస్తాయి. 14న సత్యనారాయణపురంలోని రామకోటి మైదానంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు కలశజ్యోతి ఉత్సవం ప్రారంభమవుతుంది. నగరోత్సవంలో పాల్గొన్న అమ్మవారు తిరిగి దేవస్థానానికి చేరతారు. డిసెంబరు 21 నుంచి 25 వరకు దీక్షల విరమణలు జరుగుతాయి. 21న ఉదయం 6.30 గంటలకు దీక్షల ముగింపు సందర్భంగా అగ్ని ప్రతిష్ఠాపన, శతచండీయాగం, గిరి ప్రదక్షిణలు, భవానీ దీక్షల విరమణలు జరుగుతాయి. డిసెంబరు 25న ఉదయం 10 గంటలకు దీక్షల విరమణలు సమాప్తి అవుతాయి. ఉదయం 10 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. డిసెంబరు 21 నుంచి 26 వరకు దేవస్థానంలో ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఇవన్నీ అర్చకులు ఏకాంతంగా నిర్వహిస్తారు. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వర స్వామికి ప్రతి రోజూ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రలింగార్చన, ప్రతిరోజూ మధ్యాహ్నం 3నుంచి రాత్రి 7గంటల వరకు నిర్వహిస్తారు. రూ.500 రుసుము చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. కార్తీక సోమవారం ఏకాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి రోజుల్లో బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకాలు జరుగుతాయి. రూ.2000లు చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

(5వ పేజీ తరువాయి)

వెళ్లింది. ఇటీవల ఏ.కొండూరు మండలంలో రెండు రేషన్ మాఫియా ముఠాలు సినీఫక్కీలో పరస్పరం కార్లతో ఢీకొనడం వివాదాస్పదమైంది.

చైన్ లింక్ ద్వారా వ్యాపారం

జిల్లావ్యాప్తంగా ప్రతి మండలానికి ఒక డాన్ ఉన్నాడు. వీరందరికీ 12 మంది మాస్టర్ డాన్‌లున్నారు. మండల స్థాయిలో డాన్‌ల వివరాలు సివిల్ సప్లయిస్ అధికారులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, విజిలెన్స్ అధికారులకు తెలిసినా పట్టించుకోవట్లేదు. ఈ రిసైక్లింగ్ అంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది. చైన్ లింక్‌లా సేకరించిన బియ్యమంతా డాన్‌కు విక్రయిస్తారు. మండల స్థాయిలోని డాన్‌లు ఈ బియ్యాన్ని రైస్ మిల్లులకు, చేపల చెరువులకు, ఫ్లోర్‌మిల్లులకు, పోర్టులకు తరలిస్తారు. ఇలా బియ్యం ఇతర దేశాలకు తరలిపోతోంది. ఇలాంటి వారందరినీ కొంతమంది యూట్యూబర్లు సమాచారం ఇచ్చి పట్టిస్తే తప్ప సివిల్ సప్లయిస్ అధికారులు క్షేత్రస్థాయిలో స్పందించట్లేదు. పోలీసులు పదేపదే అక్రమ బియ్యం వ్యాపారులను పట్టుకుంటున్నా సివిల్ సప్లయిస్ అధికారుల్లో మాత్రం స్పందన లేదు.

సింగ్‌నగర్‌లో బడాడాన్

సింగ్‌నగర్ వేదికగా ఓ డాన్‌గా అక్రమ బియ్యం సామ్రాజ్యాన్నే నడుపుతున్నాడు. నగరంలోని చాలామంది బియ్యం వ్యాపారులతో ఈ డీలర్‌కు సంబంధాలున్నాయి. సివిల్ సప్లయిస్ అధికారులకు బాగా ఇష్టుడు. వీరంతా ముద్దుగా రింగ్ మాస్టర్ అని పిలుచుకుంటారు. బీఆర్‌టీఎస్ రోడ్డు, సింగ్‌నగర్, వన్‌టౌన్, భవానీపురం, కృష్ణలంకలో బియ్యం వ్యాపారులున్నారు. వీరితో రింగ్ మాస్టర్‌కు సంబంధాలున్నాయి. అలాగే, నున్న, గన్నవరం, ఇబ్రహీంపట్నం మండలాల కేంద్రంగా దశాబ్దాల నుంచి అక్రమ బియ్యం వ్యాపారం నడిపిస్తున్న డాన్‌లు ఉన్నారు. ఏ.కొండూరు, నందిగామ, జి.కొండూరు, మైలవరం, జగ్గయ్యపేట, గంపలగూడెం, తిరువూరు మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. ఇంతా జరుగుతున్నా ఈ అక్రమ బియ్యం వ్యాపారులపై సివిల్ సప్లయిస్ అధికారులు క్రిమినల్ కేసులు పెట్టట్లేదు. మామూళ్ల కారణంగానే ఇలా చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అధికారులే కారణం

పేదల బియ్యం పదేపదే రీ సైక్లింగ్ కావడానికి సివిల్ సప్లయిస్ అధికారు లే రాచబాటలు వేస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడిన అక్రమ రేషన్ బియ్యా న్ని సివిల్ సప్లయిస్ అధికారులు తిరిగి ఆక్షన్ వేసి అమ్మేస్తున్నారు. వీటిని అక్రమ బియ్యం వ్యాపారులే కొంటున్నారు. ఇలా బిల్లులు తెచ్చుకుని, నకిలీ వి తయారుచేసి, ఆక్షన్‌లో వచ్చిన బియ్యం సహా తమ వద్ద ఉన్న బియ్యా న్ని సరిహద్దులు దాటిస్తున్నారు. అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యాన్ని ఆక్షన్ పేరుతో కాకుండా, తర్వాత నెల కోటాలో పేదలకు పంచితే ప్రభుత్వంపై కొంత భారంమైనా తగ్గుతుంది. రిసైక్లింగ్‌కు అడ్డుకట్ట పడుతుంది.

పీడీఎస్ డీటీల పెత్తనం

జిల్లావ్యాప్తంగా పీడీఎస్ డీటీలు కొందరు రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. సాధారణంగా రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లలో చాలామంది అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్నా రు. వీరికిచ్చే కమీషన్ కుటుంబ పోషణకు సరిపోక ఇలా అక్రమాలకు పా ల్పడుతున్నారు. దీనిని అడ్డం పెట్టుకుని డీలర్లు, ఎండీయూల నుంచి పీడీఎస్ డీటీలు నెల నెలా రూ.1,500, రూ.2 వేలు, ఆపైన వసూలు చేస్తున్నారు.

దోచుకున్నోడికి దోచుకున్నంత

(5వ పేజీ తరువాయి)

లభించేది. ఇప్పుడు క్వారీల్లోనే అధిక రేటు వసూలు చేయటంతో రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు వినియోగదారులు చెల్లించాలి వస్తోంది. దీంతో సీఎం చంద్రబాబు ఆశయం పూర్తిగా నీరుగారిందని పలువురు అంటున్నారు.

దళితుల ఆందోళన

ఐలూరులో కొన్ని రోజుల పాటు ఉచిత ఇసుక తవ్వకాలు జరగ్గా రెండు రోజుల నుంచి ఓ భూస్వామి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లకుండా తన కారుని రహదారికి అడ్డంగా పెట్టటంపై బుధవారం దళితులు ఆందోళన నిర్వహించారు. తమకు ఇసుక తవ్వుకునే అవకాశం కల్పించకుంటే దళిత సంఘాలతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

మేం జోక్యం చేసుకోలేం: తహసీల్దార్

ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ఉచిత ఇసుక తవ్వకాలపై తాము జోక్యం చేసుకోలేమని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి ఆంధ్రజ్యోతికి తెలిపారు. కావాలంటే జీవో చూసుకోమన్నారు. ఉచిత ఇసుక క్వారీలంటూ ఎక్కడా లేవన్నారు. రొయ్యూరులో రెండు, నార్తువల్లూరులో మూడింటికి మాత్రమే అధికారికంగా అనుమతి ఉందని, అక్కడింకా తవ్వకాలు జరపటం లేదన్నారు. మిగతాచోట్ల జరిగే ఉచిత ఇసుక తవ్వకాలపై తామేం చేయలేమన్నారు.

డబుల్ ధమాకా

(5వ పేజీ తరువాయి)

అధికారాన్ని, తన హోదాను అడ్డం పెట్టుకుని కటారపు రామారావు చెలరేగిపోయారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తూ నిరుపేదలకు దక్కాల్సిన పింఛన్‌ను దర్జాగా తన ఖాతాలో వేసుకుంటున్నారు. ఐడీ 106800655తో కటారపు రామారావు నెలకు రూ.7 వేల పెన్షన్ తీసుకుంటున్నారు. అలాగే, ఇదే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గుమస్తాగా పనిచేస్తున్న కటారపు గోవర్ధన్‌రావు ఐడీ 106800792తో నెలకు రూ.7 వేల పెన్షన్ తీసుకుంటున్నాడు.

2019 నుంచీ..

వీరిద్దరూ 2019 నుంచి పింఛన్లు పొందుతుండగా, 2024 జూలైలో ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. జిల్లా సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఊర్మిళను విచారణాధికారిగా నియమించారు. ఆమె గతనెలలో విచారణ జరిపి, 22న నివేదికను సహకార శాఖ అధికారికి అందజేశారు. ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు సీఈవో, గుమస్తాపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నివేదికలో కోరారు. అదే సమయంలో ప్రభుత్వాన్ని మోసంచేసి ఆరేళ్లుగా ప్రభుత్వం నుంచి పింఛన్ రూపంలో పొందిన సుమారు రూ.4లక్షలను రికవరీ చేయాలన్నారు. ఈ నివేదికపై స్పందించిన అధికారులు మంగళవారం గుమస్తా కటారపు గోవర్ధన్‌రావుపై సస్పెన్షన్ వేటు వేశారు. సీఈవో రామారావుపై వేటు వేసేందుకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే వేటు వేయడానికి వెనుకాడుతున్నట్లు సమాచారం.

సభ్యత్వాలపై విచారణ జరపాలి

గోళ్లమూడి సహకార సంఘంలో మొత్తం 875 మంది సభ్యులుగా ఉండగా, వీరిలో అధికశాతం మందికి అసలు భూమే లేదని, అయినా వారిని సభ్యులుగా కొనసాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు విచారణ జరపకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. సహకారం సంఘం సీఈవో, గుమస్తా కలిసి రైతులకిచ్చిన రుణాలపై అధిక వడ్డీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి.

నూరుశాతం బీమా క్లెయిమ్‌ల

పరిష్కారంపై దృష్టిపెట్టండి

● ఇప్పటికే పూర్తయిన 98.20 శాతం క్లెయిమ్‌ల పరిష్కారం
● బాధితులకు చేయూతనివ్వడంలో బీమా సంస్థల కృషి భేష్
● ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంత ప్రజల వాహనాలు, వివిధ ఆస్తి నష్టాలకు సంబంధించి బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో బీమా సంస్థలు చూపిన చొరవ ప్రశంసనీయమని, ఇప్పటికే 98.20 శాతం క్లెయిమ్‌ల పరిష్కారం పూర్తయిందని, మిగిలిన కొద్దిపాటి క్లెయిమ్‌లను కూడా త్వరగా పరిష్కరించాలని బీమా సంస్థలకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో నిధి మీనా, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహంతో కలిసి బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బీమా సంస్థల వారీగా నమోదైన క్లెయిమ్‌లు, పరిష్కరించిన క్లెయిమ్‌లు, ఇంకా మిగిలి ఉన్న క్లెయిమ్‌లపై చర్చించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ 12,638 మోటారు వాహనాల క్లయిమ్‌లు, 2,821 ఆస్తుల క్లయిమ్‌లతో కలిపి మొత్తం 15,459 క్లయిమ్‌లు నమోదు కాగా 605 ఉపసంహరణ, 325 తిరస్కరణకు గురైన క్లెయిమ్‌లు పోనూ 14,529 నికర క్లయిమ్‌ల్లో ఆన్ అకౌంట్, అండర్ ఆక్షన్‌తో సహా 98.20 శాతం క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ చేయడం జరిగిందన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంపై ముఖ్యమంత్రి తొలినుంచి ప్రత్యేకంగా దృష్టి సారించారని, ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు లభ్యత తక్కువగా ఉండటం, అటాచ్‌మెంట్ రుణాలు, ఆర్సీ క్యాన్సిలేషన్ తదితరాల వల్ల కొన్ని క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరగా పరిష్కరించి సెటిల్‌మెంట్ ప్రక్రియను పూర్తిచేయాలని నిధి మీనా సూచించారు. సమావేశంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రవీణ్, జీఎం డీవీసీ బి.సాంబయ్య, వివిధ బీమా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

రేపు స్కిల్ స్పోక్స్ డ్రైవ్

కృష్ణలంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నవంబరు 8న శుక్రవారం స్కిల్ స్పోక్స్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు బుధవారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్కిల్ స్పోక్ట్ డ్రైవ్‌లో ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీ వారు పాల్గొంటున్నారన్నారు. ఈ కంపెనీలో ఉద్యోగాలకు టెన్త్ (పాస్/ఫెయిల్), ఐటీఐ (పాస్/ఫెయిల్) అప్రంటీషిప్ పూర్తిచేసిన 20 నుంచి 35ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు సుమారు రూ.12 వేల నుంచి రూ.15వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగావకాశాలు ఉన్నాయని, నవంబరు 8న నిర్వహించబోయే ఈ స్కిల్ స్పోక్స్ డ్రైవ్‌కి హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్టు ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తగిన అర్హతలు కలిగి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా హెచ్‌టీటీపీఎస్://టిన్యూరల్.కామ్/స్కిల్-స్పోక్స్-వీజేడీస్ట్ లింక్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి సదరు స్కిల్ స్పోక్స్ డ్రైవ్‌కి రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని, మరిన్ని వివరాలకు 6305004318 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ఎన్టీటీపీఎస్ ఉద్యోగులపై నిఘా నేత్రం

● ఇకపై యూనిఫాం, సమయపాలన తప్పనిసరి చేస్తూ ఆదేశాలు

ఇబ్రహీంపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్‌లో నిర్లక్ష్యంగా విధులు నిర్వహించే ఉద్యోగులపై ఏపీ జెన్కో కఠిన చర్యలకు సిద్ధమైంది. ఉత్పత్తి నిలిచిపోవడానికి, తరచూ బ్రేక్‌డౌన్ అయ్యేందుకు కారణమైన సుమారు 100 మంది ఇంజనీరింగ్ విభాగంలో బదిలీ చేసిన జెన్కో యాజమాన్యం నూతనంగా యూనిఫాం, సమయ పాలనను తీసుకువచ్చింది. రెండ్రోజుల క్రితమే సీఈకి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. విధులకు హాజరైనట్టు హాజరై బయటకు వెళ్లి సొంత పనులు చేసుకుంటున్నారని గుర్తించినట్టు స్పష్టంగా అందులో పేర్కొనడం గమనార్హం. ఇప్పటి వరకు జనరల్ డ్యూటీ చేసేవారు ఉదయమంతా సొంత పనులు చేసుకొని సాయంత్రం 3.30 వరకు విధులకు హాజరయ్యారు. ఇప్పటి వరకు వీరిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, వడ్డీ వ్యాపారం ఇతరత్రా చేసేవారున్నారు. ఇప్పుడిచ్చిన ఆదేశాలతో ఉదయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, మొదటి షిప్టు వారు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెండో షిప్టు వారు మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8.30 వరకు, మూడో షిప్టు వారు రాత్రి 8.30 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు విధిగా యూనిఫాం ధరించి డ్యూటీ చేయాల్సి ఉంది. ఈ విధి విధానాలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలకు తీసుకోనున్నట్టు జెన్కో యాజమాన్యం పేర్కొంది. ఈ ఆదేశాలు నిర్లక్ష్యంగా ఉండే కొందరు ఉద్యోగులకు పచ్చి వెలక్కాయ నోట్లో పడ్డ చందంగా ఉంది.

రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

● అధికారుల అవగాహన సదస్సులో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. పల్లె పండుగ - ఉపాధి హామీ పథకం 2024-25 సిమెంటు రహదారులు - నాణ్యత అనే అంశంపై జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో బుధవారం పంచాయతీరాజ్, ఉపాధిహామీ పథకం సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గుంతలులేని రహదారులను తీర్చిదిద్దే లక్ష్యంతోపాటు, అన్ని రహదారులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం చేస్తున్న రహదారుల నిర్మాణంలో నాణ్యత తగ్గకుండా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. రహదారుల నిర్మాణంలో ఉపయోగించే మెటీరియల్‌ను, నిర్మాణ పనులను అధికారులు తరచూ తనిఖీ చేయాలన్నారు. తొలుత ఏపీ ఆర్ఆర్‌పీ అడ్వయిజర్ కే ప్రభాకరరెడ్డి వివిధ కేటగిరీల్లో రహదారులు, సిమెంటు రహదారుల నిర్మాణంలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పంచాయతీ రాజ్ విభాగం ఎస్ఈ రమణారావు, ఈఈ సుధాకర్‌గౌడ్, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

10న డీఎస్సీ ఉచితశిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10న స్క్రీనింగ్‌టెస్ట్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. తన చాంబరులో బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమశాఖ, రవాణా, వైద్యశాఖ అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల్లో 10న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్ష నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. కంప్యూటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే సరిచేసేందుకు సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు రవాణా సౌకర్యాలను కల్పించాలన్నారు. అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ షాహిద్‌బాబు, డీఎంహెచ్‌వో గీతాబాయి, మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజరు పెద్దిరాజు పాల్గొన్నారు.

నేడు ఎన్ఎంయూఏ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం

బస్టేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంద ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో పాటు విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు వీకేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.పురుషోత్తం నాయుడు, పశ్చిమ కృష్ణా ఎన్జీవో నేత విద్యాసాగర్ పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని 128 డిపోల నుంచి యూనియన్ డిపో విభాగం అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారన్నారు.

సెమీస్ దశకు ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పటమట చెన్నుపాటి రామకోటయ్య స్టేడియం వేదికగా జరుగుతున్న కాసా వడ్లమూడి మోహన్‌కృష్ణ మెమోరియల్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ అండర్-13 బాలబాలికల బ్యాడింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండోరోజు బాలబాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పలు జిల్లాల ప్లేయర్ సెమీస్ దశకు చేరుకున్నారు. పోటీలను కేడీబీఏ అధ్యక్షులు అంకమ్మ చౌదరి, ఉపాధ్యక్షులు హరికృష్ణ పర్యవేక్షిస్తున్నారు.



రెండోరోజు ఫలితాలు ఇలా..

బాలుర అండర్-13 క్వార్టర్స్ ఫైనల్స్‌లో ఎం జశ్వంత్, కే మోక్షజ్ఞ సాయి, సాయి సోహన్, బాలికల సింగిల్స్‌లో డీ ఆశాశ్రీ, ఎం భవిత, శ్రీరామ్ కావ్య, ఎస్ మనస్వి ప్రత్యర్థులపై విజయం సాధించి సెమీస్‌కు చేరారు. బాలురు డబుల్స్‌లో జీ షణ్ముక్ వర్ధన్-ఎం జశ్వంత్, కే. మోక్షజ్ఞ సాయి- కండెపి సుహాస్, సీహెచ్ మహీధర్‌రెడ్డి - టీ వర్షిత్, దుర్గా అఖిలేష్ - సాయి సోహన్ సెమీస్‌లోకి ప్రవేశించారు. బాలికల డబుల్స్‌లో జీ వెంకట లతారెడ్డి-శ్రీరామ్ కావ్య, ఎం శ్రీ తేజ - ఎం వీర దుర్గాలక్ష్మి, సీహెచ్ ఉజ్వల సుముఖి-వై చిన్మయి, డీ ఆశా శ్రీ-ఎస్ మనస్వి విజయం సాధించి సెమీస్‌కు చేరారు.

సీఎం సహాయనిధికి రూ.50లక్షల విరాళం..



అన్న క్యాంటీన్లకు జీబీఆర్ హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గద్దం బుచ్చారావు రూ.50లక్షల విరాళాన్ని అందించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి ఈ మేరకు చెక్కు అందజేశారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం తీసుకున్న సంకల్పానికి మద్దతుగా విరాళం అందించిన బుచ్చారావును సీఎం చంద్రబాబు అభినందించారు.



దుర్గగుడిలో హుండీలు లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది.

దుర్గమ్మకు కానుకల రూపేణ రూ.2.83 కోట్లు

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 15 రోజులకుగాను రూ.2,83,53,460 నగదు రూపేణా లభించాయి. బంగారం 431గ్రాములు, వెండి 6కిలోల 450 గ్రాములు కానుకల రూపేణ వచ్చాయి. 324 యూఎస్ఏ డాలర్లు, 25 యుఏఈ దీర్హమ్స్, ఇండోనేషియా కరెన్సీ రూ.30వేలు, 10 యూరప్ యూరోలు, 1 ఒమన్ రియాల్, 412 భైంసాలు, 260 కెనడా డాలర్లు, 6 సౌదీ రియాల్స్, 30 ఇంగ్లండ్ డాలర్లు, 25 ఆస్ట్రేలియా డాలర్లు, 144 ఖతార్ రియాల్స్ లభించాయి. ఆన్‌లైన్ హుండీ ద్వారా రూ.89,633 వచ్చాయి. డిప్యూటీ ఈవో రత్నరాజు, అధికారులు, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, వన్‌టౌన్ పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విల్లుపురం - సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చత్ పూజ, కార్తీక ఏకాదశి పండుగ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే విల్లుపురం, సికింద్రాబాద్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. 07601 సికింద్రాబాద్ - విజయవాడ రైలు గురువారం రాత్రి 7.40 గంటలకు బయలు దేరుతుంది. గురువారం మధ్యాహ్నం 1.05 గంటలకు గమ్యం చేరుతుంది. 7, 14 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. 07602 విల్లుపురం - సికింద్రాబాద్ రైలు శుక్రవారం సాయంత్రం 4.05 గంటలకు బయలుదేరుతుంది. శనివారం ఉదయం 9.40 గంటలకు గమ్యం చేరుతుంది. 8, 15 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. ఈ ప్రత్యేక రైళ్లు మౌలాలి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పడి, తిరువనంతపురం స్టేషన్లలో ఆగుతుంది. ఫస్ట్ ఏసీ, ఏసీ టూటైర్, ఏసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఈ రైళ్లకు అమర్చబడి ఉంటాయి.



యూనిడో ప్రతినిధులతో భేటీ అయిన మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

కాలుష్యరహిత నగరంగా విజయవాడ

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతున్న క్రమంలో ఇందుకు సహకరిస్తున్న యూనిడో ప్రతినిధులతో బుధవారం విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. వాడుక నీటి శుద్ధతపై వీఎంసీ తీసుకుంటు న్న చర్యలను, యూనిడో నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్య లు తీసుకోవాలని సూచించారు. ఈఈ వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ టెక్నికల్ అడ్వయిజర్ డాక్టర్ ఎస్.పి.సింగ్, కో-ఆర్డినేటర్ దీపిక పాల్గొన్నారు.

క్రీడా పాలసీలో సీఎం చంద్రబాబు మార్కు

● ఏపీవోఏ అధ్యక్షుడు ఆర్‌కే పురుషోత్తం హర్షం

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ, శ్రద్ధతో అద్భుతమైన నూతన క్రీడాపాలసీ తీసుకురావడం అందరికీ ఆనందదాయకమని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే పురుషోత్తం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. క్రీడా వసతుల కల్పన, క్యాష్ అవార్డులు, క్రీడా కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచడం వంటి నిర్ణయాలు దేశంలోనే అత్యున్నత క్రీడా పాలసీకి నిలుస్తుందనడంలో సందేహం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రలో గచ్చిబౌలి స్టేడియంలో వసతులు, నేషనల్ గేమ్స్ నిర్వహణ, ఆఫ్రో ఏషియన్ గేమ్స్ హైదరాబాద్‌లో నిర్వహించడంతో ఆయన గతంలోనే విజన్ చాటారన్నారు. సీఎం చంద్రబాబుతో ఏపీవోఏ అడుగులు వేస్తుందని, నేషనల్ గేమ్స్ నిర్వహణకు సహకారం అందిస్తామని పురుషోత్తమ్ తెలిపారు.



గాంధీనక్షత్రశాల (ప్లానిటోరియం)ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

గాంధీహిల్‌ను అభివృద్ధి చేస్తాం


● ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గాంధీ హిల్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. గాంధీ హిల్‌పై నక్షత్ర ప్రదర్శన శాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల క్రితం ప్లానిటోరియం మూతపడిందని రూ.82 లక్షలతో ఆధునీకరించిన ప్లానిటోరియంను తాను ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. అంతరిక్షం, గ్రహ కదలికలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించటంతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లోని అనేక అంశాలను ప్లానిటోరియం అందిస్తుందన్నారు. వీఎంసీ అధికారులతో సంప్రదించి త్వరలోనే గాంధీకొండ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటానికి కృషి జరుగుతుందన్నారు. జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, సీఎంహెచ్‌వో సురేష్ బాబు, ఈఈ వెంకటేశ్వరరెడ్డి, సాంకేతిక సలహాదారు నారాయణ మూర్తి, కూటమి నేతలు అడ్డూరి శ్రీరామ్, బుల్లా విజయ్, హర్ష పాల్గొన్నారు.

నవ్య చిత్రజ్యోతి
విజయవాడ ● గురువారం 7 నవంబరు 2024
cinema@andhrajyothy.com







వచ్చేనెల నుంచే స్పిరిట్



ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు ప్రభాస్. మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్', ప్రశాంత్ నీల్‌తో 'సలార్ 2', హను రాఘవపూడి సినిమాల షూటింగ్స్‌లో ఆయన పాల్గొంటున్నారు. అలాగే బాలీవుడ్‌లో సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రం కూడా ప్రభాస్ ఖాతాలో ఉంది. అయితే ఇన్ని చిత్రాల నడుమ 'స్పిరిట్' సెట్స్‌పైకి వెళ్లడం చాలా ఆలస్యం అవుతుందని అంతా అనుకున్నారు. అయితే అలాంటిదేం లేదనీ, ఈ సినిమా వచ్చే నెల్లోనే సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత భూషణ్ కుమార్ తెలిపారు. త్వరలోనే నటీనటుల ఎంపిక ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. 'స్పిరిట్' షూటింగ్ ప్రారంభమైన ఆర్నెల్ల తర్వాత 'యానిమల్ పార్క్'ను సెట్స్‌పైకి తీసుకెళ్తామని తెలిపారు. మానవ అక్రమ రవాణా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో తొలిసారి ప్రభాస్ పోలీసాఫీసర్ పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభమయ్యాయి. హర్షవర్ధన్ రామేశ్వర్‌తో కలిసి సందీప్‌రెడ్డి సంగీత సన్నాహాలు చేస్తున్న వీడియోను చిత్రబృందం షేర్ చేసింది.

శివ కార్తికేయన్ తెలుగు హీరో అయ్యారు


నితిన్

"అమరన్' చిత్రం చూస్తూ చాలా మంది తెలుగు ప్రేక్షకులు కంటతడి పెడుతున్న వీడియోలు చూశాను. మా సినిమా ప్రేక్షకులకు ఇంతలా చేరువైనందుకు సంతోషంగా ఉంది. విడుదలైన ప్రతి చోటా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. తెలుగులో మంచి వసూళ్లతో పాటు ప్రేక్షకుల ప్రశంసలు లభిస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని శివ కార్తికేయన్ అన్నారు. ఆయన హీరోగా సాయిపల్లవి హీరోయిన్‌గా నటించిన 'అమరన్' చిత్రం ఇటీవలే విడుదలై ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో సాయిపల్లవి మాట్లాడుతూ "అమరన్' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ప్రేమను మరోసారి పొందాను. నా గత చిత్రాల్లోని భానుమతి, వెన్నెల పాత్రల తరహాలో ఈ సినిమాలోని ఇందు పాత్రకు కూడా గొప్ప స్పందన రావడం ఆనందాన్నిచ్చింది. మీ ప్రేమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని చెప్పారు. దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి మాట్లాడుతూ 'మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని మరోసారి 'అమరన్'తో రుజువైంది. సాయిపల్లవి, శివకార్తికేయన్ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది' అని తెలిపారు. "ఈ సినిమాతో శివకార్తికేయన్ మా తెలుగు హీరో, తెలుగు అబ్బాయి అయిపోయారు" అన్నారు హీరో నితిన్. నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ "అమరన్'ను రిలీజ్ చేసే అవకాశం ఇచ్చిన కమల్‌హాసన్, మహేంద్ర గారికి ధన్యవాదాలు. ఇప్పటికే తెలుగునాట రూ. 20 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. జాతీయ పురస్కారాలు ఈ సినిమాను వరిస్తాయి' అన్నారు.



రెండు భాగాలుగా రామాయణ

రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీత, యశ్ రావణుడిగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఈ సినిమాను ప్రకటించిన సంవత్సరం తర్వాత ఎట్టకేలకు బుధవారం నాడు దాని వివరాలను నిర్మాత నమిత్ మల్హోత్రా అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమా రెండు భాగాలుగా చిత్రాన్ని రూపొందిస్తున్నామనీ, తొలి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి విడుదల అవుతాయనీ సోషల్ మీడియా వేదికగా నమిత్ వెల్లడించారు. నితీశ్ తివారి రూపొందిస్తున్న ఈ సినిమాలో టీవీ రాముడు అరుణ్ గోవిల్ దశరథుని పాత్రను, లారా దత్తా కైక పాత్రను పోషిస్తున్నారు. హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ నటిస్తారని అంటున్నారు. రాముడి పాత్ర కోసం రణబీర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మందు తీసుకోవడం మానేసిన రణబీర్ నిష్ఠగా ఉంటున్నాననీ, సంభాషణలలో స్పష్టత కోసం శిక్షణ పొందుతున్నాననీ ఆయన చెప్పారు. ఓ భక్తురాలుగా సీత పాత్రను పోషిస్తున్నట్లు సాయిపల్లవి ఇప్పటికే ప్రకటించారు.




సరదాగా రానా..

ఘాటుగా హరీశ్‌శంకర్!


రానా మంచి నటుడే కాదు మంచి వ్యాఖ్యాత కూడా. తన దైన శైలిలో జోక్స్, పంచెస్ వేస్తూ ఆసక్తికరంగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆయనకు అలవాటు. ఇటీవల అబుదాబిలో జరిగిన ఐఫా అవార్డుల వేడుకకు రానా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయనకు యువ హీరో తేజా సజ్జా తోడయ్యారు. ఇద్దరూ కలసి చాలా సరదాగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోల చిత్రాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' డిలే గురించి, అల్లు అర్జున్ 'పుష్ప 2' కాదు.. 'పుష్ప టూ లేట్' అంటూ రానా, తేజ సరదాగా చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. అలాగే ఈ కార్యక్రమంలోనే రానా మాట్లాడుతూ 'ఈ ఏడాది అమితాబ్ కెరీర్‌లోనే అతి పెద్ద ఎత్తుని, లోతును చూశా' అని అనగానే, ఎత్తు ఏమిటని తేజ ప్రశ్నించారు. 'కల్కి' అని సమాధానం చెప్పారు రానా. మరి లోతు అని తేజా అడగ్గానే ' రీసెంట్‌గా రిలీజ్ అయింది కదా.. అదే 'మిస్టర్..' అని రానా ఏదో చెప్పబోతుంటే 'ఇప్పుడొద్దులే' అని తేజ మాట దాటేశారు. తమ హీరో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమానే ఉద్దేశించే ఇలా అన్నారని హర్ట్ అయిన ఓ అభిమాని రానా మాట్లాడిన వీడియోని జత చేస్తూ ట్వీట్ చేశాడు. దర్శకుడు హరీశ్‌శంకర్‌కి ట్యాగ్ చేశాడు. వెంటనే ఆయన స్పందించి 'ఎన్నో విన్నాను తమ్ముడు.. అందులో ఇదొకటి. అన్ని రోజులూ ఒకేలా ఉండవు. నాకైనా.. ఎవరికైనా' అంటూ రిప్లై ఇచ్చారు.

రామ టాకీస్ ర్యాంప్ సాంగ్



కరుణ కుమార్ దర్శకత్వంలో విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన సినిమా 'మట్కా'. వరుణ్ తేజ్ , మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈనెల 14 గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రామ టాకీస్ ర్యాంప్ సాంగ్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. భవానీ రాకేశ్ అదిరిపోయే బీట్స్‌తో అడిక్టివ్ ఫోక్ నంబర్‌గా ఈ పాటని కంపోజ్ చేశారు. డైరెక్టర్ కరుణ కుమార్ స్వయంగా రాసిన జానపద సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా, ఈ చిత్రానికి జి.వి.ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

నారా రోహిత్ యాక్షన్



విజయ్ కనకమేడల దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ నటిస్తున్న చిత్రం 'భైరవం'. కె.కె.రాధామోహన్ నిర్మాత. రీసెంట్‌గా విడుదలైన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. కాగా, నారా రోహిత్ ఫెరోషియస్ అవతార్‌ని ప్రజెంట్ చేస్తూ ఇంటెన్స్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ బుధవారం రివీల్ చేశారు. అగ్నితో నిండిన టెంపుల్ బ్యాక్‌డ్రాప్‌లో రోహిత్ యాక్షన్ సీన్‌లో కనిపించారు.

ఓ ప్రేమమూర్తి కథ



ప్రేమమూర్తి అయిన ఓ తల్లి తన జీవిత గమనంలో ఎలాంటి భావోద్వేగాలకు గురైంది అన్న ఇతివృత్తంతో రూపొందిన చిత్రం 'తల్లి మనసు'. రుచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటించారు. వి. శ్రీనివాస్ దర్శకుడు. సీనియర్ డైరెక్టర్ ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మిస్తున్న చిత్రమిది. ఈ నెలలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ 'మాకు చాలా సంతృప్తిని ఇచ్చిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరింపచేస్తుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు.





సత్తా చాటితేనే!

● దృష్టంతా రాహుల్‌పైనే
● ఆసీస్-భారత్ ఎ జట్ల టెస్ట్ నేటి నుంచి



మెల్‌బోర్న్: వరుస వైఫల్యాలతో జట్టులో స్థానాన్నే ప్రశ్నార్థకం చేసుకొన్న కేఎల్ రాహుల్‌కు.. మళ్లీ టీమిండియాలో చోటు దక్కించుకొనే సువర్ణావకాశం లభించింది. గురువారం నుంచి జరిగే రెండో అనధికార టెస్ట్‌లో ఆస్ట్రేలియా-ఎతో భారత్-ఎ తలపడనుంది. మరికొద్ది రోజుల్లో సీనియర్ జట్టు ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. కాగా, ఆసీస్‌తో పెర్త్‌లో జరిగే తొలి టెస్ట్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ దూరమవుతాడన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో జైస్వాల్‌కు తగిన జోడీ కోసం.. రాహుల్, అభిమన్యు ఈశ్వరన్‌లపై సెలెక్టర్లు దృష్టి సారించారు. అందులో భాగంగా న్యూజిలాండ్‌తో సిరీస్ మధ్యలోనే జట్టులో చోటు కోల్పోయిన రాహుల్‌తోపాటు రిజర్వు కీపర్ ధ్రువ్ జురెల్‌ను తగిన ప్రాక్టీస్ కోసం ముందుగానే ఆస్ట్రేలియాకు పంపారు. పైగా వచ్చే నెల 26న ఇక్కడే బాక్సింగ్ డే టెస్ట్ జరగనుండడంతో.. ఒకవేళ రాహుల్ సత్తాచాటితే జట్టులో స్థానం నిలబెట్టుకొనే అవకాశం ఉంది. అంతేకాకుండా భారత్-ఎ లైనప్‌లో ఇక్కడి పిచ్‌పై గతంలో ఆడిన అనుభవం ఒక్క రాహుల్‌కే ఉండడం కొంత కలిసివచ్చే అంశం. కంగారూ సీనియర్ పేసర్ స్కాట్ బొలాండ్‌ను అతడు ఎలా ఎదుర్కొంటాడన్న దాన్ని కూడా సెలెక్టర్లు నిశితంగా గమనించనున్నారు. కాగా, ఈశ్వరన్‌తో కలిసి చేసిన ప్రాక్టీస్‌లో రాహుల్ చక్కని టచ్‌లో కనిపించాడు. ఓపెనర్‌గా రాహుల్‌ను దించితే.. రుతురాజ్ మిడిలార్డర్‌లో ఆడాల్సి ఉంటుంది. తొలి మ్యాచ్‌లో ఓటమి నేపథ్యంలో జట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. బాబా ఇంద్రజిత్ స్థానంలో రాహుల్ ఎంట్రీ ఇవ్వనుండగా.. కీపర్‌గా ఇషాన్ కిషన్ స్థానంలో జురెల్ రాక ఖాయమైంది. పేసర్ నవ్‌దీప్ సైనీ ఆకట్టుకోలేకపోవడంతో లెఫ్టామ్ పేసర్ ఖలీల్ అహ్మద్, స్పిన్నర్ మానవ్ సుతార్ స్థానంలో తనుష్ కోటియన్‌కు తుది జట్టులో చోటుదక్కవచ్చు. సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్‌తోపాటు తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ ప్రదర్శనను కూడా సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. పేసర్లు ముకేశ్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ జట్టుకు కీలకం కానున్నారు.

భారత్-ఎ నిరసనపై స్పష్టతనివ్వాలి: వార్నర్

అనధికార తొలి టెస్ట్ నాలుగో, ఆఖరి రోజు ఆట ఆరంభానికి ముందు బంతిని మార్చడం వివాదాస్పదమైంది. బంతిని మార్చడంపై భారత్-ఎ ఆటగాళ్లు నిరసన వ్యక్తం చేశారు. అయితే, బంతిని మార్చినందుకు భారత ప్లేయర్లు అభ్యంతరం చెప్పలేదని.. దెబ్బతిన్న బంతికి బదులుగా ఇచ్చిన బాల్‌పై మాత్రమే వారు వాగ్వాదానికి దిగారని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ రాసింది. ఈ నేపథ్యంలో జరిగిన నాటకీయ పరిణామాలపై క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టత ఇవ్వాలని ఆసీస్ మాజీ ఓపెనర్లు డేవిడ్ వార్నర్, ఎడ్ కోవాన్ డిమాండ్ చేశారు. త్వరలో భారత సీనియర్ జట్టు రానున్న నేపథ్యంలో ఎటువంటి అనుమానాలకు తావులేకుండా ఉండేందుకు వీలైనంత తొందర్లో ఈ వివాదానికి ముగింపు పలకాలని వార్నర్ సూచించాడు. భారత్ కాకుండా మరోజట్టు ఆ స్థానంలో ఉండి ఉంటే.. తమ స్పందన మరో విధంగా ఉండేదని కోవాన్ అన్నాడు. ఊహాగానాలకు తెరదించేందుకు బీసీసీఐ కూడా చొరవ చూపాలని కోరాడు.

శతక్కొట్టిన ప్రియాన్షు

ఉత్తరాఖండ్ 232/1 ● ఆంధ్రతో రంజీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎలీట్ గ్రూప్-బి రంజీలో భాగంగా ఆతిథ్య ఆంధ్ర జట్టుతో మొదలైన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. ఓపెనర్ ప్రియాన్షు ఖండూరి (107 నాటౌట్) అజేయ శతకంతో విజృంభించడంతో తొలి రోజైన బుధవారం ఆట ముగిసేసరికి ఉత్తరాఖండ్ వికెట్ మాత్రమే కోల్పోయి 232 పరుగులు చేసింది. మరో ఓపెనర్ అవ్‌నీశ్ సుధ (86) అర్ధ సెంచరీ సాధించాడు. ఇక రాజస్థాన్ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో మొదటి రోజు ఆట కల్లా హైదరాబాద్ మొదటి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 5 వికెట్లకు 261 పరుగులు చేసింది. కెప్టెన్ రాహుల్ సింగ్ గెహ్లాట్ (66) అర్ధ శతకంతో సత్తా చాటాడు.

రాజభోగాలు వీడండి.. రంజీలు ఆడండి

● విరాట్, రోహిత్‌కు కైఫ్ సూచన

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో పేలవ ప్రదర్శన కనబరచిన సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశవాళీ క్రికెట్ ఆడకపోవడం వల్లే వాళ్లు వరుసగా విఫలమవుతున్నారని కొందరు మాజీలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రోహిత్, విరాట్ లాంటి స్టార్లు రాజభోగాలను వదిలి.. రంజీలు ఆడాలని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సూచించాడు. 'రంజీల్లో రాణిస్తే ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. 2020 టూర్ ముందు పంత్ దేశవాళీ మ్యాచ్ ఆడి జట్టులోకి వచ్చాడు. అతడు ఎంతటి చరిత్రకు కారణమయ్యాడో చూశాం కదా' అని కైఫ్ అన్నాడు.



కోహ్లీ.. పదేళ్లలో తొలిసారి

దుబాయ్: న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఘోరంగా విఫలమైన విరాట్ కోహ్లీ ర్యాంకింగ్స్‌లో మరింత పడిపోయాడు. బుధవారం ప్రకటించిన ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో విరాట్ 8 స్థానాలు కోల్పోయి 22వ స్థానానికి దిగజారాడు. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో కోహ్లీ టాప్-20లో లేకపోవడం గత పదేళ్లలో ఇదే తొలిసారి. ఇక, రెండు స్థానాలు చేజార్చుకున్న రోహిత్ శర్మ 26వ ర్యాంక్‌కు పడిపోయాడు. రిషభ్ పంత్ ఐదు స్థానాలు మెరుగుపరచుకొని 6వ ర్యాంక్‌కు చేరగా.. యశస్వీ జైస్వాల్ ఓ స్థానం కోల్పోయినా 4వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్ బ్యాటర్‌గా ఉన్నాడు. ఇక జో రూట్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. బౌలర్లలో అశ్విన్ ఓ స్థానం చేజారి 5వ ర్యాంక్‌లో, బుమ్రా 3వ స్థానంలో ఉన్నారు. ఆల్‌రౌండర్లలో జడేజా నెంబర్‌వన్ ర్యాంక్‌ను కాపాడుకున్నాడు.

టాప్‌సీడ్‌కు రిత్విక్ జోడీ షాక్

మెట్జ్ (ఫ్రాన్స్): తెలుగు ఆటగాడు రిత్విక్ చౌదరి బొల్లిపల్లి మోసెల్లె ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో డబుల్స్ టైటిల్ సాధించే దిశగా ముందంజ వేశాడు. పోర్చుగల్‌కు చెందిన ఫ్రాన్సిస్కో కాబ్రల్ జతగా రిత్విక్ పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్ చేరాడు. బుధవారం ఇక్కడ జరిగిన క్వార్టర్‌ఫైనల్లో రిత్విక్-ఫ్రాన్సిస్కో ద్వయం 7-6(1), 6-4తో టాప్‌సీడ్ జంట శాంటియాగో (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్)కు షాకిచ్చి సంచలనం సృష్టించింది. హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ ఓ ఏటీపీ టూర్ ఈవెంట్‌లో సెమీఫైనల్ చేరడం ఇదే తొలిసారి.

కిరణ్ జార్జ్ శుభారంభం

కొరియా మాస్టర్స్

ఇక్సాన్ సిటీ (కొరియా): భారత యువ షట్లర్ కిరణ్ జార్జ్ కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్లో 24 ఏళ్ల కిరణ్ 15-21, 21-12, 21-15తో వియత్నాంకు చెందిన కువాన్ లిన్ కుయోపై విజయం సాధించాడు.


సెమీస్‌కు గాఫ్

● డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో స్వియటెక్‌కు షాక్
● సీజన్‌ను నెం.1తో ముగించనున్న సబలెంక



రియాద్: ప్రతిష్ఠాత్మక సీజన్ ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో అమెరికా స్టార్ కోకో గాఫ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో గాఫ్ 6-3, 6-4తో ఇగా స్వియటెక్ (పోలెండ్)ను చిత్తుచేసింది. దీంతో రెండో విజయంతో కోకో సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. అయితే, ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్‌గా ఉన్న సబలెంక.. స్వియటెక్ ఓటమితో ఈ సీజన్‌ను టాప్‌ర్యాంక్‌తో ముగించనుంది. స్వియటెక్ రెండో ర్యాంక్‌లోనే కొనసాగనుంది.

లెవాన్‌ను నిలువరించిన అర్జున్



చెన్నై: తెలుగు జీఎంలు ఇరిగేసి అర్జున్, ద్రోణవల్లి హారికకు చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ రెండోరోజు పోటీల్లో విభిన్న ఫలితాలు ఎదురయ్యాయి. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో లెవాన్ అరోనియన్ (అమెరికా)తో తలపడిన అర్జున్ డ్రా చేసుకున్నాడు. ఇక, చెన్నై చాలెంజర్స్ ఓపెన్ టోర్నీలో ఆడుతున్న హారిక రెండో రౌండ్‌లో ల్యాక్ మెండోంకా (భారత్) చేతిలో ఓటమి పాలైంది.

గ్రాండ్ ప్రీ చెస్‌లో హంపి డ్రాతో సరి

షైంకెంట్ (కజకిస్థాన్): ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ రెండో అంచె పోటీల్లో కోనేరు హంపి తప్పక గెలవాల్సిన మ్యాచ్‌ను డ్రాతో సరిపెట్టుకుంది. ఈ ఫలితంతో హంపి టైటిల్ అవకాశాలు సన్నగిల్లాయి. బుధవారం ముగిసిన ఏడో రౌండ్‌లో ఎలిజబెత్ పేహ్జ్‌తో తలపడిన హంపి 14 ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించింది. దీంతో ఏడు రౌండ్లు ముగిసేసరికి హంపి 3.5 పాయింట్లతో ఆరోస్థానానికి పరిమితమైంది. కజకిస్థాన్ జీఎం బిబిసారాతో తలపడిన మరో భారత జీఎం దివ్యా దేశ్‌ముఖ్ 41 ఎత్తుల తర్వాత తన గేమ్‌ను డ్రాగా ముగించింది.

ఆఖర్లో టైటాన్స్ పట్టేసింది

పాయింట్ తేడాతో తలైవాస్‌పై గెలుపు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్‌లో బుధవారం తమిళ్ తలైవాస్‌తో అత్యంత ఉత్కంఠగా జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ పాయింట్ తేడాతో విజేతగా నిలిచింది. ఆఖర్లో తలైవాస్ ఆటగాళ్లపై పట్టు సాధించిన టైటాన్స్ 35-34తో గెలిచింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ 12 పాయింట్లతో చెలరేగగా.. అతడికి ఆశిష్ నర్వాల్ (9 పాయింట్లు) సహకారం అందించాడు. మరో మ్యాచ్‌లో యు ముంబా 42-40తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది.

వేలానికి స్టోక్స్ దూరం

● రూ. 2 కోట్ల జాబితాలో పంత్, అయ్యర్, షమి


స్టోక్స్


పంత్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఐపీఎల్‌కు దూరం కానున్నాడు. ఐపీఎల్ మెగా వేలం కోసం రిజిస్టర్ చేసుకొన్న 1574 మంది ఆటగాళ్ల జాబితాలో స్టోక్స్ పేరు లేదు. అయితే, ఆశ్చర్యకరంగా అతడి మాజీ సహచరుడు, వెటరన్ పేసర్ జిమ్మీ అండర్సన్ వేలానికి రావడం విశేషం. మెగా వేలం ఈ నెల 24, 25 తేదీల్లో సౌదీ అరేబియాలోని జెడ్డాలో జరగనుంది. ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకొనే ఆటగాళ్లను ఖరారు చేయడంతో.. కుదించిన జాబితాను బీసీసీఐ విడుదల చేసింది. ప్రతి ఫ్రాంచైజీ 25 మంది సభ్యుల జట్టును తయారు చేసుకోనుంది. ఇందులో భాగంగా 10 జట్లు 46 మందిని రిటైన్ చేసుకోగా.. 204 మందిని వేలంలో కొనుగోలు చేయనున్నాయి. గాయాలు, పని భారం కారణంగా స్టోక్స్ గతేడాది లీగ్‌కు దూరమయ్యాడు.

రూ. 2 కోట్లలో మనోళ్లు..: భారత ఆటగాళ్లు రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, రాహుల్, అశ్విన్, చాహల్ రూ. 2 కోట్ల కనీస ధర జాబితాలో పేర్లను నమోదు చేసుకొన్నారు. షమి, అర్ష్‌దీప్‌తోపాటు సిరాజ్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, వెంకటేశ్ అయ్యర్, అవేశ్ ఖాన్, దీపక్ చాహర్, ఇషాన్ కిషన్, భువనేశ్వర్‌లు కూడా ఈ జాబితాలో రిజిస్టర్ చేసుకొన్నారు. కాగా సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షా తమ పేర్లను రూ. 75 లక్షల కనీస ధర జాబితాలో నమోదు చేసుకొన్నారు.

అండర్సన్ తొలిసారి..: అండర్సన్ తొలిసారి ఐపీఎల్ వేలంలో రిజిస్టర్ చేసుకోవడం విశేషం. 42 ఏళ్ల జిమ్మీ ఈ ఏడాది టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఒక్క ఫ్రాంచైజీ లీగ్ కూడా ఆడని అండర్సన్ రూ. 1.25 కోట్ల కనీస ధరకు తన పేరును నమోదు చేసుకొన్నాడు. టీ20 వరల్డ్‌కప్‌లో అందరి దృష్టినీ ఆకర్షించిన అమెరికా పేసర్ సౌరభ్ నేత్రావల్కర్, ఇటలీ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ థామస్ డ్రాకా రూ. 30 లక్షల కనీస ధర జాబితాలో రిజిస్టర్ చేసుకొన్నారు. గతేడాది అమ్ముడుపోని ఆస్ట్రేలియా స్పిన్నర్ లియాన్‌తోపాటు రూ. 24.5 కోట్లు పలికిన పేసర్ మిచెల్ స్టార్క్, ఇంగ్లండ్ పేసర్ ఆర్చర్ కూడా రూ. 2 కోట్ల జాబితాలో వేలానికి రానున్నారు.

ట్రంపంప రంపంపం!

మార్కెట్‌కు ట్రంప్ జోష్.. సెన్సెక్స్ 901 పాయింట్లు అప్

24,500 స్థాయికి చేరువైన నిఫ్టీ.. ఐటీ, ఫార్మా రంగ షేర్లు జిగేల్

2 రోజుల్లో రూ.10.47 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం.. స్టాక్‌మార్కెట్ వర్గాల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఐటీ, ఫార్మా షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు జరపడంతో సెన్సెక్స్ మళ్లీ 80,000 మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,500 స్థాయికి చేరువైంది. సెన్సెక్స్ ఒకదశలో 1,093 పాయింట్ల వరకు పుంజుకున్నప్పటికీ, చివరికి 901.50 పాయింట్ల లాభంతో 80,378.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 270.75 పాయింట్ల వృద్ధితో 24,484.05 వద్ద ముగిసింది. సూచీలు లాభపడటం వరుసగా ఇది రెండో రోజు. ఈ రెండ్రోజుల్లో ఈక్విటీ మదుపరుల సంపద రూ.10.47 లక్షల కోట్లు పెరిగి రూ.452.58 లక్షల కోట్లకు (5.37 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

● సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 రాణించాయి. టీసీఎస్ 4.21 శాతం, ఇన్ఫోసిస్ 4.02 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 3.71 శాతం, టెక్ మహీంద్రా 3.68 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. రిలయన్స్ షేరు 50 శాతం ఎగబాకింది.

● బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.28 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.96 శాతం పుంజుకున్నాయి. రంగాలవారీ సూచీలన్నీ పాజిటివ్‌గా ముగిశాయి. బీఎస్ఈ ఐటీ 4.04 శాతం, టెక్ 3.37 శాతం ఎగబాకాయి.

సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓకు సెబీ ఆమోదం

హైదరాబాద్‌కు చెందిన సాయి లైఫ్ సైన్సెస్‌తోపాటు మరో మూడు కంపెనీల ఐపీఓలకు సెబీ ఆమోదం తెలిపింది. ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ కంపెనీ రూబికాన్ రీసెర్చ్, యార్న్ తయారీదారు సనాతన్ టెక్స్‌టైల్స్, వాహన పరికరాల తయారీదారు మెటల్‌మ్యాన్ ఆటో ఈ జాబితాలో ఉన్నాయి. సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓలో భాగంగా రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ప్రమోటర్, ఇతర ఇన్వెస్టర్లకు చెందిన 6.15 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.600 కోట్లు రుణ బకాయిలు తీర్చేందుకు, కొంత సొమ్మును వ్యాపార అవసరాలకు ఉపయోగించుకోనున్నట్లు సాయి లైఫ్ సైన్సెస్ వెల్లడించింది.

అమెరికా మార్కెట్ జూమ్

బుధవారం అమెరికన్ స్టాక్ మార్కెట్ సూచీలు కూడా భారీ లాభాలతో సరికొత్త రికార్డు గరిష్ఠాలకు ఎగబాకాయి. డోజోన్స్ ఏకంగా 1,300 పాయింట్లు పుంజుకోగా.. ఎస్ అండ్ పీ 1.85 శాతం, నాస్‌డాక్ 2.11 శాతం పెరిగాయి. ట్రంప్‌కు బలమైన మద్దతుదారైన ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా కంపెనీ షేరు ఒకదశలో 14 శాతం ఎగబాకింది. అలాగే, టెక్నాలజీ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. డాలర్ కూడా బలం పుంజుకుంది. పదేళ్ల బాండ్ రేటు సైతం 4.46 శాతానికి ఎగబాకింది. ఈక్విటీల జోరులో బులియన్ జోష్ కోల్పోయింది. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 70 డాలర్ల మేర తగ్గి 2,680 డాలర్లకు పడిపోయింది. వెండి 31.40 డాలర్లకు దిగివచ్చింది.

బిట్‌కాయిన్ @ 75,000 డాలర్లు

ట్రంప్ విక్టరీ క్రిప్టో మార్కెట్లో జోష్ పెంచింది. బిట్‌కాయిన్ విలువ ఒకదశలో 8 శాతం మేర పెరిగి 75,384 డాలర్ల స్థాయిలో సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. మిగతా వర్చువల్ కరెన్సీలైన ఈథర్, ఎక్స్‌ఆర్‌పీ, లైట్‌కాయిన్, డోజ్‌కాయిన్, షీబాఇను కాయిన్ సైతం 4-9 శాతం మేర పుంజుకున్నాయి. గతంలో ట్రంప్ క్రిప్టో కరెన్సీలపై అయిష్టంగానే ఉన్నప్పటికీ, ఎన్నికల ముందు అనూహ్యంగా తన మనసు మార్చుకున్నారు. అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. అంతేకాదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు. ట్రంప్ సానుకూల వైఖరితో ఈ వర్చువల్ కరెన్సీల విలువ మున్ముందు మరింత పెరగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. బిట్‌కాయిన్ విలువ 1,00,000 డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి.

అత్యంత విలువైన కంపెనీగా ఎన్‌విడియా

ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా కంపెనీ యాపిల్‌ను అధిగమించి ప్రపంచంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరించింది. మంగళవారం ట్రేడింగ్ నిలిచేసరికి ఎన్‌విడియా షేరు 2.9% పెరిగి 139.93 డాలర్లకు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3.43 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. కాగా, యాపిల్ మార్కెట్ క్యాప్ 3.38 కోట్ల డాలర్లకు పరిమితమైంది. బుధవారం ట్రేడింగ్‌లోనూ ఎన్‌విడియా షేరు ఒకదశలో 2.82% లాభంలో 143.86డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అప్పటికి మార్కెట్ క్యాప్ 3.53 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది.



సరికొత్త కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 22 పైసలు క్షీణించి 84.31 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించడం డాలర్‌కు భారీగా బలాన్ని చేకూర్చింది. దాంతో ఫారెక్స్ మార్కెట్లో డాలర్ విలువ గణనీయంగా పెరిగింది. యూఎస్ కరెన్సీతోపాటు ఆ దేశ బాండ్ల రిటర్నుల రేట్లు కూడా పుంజుకున్న నేపథ్యంలో మన మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరించుకోవడం కూడా రూపాయి విలువకు గండికొట్టిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. స్వల్పకాలంపాటు రూపాయికి ప్రతికూలతలు తప్పకపోవచ్చని, డాలర్‌తో ఎక్స్ఛేంజ్ రేటు 84.10-84.40 స్థాయిలో ట్రేడయ్యే అవకాశాలున్నాయని వారు భావిస్తున్నారు.

బిజినెస్

భారత్‌పై సుంకాల కత్తి

హెచ్-1బీ వీసాలకూ చెక్.. ఐటీ రంగం బిత్తర చూపులు

న్యూఢిల్లీ: నాకు అన్నింటి కన్నా అమెరికా ప్రయోజనాలే ముఖ్యం' (అమెరికా ఫస్ట్) అని ఎన్నికలకు ముందే ట్రంప్ కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. ఇందుకోసం 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' పేరుతో ఓటర్లను ఆకర్షించి మరోసారి శ్వేతసౌధాధిపతి కాబోతున్నారు. దీంతో ట్రంప్ ద్వితీయ పట్టాభిషేకం ప్రభావం భారత ఎగుమతులు, ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉండబోతోందో పరిశీలిద్దాం.

సుంకాల ముప్పు

ప్రస్తుతం అమెరికా మన దేశానికి అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. గత ఏడాది రెండు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం వస్తు, సేవలతో కలిపి 19,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.16.01 లక్షల కోట్లు) చేరింది. ఇందులో మన దేశానికే మిగులు ఉంది. ప్రధాని మోదీతో ఎంత దోస్తానా ఉన్నా 'తమ్ముడు తమ్ముడే, పేకాట పేకాటే' అనేలా భారత్ నుంచి వచ్చే దిగుమతులపైనా సుంకాల (టారిఫ్) పెంపు తప్పదని ట్రంప్ ఇప్పటికే తేల్చేశారు. దీంతో మన దేశానికి చెందిన టెక్స్‌టైల్, ఆటోమొబైల్, ఫార్మా కంపెనీలు బిక్కు బిక్కు మంటున్నాయి.

'ఐటీ'కీ కష్టాలే!

మన ఐటీ కంపెనీల ఆదాయాల్లో 80 శాతానికి ఇప్పటికీ అమెరికానే దిక్కు. మన ఐటీ కంపెనీలు హెచ్-1బీ వీసాలపై అనేక మంది భారత ఐటీ నిపుణులను అమెరికా పంపించి, అక్కడి ప్రాజెక్టులు పూర్తి చేస్తుంటాయి. స్థానిక అమెరికన్లతో పోలిస్తే వీరికి చెల్లించే జీతాలు తక్కువ. ఈ వీసాలతో స్థానిక అమెరికన్లకు పెద్దగా ఉద్యోగాలు దొరకడం లేదని ఎప్పటి నుంచో విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ వీసాల జారీని కట్టుదిట్టం చేయడంతో పాటు, జీతాల వ్యత్యాసాన్నీ రూపుమాపుతానని ట్రంప్ ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించారు. ఇదే జరిగితే భారత ఐటీ నిపుణులకు అమెరికా ఒక కలగానే మిగిలి పోతుంది. అధిక జీతాల భారంతో భారత ఐటీ కంపెనీల ఖర్చులు పెరిగిపోయి వాటి ఆదాయాలు, లాభాలకూ గండి పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే ఐటీ రంగంలో మరిన్ని కొలువుల కోతలు తప్పక పోవచ్చు.

అవకాశాలూ ఉన్నాయ్

అమెరికా ఫస్ట్ అని ట్రంప్ ఎంతగా అరిచి గీపెట్టినా, వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తిగా కలిసి రాకపోవచ్చు. భారత్‌కు మరంత దగ్గర కావడం ద్వారా చైనాకు సైనికంగానేగాక, ఆర్థికంగానూ చెక్ పెట్టాలనేది అమెరికా వ్యూహం. చైనా అంటేనే పగబట్టిన తాచులా లేచే ట్రంప్, ఈ వ్యూహానికి మరింత పదును పెడతారని భావించవచ్చు. దీంతో అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే అనేక అమెరికా కంపెనీలు తమ చైనా+ వ్యూహంలో భాగంగా భారత్, వియత్నాం, థాయ్‌లాండ్, ఇండోనేషియా వైపు చూస్తున్నాయి. యాపిల్ కంపెనీ ఇప్పటికే తన అన్ని మోడళ్ల ఐ ఫోన్లను భారత్‌లో అసెంబ్లింగ్ చేయించుకుంటోంది. ఇక అమెరికా ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్, చైనాకు గుడ్‌బై చెప్పి భారత్‌లో తన వ్యాపారాన్ని పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు మన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. దీంతో ట్రంప్ భారత దిగుమతులపై సుంకాల పెంపు విషయంలో ఎన్నికల ప్రచారంలో చెప్పినంత కఠినంగా ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

ప్రతీకార చర్యలు

ఒకవేళ ట్రంప్ ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టు భారత దిగుమతులపైనా సుంకాల పెంపుకు సిద్ధమైతే, ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు పెంచడం భారత్‌కూ తప్పదు. అమెరికాలో ఔషధాల ధరలు తక్కువగా ఉండడానికి ప్రధాన కారణం మన ఫార్మా కంపెనీలే. ట్రంప్ ఎన్ని ప్రోత్సాహకాలు, రాయితీలు ఇచ్చినా అమెరికా ఫార్మా కంపెనీలు, మన కంపెనీలంత చౌకగా జెనరిక్ ఔషధాలు అందించలేవు. 'అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, మన దేశం అందించినంత సమర్థవంతంగా మరే దేశం అమెరికా కంపెనీలకు ఐటీ సేవలు అందించలేదు' అని నాస్కామ్ కొత్త చైర్‌పర్సన్ సింధు గంగాధరన్ చెప్పడం విశేషం.

అపోలో హాస్పిటల్స్ లాభం రూ.379 కోట్లు

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ సెప్టెంబరు త్రైమాసికానికి అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.5,589 కోట్ల ఆదాయంపై రూ.816 కోట్ల స్థూల లాభం, రూ.379 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 15 శాతం, స్థూల లాభం 30 శాతం, నికర లాభం 63 శాతం పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలను పరిగణనలోకి తీసుకున్నా రూ.10,675 కోట్ల ఆదాయంపై రూ.1,491 కోట్ల స్థూల లాభం, రూ.684 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 15 శాతం, స్థూల లాభం 31 శాతం, నికర లాభం 71 శాతం పెరిగాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,350 ▲	73,650 ▲	1,05,000 ▲
ముంబై	78,140 ▼	71,570 ▼	92,900 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ

హైదరాబాద్	550	విజయవాడ	565
వరంగల్	552	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	128	విజయవాడ	125
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	120
కర్నూలు	128	నెల్లూరు	120
విశాఖపట్నం	111	అనంతపురం	120
గోదావరి	125		

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 7 నవంబరు 2024

ఇంట్లోనే మొక్కలు పెంచేద్దాం

ఇంటి చుట్టూ అందమైన మొక్కలు పెంచితే చూడడానికి బాగుంటుంది. పెద్దగా ఖాళీ స్థలం లేకపోయినా చిన్న కుండీలు ఏర్పాటు చేసుకుని వాటిలో రకరకాల మొక్కలు పెంచుకోవచ్చు. ఎక్కువ శ్రమ పడకుండా కుండీల్లో త్వరగా పెరిగే మొక్కల గురించి తెలుసుకుందాం!

- రంగు రంగుల పూలను చూస్తే మనసు అహ్లాదకరంగా ఉంటుంది. గులాబీ, మల్లె, కనకాంబరాలు, బంతి, చేమంతి వంటి పూల మొక్కలతోపాటు టమాటా, పచ్చిమిర్చి, కొత్తిమీర, కరివేపాకులను కూడా కుండీల్లో పెంచవచ్చు. వీటిని పెంచే కుండీల్లో ఎర్రటి మట్టి నింపాలి. తగినంత



నీటిని అందిస్తూ వాడేసిన టీ పొడి. గుడ్డు పెంకులు, ఉల్లి పొట్టు కూడా వేస్తుంటే అవి ఎరువులా పనిచేసి మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.

- కాకర కాయ, బెండకాయ, వంకాయ, బీన్స్ విత్తనాలు బజారులో దొరుకుతాయి. వీటిని తెచ్చి కుండీల్లో చల్లి కొద్దిగా నీళ్ల చల్లుతూ ఎండ తగిలేలా ఉంచితే మొక్కలు బాగా పెరుగుతాయి.
- మనం రోజూ వాడుకునే కూరగాయల తొక్కలను, ఎండిన పూలను కుండీల్లో వేస్తే మట్టిలో ఎక్కువ సేపు తేమ నిలిచి ఉంటుంది. వాటి ద్వారా మొక్కకు పోషకాలు కూడా అందుతాయి.
- మందారం చెట్టు కొమ్మను తీసుకొచ్చి కొద్దిగా కట్‌చేసి కుండీలో నాటాలి. కొద్దిగా నీరు పిచికారీ చేసి ఎండ తగిలేలా ఉంచితే కొమ్మ నాటుకుంటుంది. నెల రోజుల్లో మొక్క పెరుగుతుంది. దీనికి తెల్ల పురుగు చేరకుండా పసుపు నీళ్ల లేదంటే వేపనూనె కలిపిన నీళ్ల మొక్కమీద చల్లుతూ ఉండాలి.

ఇదీ సంగతి

అమెరికాలో ఇలా..!

మీరు రాత్రి ఎన్ని గంటలకు భోజనం చేస్తారు?
బాగా పొద్దు పోయాక.. అంతేగా!
టీ ఎంత తాగుతారు?
ఓ కప్పు.. లేదా అర కప్పు.. అవునా!
మరి అమెరికన్లు..?

మనతో పోలిస్తే చాలా విషయాల్లో వాళ్ల అలవాట్లు, అభిరుచులు పూర్తి భిన్నంగా ఉంటాయట. అలాంటి కొన్ని ఆసక్తికర అంశాలను సరదాగా నెటిజనులతో పంచుకుంది అమెరికా మహిళ... క్రిస్టెన్ ఫిషర్.





మూడేళ్లుగా భారత్‌లో ఉంటున్న ఆమె... ఇక్కడివారితో తమ దేశవాసుల జీవన శైలిని పోలుస్తూ ఓ రీల్ చేసింది. అందులో తనే ఏకపాత్రాభినయం చేసి, దాన్ని ఇన్‌స్టాలో పెట్టింది. అక్కడి నుంచి వివిధ సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ ఫిషర్ గమనించిన ఆ తేడాలేంటి? ఆమె మాటల్లోనే...

- మా అమెరికన్లకు వంటలో తాలింపు (సీజనింగ్) అంటే సాధారణంగా ఉప్పు, మిరియాలపొడి... అంతే. అదే భారత్‌లో అయితే పసుపు, ధనియాల పొడి, ఎండు మామిడి పొడి, జీలకర్ర, ఆవాలు, గరంమసాలా... ఇలా రకరకాల మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలు ఉంటాయి.
- అమెరికన్లు సాయంత్రం ఐదు లేదా ఆరు గంటలకల్లా రాత్రి భోజనం ముగించేస్తారు. కానీ ఎక్కువమంది భారతీయులు ఆలస్యంగా, అంటే రాత్రి తొమ్మిది లేదా పది గంటలకు తింటారు.
- అమెరికాలో కాఫీ కప్పులు చాలా పెద్దవి... మగ్గుల్లా ఉంటాయి. వెంట పెట్టుకుని తరచూ తాగుతుంటారు. భారత్‌లో టీ కప్పులు చిన్నవి. చాయ్‌ని నిదానంగా సిప్ చేస్తూ ఆస్వాదిస్తారు. అదికూడా స్నేహితులతోనో, సన్నిహితులతోనో కలిసి..!
- అమెరికన్లు శాండ్‌విచ్ లాంటివి మినహా మిగిలిన ఆహార పదార్థాలు చాకుతోనో, ఫోర్క్‌తోనో తింటారు. కానీ భారత్‌లో చేత్తో తినడం సర్వసాధారణం.
- అక్కడ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తారు. ఇక్కడ గడియారంతో పరిగెత్తే కంటే... మనుషులు, మానవ సంబంధాలకు ఎక్కువ విలువ ఇస్తారు.
- 2017లో మొదటిసారి భారత్‌లో పర్యటించిన ఫిషర్... ఇక్కడి మట్టి, మనుషులతో ప్రేమలో పడ్డారు. తరువాత రాజధాని ఢిల్లీలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.

విన్నర్



నాన్న కలను తనదిగా చేసుకుంది. అందుకు కష్టాన్ని పెట్టుబడిగా పెట్టింది. సవాళ్లను స్వీకరించి... రోజుకు మూడు గంటలు బస్సులో ప్రయాణించి... టెన్నిస్ సాధన చేసింది. ఆర్థిక పరిస్థితులు అవరోధంగా మారినా... పట్టుదలతో నేడు భారత నంబర్ వన్ క్రీడాకారిణిగా ఎదిగింది. సానియా మీర్జా తరువాత ఈ ఘనత సాధించిన తెలుగు రాష్ట్రాల క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన 24 ఏళ్ల యామలపల్లి సహజ విజయ ప్రస్థానం 'నవ్య'కు ప్రత్యేకం.

సహజ.. నంబర్ వన్

"అమ్మాయిలు కూడా అబ్బాయిల్లానే స్వశక్తితో ఎదిగి, నచ్చిన రంగంలో రాణించాలనేది మా నాన్న భవానీ కుమార్ ఆకాంక్ష. నాన్న ఆశయాలకు అనుగుణంగా ఎదిగి, ఆయనకు మంచి పేరు తేవాలని చిన్నప్పుడే అనుకున్నాను. కానీ నాకేమో కొత్తవారితో మాట్లాడాలన్నా, నలుగురిలోకి వెళ్లాలన్నా బిడియంగా ఉండేది. నాన్న నా నుంచి అవన్నీ దూరం చేసి, నాలో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపారు. ఆయన కష్టం, ప్రోత్సాహమే నన్ను టెన్నిస్‌లో భారత నంబర్ వన్ క్రీడీకారిణిగా తీర్చిదిద్దాయి. నా తొలి కోచ్ నాన్నే. ప్రత్యర్థి, పోటీదారుడు, విమర్శకుడు, దిక్సూచి కూడా ఆయనే. నా ఎదుగుదల కోసం నాన్న చేసిన త్యాగాలు ఎన్నో. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన ఆయన... సరైన ఉద్యోగం దొరక్క తొలినాళ్లలో బస్సు కండక్టర్‌గా చేసేవారు. ఆ పని చేస్తూనే ఎంటెక్, ఎంసీఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరేందుకు హైదరాబాద్‌కు వచ్చారు. అప్పట్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఇప్పుడున్నంత జీతాలు లేవు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఒక చిన్న ఇంట్లో అద్దెకు ఉండేవాళ్లం. మా స్వస్థలం ఖమ్మం. నేను స్కూల్లో సరదాగా ఆటలు ఆడేదాన్ని. నాలోని ప్రతిభ గమనించిన మా నాన్న నన్ను మంచి క్రీడాకారిణిగా తయారు చేయాలనుకున్నారు.

పాత రాకెట్‌తో మొదలై...

ఒక రోజు మా నాన్న నన్ను సరూర్‌నగర్ స్టేడియంకు తీసుకెళ్లారు. లోపలికి వెళ్లగానే టెన్నిస్ కోర్టు కనిపించింది. టెన్నిస్ రాకెట్, బంతులు నన్ను ఆకర్షించాయి. ఆట నేర్చుకోవాలనుకున్నా. నాన్నకు చెప్పాను. కొత్త టెన్నిస్ రాకెట్ కొనడానికి ఆయన దగ్గర డబ్బులు లేవు. దాంతో ఐదొందల రూపాయలకు పాత రాకెట్ ఒకటి కొని నాకు ఇచ్చారు. దాంతోనే సాధన మొదలుపెట్టా. అక్కడ టెన్నిస్ కోర్టు ఉంది కానీ కోచ్ లేదు. యూట్యూబ్‌లో వీడియోలు చూసి, నాన్న నేర్చుకొని నాకు నేర్పేవారు. అలా నేర్చుకుని స్థానికంగా జరిగే పోటీల్లో పాల్గొని కొన్ని కప్‌లు కూడా గెలిచా.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ఈ శిక్షణ సరిపోదు. దాంతో సికింద్రాబాద్ 'సిన్నెట్ టెన్నిస్ అకాడమీ'కి వెళ్లాం. కానీ ఫీజు చాలా ఉంది. అంత మేము కట్టలేమని చెబితే, కోచ్‌లు ప్రహ్లాద్ కుమార్ జైన్, రవి చంద్ర... నా ఆట చూసి నాకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు అంగీకరించారు. అలా నా ప్రొఫెషనల్ టెన్నిస్ కెరీర్ ప్రారంభమైంది.

మూడు గంటలు బస్సులోనే...

శిక్షణ కోసం రోజూ మూడు గంటలు బస్సులో ప్రయాణించాల్సి వచ్చేది. ఉదయం ఐదున్నరకు ఇంటి దగ్గర బయలుదేరి నిజాం కాలేజీకి వెళ్లేదాన్ని. అక్కడ భాస్కర్‌రెడ్డి సార్ దగ్గర ఫిట్‌నెస్ శిక్షణ ఇచ్చేవారు. అది అవ్వగానే సికింద్రాబాద్‌లోని అకాడమీకి వచ్చి, మూడు గంటల పాటు టెన్నిస్ సాధన ఉండేది. మళ్లీ బస్సులోనే ఇంటికి వచ్చి, కొంచెం తిని కళాశాలకు వెళ్లేదాన్ని. స్నేహితుల నోట్స్ తీసుకుని ఉదయం జరిగిన పాఠాలు రాసుకొనేదాన్ని. సాయంత్రం బస్సు ఎక్కాక సీట్లు దొరికేవి కాదు. ఒకవేళ సీటు దొరికితే అలసటతో నిద్ర పట్టేసేది. అలా మా స్టాప్ దాటి హయత్‌నగర్ వరకు వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇవన్నీ నాతో కావడం లేదని ఇంట్లో ఏడ్చేశాను. దాంతో నాన్న తన ఉద్యోగం మానేశారు. నా శిక్షణ సమయాలకు అనుగుణంగా ఒక స్కూల్లో టీచర్‌గా చేరారు.

అదే పెద్ద మలుపు...

నా కఠోర సాధన, శ్రమ ఫలితంగా 2015లో రాష్ట్ర, 2016లో జాతీయ జూనియర్ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచా. అదే ఏడాది విజయవాడలో జరిగిన ఏజీటీఏ 50కే టోర్నీ ఓపెన్ కేటగిరీలో 15 ఏళ్ల వయసులోనే టైటిల్ కైవసం చేసుకున్నా. ఇక అక్కడ నుంచి వయసుతో సంబంధం లేకుండా జూనియర్ కాకుండా సీనియర్ విభాగంలోనే ఎక్కువగా ఆడడం ప్రారంభించా. మరోవైపు ఇంటర్మీడియేట్ పూర్తయింది. జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతున్నా. ఇక్కడ నుంచి మరో మెట్టు ఎక్కాలంటే ఏం చేయాలనే ఆలోచన మొదలైంది. అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలు ఉచిత విద్యతో పాటు టెన్నిస్‌లో మంచి శిక్షణ కూడా ఇస్తాయని తెలిసింది. టెక్సాస్‌లోని శామ్ హౌస్టన్ యూనివర్సిటీని సంప్రతించాం. వీసా దరఖాస్తుకు కావల్సినంత డబ్బు మా దగ్గర లేదు. నాన్న స్నేహితులు సుబ్రహ్మణ్యం, నీరజ్ కేడియా, మా బంధువులు కొందరు సాయం చేశారు. అందులో సీటు లభించాలంటే అంతర్జాతీయ పోటీలు ఆడిన అనుభవం ఉండాలి. దాని కోసం అదే నెలలో రెండు టోర్నీల్లో ఆడా. ఒక టోర్నీలో క్వార్టర్స్ వరకు వెళ్లా. రెండుసార్లు తిరస్కరణ తరువాత వీసా లభించింది. అప్పటివరకు ఇంట్లోవాళ్లను వదిలి ఎక్కడికీ వెళ్లలేదు. అలాంటిది వేరే దేశం వెళ్లాలంటే ధైర్యం చాల్లేదు. మా అమ్మ సుప్రియ నన్ను ప్రోత్సహించింది. కోచ్ ప్రహ్లాద్ సార్ కిట్ కొనిచ్చారు. అలా తొలిసారి విమానం ఎక్కాను.

అదే లోకం...

అమెరికా వెళ్లాక టెన్నిస్ తప్ప మరో ధ్యాస లేదు. అందరూ మూడు నాలుగు గంటలు సాధన చేస్తే, నేను ఐదారు గంటలు కష్టపడ్డా. నా పట్టుదల చూసి అక్కడున్న కోచ్‌లు నా గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. శిక్షణలో భాగంగా విదేశీ క్రీడాకారిణులతో ఆడడంవల్ల నైపుణ్యం పెరిగింది. శామ్ హౌస్టన్ యూనివర్సిటీ తరఫున వివిధ పోటీల్లో పాల్గొని 10కి పైగా ట్రోఫీలు నెగ్గా. వరుసగా రెండేళ్లపాటు ఉత్తమ క్రీడాకారిణి అవార్డు సాధించా. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తిరిగి మన దేశానికి వచ్చా.

ఖర్చు ఏడాదికి కోటి...



అంతర్జాతీయ ర్యాంకింగ్‌ను మెరుగు పర్చుకోవాలన్నా, గ్రాండ్‌స్లామ్ వంటి టోర్నీల్లో పాల్గొనాలన్నా ఏడాదిలో కనీసం 25 టోర్నీల్లో ఆడాలి. ఇందులో నాలుగైదు పెద్ద టోర్నీల్లో గెలవాలి. అప్పుడే ర్యాంకింగ్ మెరుగవుతుంది. ఇందుకోసం ఏడాదికి నా శిక్షణ, విదేశాలకు ప్రయాణ ఖర్చులు, కోచింగ్ సిబ్బందికి కలిపి కోటి రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం టెక్‌వేవ్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ కొంతమేర సాయం చేస్తోంది. మిగిలిన వాటికి నాన్న కష్టపడాల్సి వస్తోంది. నా పరిస్థితిని గమనించి, ప్రభుత్వం చేయూతనందిస్తే మరిన్ని టోర్నీల్లో ఆడే అవకాశం ఉంటుంది. ఏదిఏమైనా ప్రపంచ మేటి క్రీడాకారుల్లో ఒకరిగా ఎదిగి నాన్న కల నెరవేర్చాలన్నది నా ఆశయం."

వారి తరువాత నేనే...

ఇప్పటివరకు నాలుగు ఐటీఎఫ్ టైటిళ్లు సాధించా. అందులో లాస్‌ఏంజెల్స్ ఐటీఎఫ్ టైటిల్‌ను భారత క్రీడాకారిణుల్లో సానియా మీర్జా, కర్మాన్ కౌర్ తర్వాత గెలిచింది నేను మాత్రమే. గత ఏడాది ప్రతిష్ఠాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ (ఫెడ్ కప్)లో పాల్గొన్న భారత జట్టులో కూడా స్థానం సంపాదించా. ఈ ఏడాది భారత నంబర్ వన్ ర్యాంక్‌ను అందుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో 1300కు పైగా ర్యాంక్‌తో మొదలై, కెరీర్ ఉత్తమ 284వ ర్యాంక్‌కు చేరుకున్నా. ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్ వంటి గ్రాండ్‌స్లామ్‌ల్లో ఆడాలంటే నా ర్యాంక్ 240 దిగువకు రావాలి. వచ్చే నెలలో దుబాయ్‌లో ఒక టోర్నీ ఉంది. అందులో గెలిస్తే జనవరిలో జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అర్హత సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం నా దృష్టి అంతా ఆ టోర్నీపైనే.

• ఎస్ఎస్‌బి సంజయ్

ఏడాదికి 9 కోట్ల వేతనం. ఇంత భారీ వేతనాన్ని అందుకునే మహిళగా, సెలెబ్రిటీ మేనేజర్‌గా గుర్తింపు తెచ్చుకుంది పూజ దడ్లానీ. షారూఖ్ వ్యక్తిగత మేనేజర్‌గా 12 ఏళ్లుగా అతని వ్యక్తిగత, సినీ జీవితాలను నిర్వహిస్తూ అతని కుటుంబంలో సభ్యురాలిగా మారిపోయిన దడ్లానీ గురించిన ఆసక్తికరమైన కథనం.

'సెలెబ్రిటీ' మేనేజర్



నవంబరు 2 షారూఖ్ జన్మదినమే కాదు, అతని మేనేజర్ పూజా దడ్లానీ పుట్టిన రోజు కూడా! వీళ్లిద్దరి పుట్టిన రోజులే కాదు, వీళ్లిద్దరి ఆలోచనా విధానాలు కూడా ఒక్కటే! కాబట్టే 12 ఏళ్లుగా ఆమెనే తన మేనేజర్‌గా కొనసాగిస్తూ, కుటుంబ సభ్యురాలిగా ఆదరిస్తూ వచ్చాడు షారూఖ్. షారూఖ్ జీవితంలోకి పూజ ప్రయాణం రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మొదలైంది. దాన్లో మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించి కొద్ది కాలంలోనే పర్సనల్ మేనేజర్ స్థాయికి ఎదగడమే కాకుండా, షారూఖ్ వరుస అపజయాలతో నాలుగేళ్ల సినిమాలకు దూరంగా ఉన్నపుడు కూడా ఆయన వెన్నంటే ఉంది పూజ.



షారూఖ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న పలు సంస్థల యాడ్ షూటింగ్‌లు, వాటి డేట్స్, సినిమాలకు సంబంధించి పారితోషికం, దర్శక నిర్మాతలతో సంప్రతింపులు తదితరాలన్నీ పూజనే నిర్ణయిస్తారు. ప్రజలతో, వ్యాపారులతో సమావేశాలు, విదేశీ ప్రయాణాల్లో షారూఖ్ వెంట పూజ ఉండాల్సిందే! మరి అన్ని వేళలా అతని వెన్నంటి ఉంటూ, అన్ని వ్యవహారాలూ చక్కబెట్టే పూజ షారూఖ్ నుంచి ఎంత వేతనం అందుకుంటోందో తెలిస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. రోజుకు పన్నెండు నుంచి పదహారు గంటలు పనిచేస్తున్నందుకుగాను, పూజ, ఏడాదికి అక్షరాలా తొమ్మిది కోట్ల వేతనం తీసుకుంటోంది. ఇది ఓ కంపెనీ సిఇఒ స్థాయికి సమానం.

షారూఖ్ కుటుంబంతో....

పూజ దడ్లానీకి షారూఖ్ కుటుంబంతో మంచి అనుబంధం ఉంది. తనకంటే పద్దెనిమిదేళ్ల చిన్నదైన పూజని తమ కుంటుంబంలో ఒకరిగానే చూస్తాడు షారూఖ్. షారూఖ్ భార్య గౌరీ ఖాన్, కుమారుడు ఆర్యన్ ఖాన్, కుమార్తె సుహానా ఖాన్ వ్యవహారాలను కూడా ఆమే పర్యవేక్షిస్తూ ఉంటుంది. ఆర్యన్ ఖాన్ డ్రగ్స్ కేసులో అరెస్టయినప్పుడు ఆ కుటుంబానికి అండగా నిలుస్తూనే, కోర్టు వ్యవహారాలు చూసుకోవడంతోపాటు మీడియా అడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వడంలో ఆమె నిర్వహించిన పాత్ర చెప్పుకోతగ్గది. ప్రస్తుతం ఆర్యన్ నిర్వహిస్తున్న దుస్తుల వ్యాపారానికి కూడా ఆమే ప్రధాన సలహాదారుగా ఉంటోంది. షారూఖ్ ఐపిఎల్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్‌తో మ్యాచ్‌లకు హాజరవడం, గ్యాలరీలో కూర్చుని జట్టుని ఉత్సాహపరచడం ఆమెకు చాలా ఇష్టం. ఇటీవల ఆమె బాంద్రాలో షారూఖ్ ఇంటికి సమీపంలో నిర్మించుకున్న ఇంటికి గౌరీఖాన్ ఇంటీరియర్ డిజైన్ చేయడం విశేషం.

పూజ దడ్లానీ పుట్టి పెరిగింది ముంబైలోనే! హెచ్‌ఆర్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనావిక్స్ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పూర్తిచేసిందామె. 2008లో లిస్టా జ్యువెల్స్ డైరెక్టర్, హితేష్ గుర్నానీని వివాహం చేసుకున్న పూజ, ప్రముఖ నటి దియా మిర్జా భర్త వైభవ్ రేఖికి సమీప బంధువు. పూజకు ఒక పాప. ఆ పాప పేరు రేనా. వృత్తి రీత్యా షారూఖ్‌తో ప్రయాణించేటప్పుడు, పూజ తన వెంట రేనాను తీసుకువెళ్తూ ఉంటుంది. షారూఖ్ చిన్న కొడుకు అబ్రామ్‌తో కూడా రేనాకు మంచి అనుబంధం ఉంది. షారూఖ్ కుటుంబంలో అందరికీ రేనా అంటే ప్రత్యేకాభిమానం.

ఖాళీ సమయాల్లో...

వృత్తిపరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ కొంత సమయాన్ని కుటుంబానికి కేటాయిస్తుంది పూజ. సామాజిక మాధ్యమాల్లో కూడా యాక్టివ్‌గానే ఉండే పూజకు, విహారయాత్రలకు వెళ్లడం అక్కడి అందమైన చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం అలవాటు. ఇటీవల షారూఖ్ జన్మదినం సందర్భంగా అతడితో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'మీవంటి వ్యక్తి దొరకడం నా అదృష్టం. నా గురించి నాకంటే మీకే బాగా తెలుసు. నాపై నాకు నమ్మకం పెరిగేలా దిశా నిర్దేశం చేస్తూ, మార్గదర్శకుడిలా వ్యవహరిస్తూ నాకూ నా కుటుంబానికీ ప్రేమాభిమానాలు పంచుతున్నందుకు కృతజ్ఞతలు మిత్రమా! నీకు పుట్టిన రోజు శుభాకాంక్షలు' అని పోస్ట్ చేసింది.

కౌన్సెలింగ్

డాక్టర్! నా వయసు 55. మెనోపాజ్ దశలో ఉన్నాను. ఈ దశకు చేరుకున్న మహిళల్లో మానసిక, శారీరక సమస్యలు సహజమని విన్నాను. నాలో కూడా మునుపటి సత్తువ ఉండడం లేదు. హుషారు, చురుకుదనం తగ్గిపోయాయి. మునుపటిలా చలాకీగా ఉండగలిగే మార్గాల్ని సూచిస్తారా? - ఓ సోదరి, హైదరాబాద్

ముందస్తుగా మేల్కోవాలి

నడి వయసు మెనోపాజ్‌తో వేధించే ఇబ్బందులను అధిగవించాలంటే, వాటి పట్ల అవగాహనతో మెలగుతూ, లక్షణాల నుంచి దృష్టి మరల్చి, ఆహ్లాదం కలిగించే పనుల మీద మనసు పెట్టాలి. ఆఫీసు పనులు, ఇంటి పనులతో ఉద్యోగినులకు కాలక్షేపం అయిపోతూ ఉంటుంది. గృహిణులు వాళ్ల ఖాళీ సమయాల్లో నచ్చిన వ్యాపకాలను ఎంచుకోవాలి. ఏదో ఒక వ్యాపకం, అభిరుచికి సమయాన్ని కేటాయిస్తే, చిన్నపాటి నొప్పులు, డిప్రెషన్, ఆందోళనలను పట్టించుకునే సమయం ఉండదు. అలా ఉండబట్టే ఉద్యోగినులు చురుగ్గా, ఆరోగ్యంగా కనిపిస్తూ ఉంటారు. అలాగే సామాజిక అనుబంధాలు పెంచుకున్నప్పుడు, స్నేహితులు, సన్నిహితులతో అన్ని విషయాలనూ పంచుకునే అవకాశం ఉంటుంది కాబట్టి వాళ్ల నుంచి అందే ఆలంబనతో మనసు కూడా తేలిక పడుతుంది. కబుర్లతో, నవ్వు తెప్పించే మాటలతో మనసు, శరీరం



హుషారుగా మారతాయి. కాబట్టి నడి వయసుకు చేరుకున్న మహిళలు మరీ ముఖ్యంగా మెనోపాజ్ మీద దృష్టి పెట్టకుండా, మునుపటిలా జీవితాన్ని కొనసాగించే పనుల మీద దృష్టి పెట్టాలి.

ముందస్తు పరీక్షలతో...

దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే ఏ లక్షణాన్నీ ఈ వయసులో నిర్లక్ష్యం చేయకూడదు. అవి భౌతికమైనవీ కావచ్చు, మానసికమైనవీ కావచ్చు. ఎలాంటి లక్షణాలూ లేకపోయినా, ఫైబడే వయసులో కొన్ని రుగ్మతలు మొదలయ్యే అవకాశాలుంటాయి కాబట్టి వార్షిక ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటే ప్రారంభంలోనే సమస్యను కనిపెట్టగలుగుతాం.

- పెరిగే వయసుతో ఎముకల సాంద్రత తగ్గి, ఎముకలు తేలికగా విరిగే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి వార్షిక పరీక్షల్లో ఎముకల సాంద్రతను పరీక్షించుకుని, అవసరాన్ని బట్టి క్యాల్షియం, విటమిన్ డిలను పెంచే మందులు వాడుకోవచ్చు.
- పెద్దవాళ్లలో బాత్రూములో జారి పడి తుంటి విరిగే అవకాశాలు లేకుండా అందుకు వీల్లేని ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రత్యేకమైన చెప్పులు వాడుకోవాలి.
- అల్ట్రాసౌండ్ అబ్డామిన్, అల్ట్రాసౌండ్ బ్రెస్ట్, సోనో మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలు తప్పనిసరి. వీటిలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లను ప్రారంభ దశల్లోనే కనిపెట్టవచ్చు.
- 40 ఏళ్ల దాటిన ప్రతి మహిళా ఏడాదికోసారి మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి.
- ముఖ్యంగా నెలకోసారి రొమ్ములను స్వీయ పరీక్ష చేసుకుని, ఏ స్వల్ప మార్పునైనా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.
- మధుమేహం, క్యాన్సర్ లాంటివి వంశపారంపర్యమైనవి కాబట్టి కుటుంబంలో ఈ రుగ్మతలు ఉన్నప్పుడు వాటిని ముందుగానే పసిగట్టే పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.
- అమ్మ, పిన్ని, అత్త ఇలా దగ్గరి సంబంధీకులకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చి ఉంటే, ఆ కుటుంబంలోని మహిళలు తప్పనిసరిగా బ్రాకా జీన్ టెస్ట్ చేయించుకోవాలి.

వ్యాయామం అవసరమే!

50ల ముందున్న శక్తి 50 తర్వాత ఉండకపోవచ్చు. అయితే అదనపు ముందు జాగ్రత్తలు, అవగాహనలతో ఈ అంతరాన్ని తగ్గించుకోవచ్చు. అందుకోసం ఆరోగ్యకరమైన జీవనశైలిని గడపాలి.

- సమతులాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పక వ్యాయామం చేయాలి. ముందు నుంచీ వ్యాయామాలు అలవాటున్న వాళ్లు అదే తీవ్రతను కొనసాగించవచ్చు. కొత్తగా మొదలు పెట్టిన వాళ్లు వ్యాయామంలో భాగంగా నడకను ఎంచుకోవచ్చు.
- శరీరంలోని కండరాలన్నీ స్ట్రెచ్ అవడం కోసం యోగాను ఎంచుకోవచ్చు.
- రోజుకు పది నిమిషాల ధ్యానంతో మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చు.

డాక్టర్ హిమబిందు వీర్ల, కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్, గైనకాలజిస్ట్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హైదరాబాద్.

నీళ్లవల్ల ప్రయోజనాలెన్నో

ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు గరిష్ఠంగా మూడు లీటర్ల నీళ్ల తాగాలని పోషికాహార నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. ఆ ప్రయోజనాలేమిటో చూద్దాం..

- ఉదయాన్నే లేచి నీళ్ల తాగటం వల్ల మొత్తం రోజంతా చురుకుగా ఉండగలుగుతారు. మెదడు పనితీరు మెరుగుపడుతుంది.
- నీళ్ల తాగటం వల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.
- జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేయటానికి నీళ్ల ఎంతో ఉపకరిస్తాయి. శరీరంలో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపటంలో నీళ్ల కీలకమైన పాత్ర పోషిస్తాయి. క్రమం తప్పకుండా ప్రతి రోజూ మూడు లీటర్ల నీళ్ల తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు ఎంతో మెరుగుపడుతుంది.
- శరీరంలోని కణాలకు పోషకాలు, ఆక్సిజన్ వంటివి అందించటంలో నీళ్ల ఉపకరిస్తాయి. తగినన్ని నీళ్ల తాగితే రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది.
- నీళ్ల తక్కువగా తాగితే దాని ప్రభావం మన చర్మంపై పడుతుంది. చర్మం పొడిబారిపోతుంది. నీళ్ల ఎక్కువగా తాగితే చర్మం మెరుస్తూ ఉంటుంది.
- రోజుకు మూడు లీటర్ల నీళ్ల తాగితే ఆకలి తగ్గుతుంది. దీని వల్ల ఏదో ఒక ఆహారం తింటూ ఉండాలనే యావ తగ్గిపోతుంది. దీని వల్ల బరువు తగ్గే అవకాశముంటుంది.




ట్రంప్‌తో సతీశ్ వేమన (ఫైల్)


ట్రంప్ గెలుపుపై సీఎం చంద్రబాబు హర్షం

- భారత్-యూఎస్ సంబంధాలు బలోపేతం
- ట్రంప్, మోదీ నాయకత్వంలో ఇరుదేశాల అభివృద్ధి
- ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్

అమరావతి, రాజంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గెలుపుపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ట్రంప్ గెలుపుతో భారత్-అమెరికాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ట్రంప్ నేతృత్వంలో అమెరికా అభివృద్ధి చెందుతుంద ంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ, ట్రంప్ నాయకత్వంలో ఇరు దేశాల మధ్య బంధాలు బలపడి పరస్పర సహకారంతో అభివృద్ధి చెందుతాయని ఆకాంక్షించారు. కాగా, ట్రంప్‌కు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభినందనలు తెలిపారు. ఈ విజయం అమెరికా-భారత్ సంబంధాల్లో కొత్త శకానికి నాంది అన్నారు.

సతీష్ వేమన హర్షం

ట్రంప్ విజయంపై 'తానా' పూర్వ అధ్యక్షుడు సతీష్ వేమన హర్షం వెలిబుచ్చారు. ట్రంప్ విజయం వెనుక భారతీయ ప్రముఖుల కృషి ఉందని తెలిపారు. ట్రంప్ ఎన్నికతో అమెరికా-భారత్ పరస్పరం సోదర భావంతో కొనసాగుతాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సతీష్ వేమన నేతృత్వంలో పలువురు ఎన్ఆర్ఐలు ట్రంప్ అభ్యర్థిత్వాన్ని బలంగా సమర్థించారు.



భారత్-అమెరికా బంధంపై

ప్రభావమెంత..?

ప్రధాని మోదీతో ట్రంప్‌కు మంచి సాన్నిహిత్యం



వాషింగ్టన్, నవంబరు 6: రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానాన్ని గట్టిగా సమర్థిస్తున్నారు. ఈ క్రమంలో భారత్-అమెరికా మధ్య సంబంధాలను ఆయన ఎలా ముందుకు తీసుకెళ్తారనే అంశం ఇప్పుడు ఆసక్తిగా మారింది. భారత ప్రధాని నరేంద్ర మోదీతో ట్రంప్‌కు మంచి సాన్నిహిత్యమే ఉంది. గతంలో 'హౌడీ మోదీ', 'నమస్తే ట్రంప్' వంటి హైప్రొఫైల్ కార్యక్రమాల్లో ఇరువురు నేతలూ తమ స్నేహాన్ని చాటుకున్నారు. అయితే.. ట్రంప్ మాత్రం భారత వాణిజ్య విధానాలను 'టారిఫ్ కింగ్'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ఆయన రెండో దఫా పాలన భారత్‌కు కొత్త సవాళ్లను, అవకాశాలను తెచ్చిపెడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అవేమిటో చూద్దాం..

అమెరికా ఫస్ట్ విధానంతో సవాలే..

ట్రంప్ అనుసరిస్తున్న 'అమెరికా ఫస్ట్' విధానం భారత్‌కు సవాల్‌గా మారనుంది. ట్రంప్, కమలా హ్యారిస్‌లో ఎవరు గెలిచినా అమెరికా మరింత ఒంటరిగా మారే అవకాశం ఉందని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇది ఇరుదేశాల వాణిజ్యంపై ప్రభావం చూపనుంది. తాను అధికారంలోకి వస్తే.. తమ దేశ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలపై తిరిగి పన్ను విధిస్తానని గతంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన ఆ దిశగా చర్యలు తీసుకుంటే.. భారత ఎగుమతులపై ముఖ్యంగా.. ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్ రంగాలపై అధిక సుంకాలు విధించే అవకాశం ఉంటుంది. అయితే.. చైనాకు చెక్ పెట్టేందుకు ట్రంప్ చేసే ప్రయత్నాలు భారత్‌కు అవకాశంగా మారొచ్చు. అమెరికా వ్యాపారాల్లో చైనాను దూరం పెడితే.. దానికి భారత్ ప్రత్యామ్నాయ కేంద్రంగా మారగలదు.

ఇమిగ్రేషన్‌పై ప్రభావం..



ఇమిగ్రేషన్ విషయంలో ట్రంప్ అనుసరించే కఠిన వైఖరి భారత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. భారత్ నుంచి అనేక వేలమంది ఉద్యోగాల కోసం హెచ్-1బీ వీసాలపై అమెరికాకు వెళ్తుంటారు. ముఖ్యంగా ఐటీ రంగం నుంచి ఎక్కువ మంది వెళ్తుంటా రు. ట్రంప్ గతంలో పదవిలో ఉన్నప్పుడు ఈ వీసాలపై కఠిన వైఖరి అవలంబించారు. రెండో దఫా పాలనలో కూడా ఆ చర్యలు కొనసాగిస్తే.. అవి నైపుణ్యం కలిగిన భారతీయులకు అమెరికా కలను దూరం చేసే అవకాశం ఉంది.

పిల్లలకు ఆటోమ్యాటిక్ పౌరసత్వం రద్దు

ట్రంప్ ప్రాధాన్యతల్లో ఒకటి అమెరికాలో డిపెండెంట్లుగా ఉన్న పిల్లలకు ఆటోమ్యాటిక్ పౌరసత్వాన్ని రద్దు చేయడం. ఎన్నికల ప్రచారంలో కూడా ట్రంప్-వాన్స్ ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. తాము గెలిస్తే తొలిరోజే ఈ ఆర్డినెన్స్‌పై సంతకం చేస్తామని చెప్పారు. ఈ ముసాయిదా ప్రకారం.. అమెరికాలో స్థిరపడిన వారి పిల్లలకు ఆటోమ్యాటిక్ పౌరసత్వం లభించాలంటే.. వారి తల్లిదండ్రుల్లో ఒకరు అమెరికా శాశ్వత నివాసి అయి ఉండాలి.

క్యూలో 10 లక్షలకు పైగా భారతీయులు

ట్రంప్ ప్రతిపాదన ఆమోదం పొందితే ప్రవాస భారతీయులకు భారీ ఎదురుదెబ్బ తగలనుంది. భారతీయ దంపతుల పిల్లలు గ్రీన్‌కార్డుకు అనర్హులుగా మారతారు. 2022 లెక్కల ప్రకారం అమెరికాలో సుమారు 4.8% మంది భారతీయ అమెరికన్లు ఉన్నారు. వారిలో 34% లేదా 16 లక్షల మంది అమెరికాలోనే జన్మించారు. ఇప్పటికే అమెరికాలో హెచ్-1బీ వీసాపై పనిచేస్తున్న చాలామంది దశాబ్దాలుగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. ఒక అధ్యయనం ప్రకారం గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న భారతీయుల సంఖ్య గత ఏడాది మార్చి నాటికే 10 లక్షలు దాటింది.

ఇటీవలి కాలంలో భారత్-అమెరికా సంబంధాల్లో రక్షణ సహకారం కీలకమైన అంశంగా నిలిచింది. జో బైడెన్ హయాంలో ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ ఎక్నాలజీ (ఐసెట్), జెట్ ఇంజన్ తయారీ కోసం జీఈ-హాల్ మధ్య కుదిరిన ఒప్పందాలు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేశాయి. అయితే కొత్త

సైనిక సహకారం.. రక్షణ సంబంధాలు

బహుళపక్ష ఒప్పందాల విషయంలో ట్రంప్ మరింత జాగ్రత్తగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఏదేమైనప్పటికీ.. ఇండో పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న చైనా ప్రభావానికి చెక్ పెట్టాలంటే భారత్, అమెరికా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించవచ్చు. ఇది ఇరు దేశాల మధ్య నిరంతర సైనిక సహకారానికి దారితీయవచ్చు. రెండో దఫా పాలనలోనూ ట్రంప్.. ఆయుధ అమ్మకాలు, సాంకేతికత బదిలీతోపాటు రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు కృషి చేసే అవకాశం ఉంది.

మనోళ్ల హవా

అమెరికా ఎన్నికల్లో ఆరుగురు భారత సంతతి నేతల గెలుపు

న్యూఢిల్లీ, నవంబరు 6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో(ప్రతినిధుల సభ) భారత సంతతి పౌరులు ఘన విజయం దక్కించుకున్నారు. అంచనాలకు అనుగుణంగానే ఓట్ల వేటలో దూసుకుపోయారు. ఈ సారి ఎన్నికల్లో 9 మంది పోటీ చేయగా.. ఆది నుంచి కూడా ఆరుగురు గెలుపుగుర్రం ఎక్కడం ఖాయమని సర్వేలు చాటిచెప్పాయి. ఈ సర్వేల అంచనాలకు అనుగుణంగానే ఆరుగురు భారత సంతతి అభ్యర్థులు విజయం అందుకున్నారు. మరో అభ్యర్థి అమిష్ షా అరిజోనాలో లీడింగ్‌లో ఉండడం గమనార్హం. ఈయన కూడా విజయం సాధిస్తే ఏడుగురు అభ్యర్థులు ప్రతినిధుల సభలో అడుగు పెట్టినట్టు అవుతుంది. ఇక, ఇప్పటి వరకు వచ్చిన ఫలితాన్ని చూస్తే ఆరుగురు అభ్యర్థులు గెలుపు గుర్రం ఎక్కారు. దీంతో ఇప్పటి వరకు ప్రతినిధుల సభలో ఐదుకే పరిమితమైన భారత సంతతి నేతల సంఖ్య ఆరుకు పెరిగింది.


సుహాస్ సుబ్రమణ్యం

సుహాస్ సుబ్రమణ్యం: వర్జీనియా స్టేట్ సెనేటర్‌గా ఉన్న ఈయన తొలిసారి 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ప్రతినిధుల సభకు పోటీ చేశారు. అరంగేట్రంలోనే అద్భుతమైన విజయాన్ని అందుకుని వర్జీనియా నుంచి గెలిచిన తొలి భారత సంతతి నేతగా చరిత్ర సృష్టించారు. సుహాస్ డెమొక్రాటిక్ పార్టీ తరఫున పోటీ చేయగా, రిపబ్లికన్ పార్టీ నుంచి పోటీ చేసిన మైక్ క్లాన్సీ పరాజయం పాలయ్యారు. "వర్జీనియా ప్రజల తీర్పును అత్యంత గౌరవంగా స్వీకరిస్తున్నా. వారికి సేవ చేసేందుకు అహరహం శ్రమిస్తా" అని సుహాస్ పేర్కొన్నారు. వర్జీనియాను తన సొంత ఇల్లుగా ఆయన తెలిపారు. "నా వివాహం ఇక్కడే జరిగింది. ఇక్కడి సమస్యలను నా సొంత కుటుంబ సమస్యలుగా భావించి పరిష్కరిస్తా" అని పేర్కొన్నారు. సుహాస్ గతంలో బరాక్ ఒబామా ప్రభుత్వం వైట్ హౌస్ సలహాదారుగా వ్యవహరించారు.

మరోసారి సభకు: ఇక, తాజా ఎన్నికల్లో విజయం దక్కించుకున్న భారత సంతతి పౌరుల్లో అమి బెరా, రాజా కృష్ణమూర్తి, రో ఖన్నా, ప్రమీలా జయపాల్, శ్రీథానేదార్‌లు మరోసారి ప్రతినిధుల సభలో అడుగు పెడుతున్నారు.

అమిష్ షా: అరిజోనాలో స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. సిట్టింగ్ నేత, రిపబ్లికన్ అభ్యర్థి డేవిడ్‌స్క్వైకెట్‌కు, షాకు మధ్య పోరు హోరా హోరీగా సాగుతోంది. కడపటి వార్తలు అందే సరికి 63 శాతం ఓట్లను లెక్కించగా షాకు 1,32,712 ఓట్లు రాగా, డేవిడ్‌కు 1,28,606 ఓట్లు వచ్చాయి.



డాక్టర్ అమిబెరా: వైద్య వృత్తిలో ఉన్న అమిబెరా భారత సంతతి నేతల్లో సీనియర్ మోస్ట్ నాయకుడు. కాలిఫోర్నియా(6వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి వరుసగా విజయం సాధిస్తున్నారు.



శ్రీథానేదార్: మిచిగాన్(13వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి వరుసగా రెండో సారి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. 2023లో తొలి విజయం అందుకున్నారు.



ప్రమీలా జయపాల్: వాషింగ్టన్(7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి వరుసగా విజయం సాధిస్తున్నారు.



రో ఖన్నా: కాలిఫోర్నియా (17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి 2013 నుంచి వరుసగా విజయం దక్కించుకుంటున్నారు.



రాజా కృష్ణమూర్తి: ఇల్లినోయిస్(7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి వరుసగా 5వ సారి విజయం దక్కించుకున్నారు. ఇక్కడ పోటీ చాలా కఠినంగా సాగడం గమనార్హం. ప్రజలు తనపట్ల చూపిన విశ్వాసానికి ఎంతో ముగ్ధుడిని అయ్యానని ఆయన పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు. ప్రజల కలలను సాకారం చేసేందుకు నిరంతరం కష్టిస్తానన్నారు.

ఆ 45 టీఎంసీలు ఏపీకే ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

వాదిస్తోందని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించిందని.. కానీ ఆంధ్ర ఆ నీటిని కృష్ణా డెల్టాకు వాడుకోవలసి ఉంటుందని వెల్లడించారు. సాగర్‌కు దిగువన వాడినా ఎగువ ప్రాంతంలోనే వాడినట్లుగా పరిగణనలోకి తీసుకోవాలని తేల్చిచెప్పారు. బుధవారం జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 ముందు తెలంగాణ తరపు న్యాయవాదులు అడిగిన పలు ప్రశ్నలకు ఏపీ ప్రభుత్వం తరఫున గోయల్ సమాధానాలిచ్చారు. రక్షిత ప్రాజెక్టులు, అదనపు ప్రాజెక్టుల ఆధారంగా ఉమ్మడి ఏపీకి కేటాయింపులు జరిగాయని, ఈ ప్రాజెక్టులకు కేటాయింపులు/వినియోగం గత 48 ఏళ్లుగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఈ కేటాయింపులకు పలు అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ సమ్మతి తెలిపిందని గుర్తు చేశారు. 2015 జూన్‌లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కృష్ణా నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందమే దీనికి ఆధారమని తెలిపారు. జూరాల నుంచి 37.84 టీఎంసీలనే వాడుకునేలా తెలంగాణను నియంత్రించాలని ఆపరేషన్ ప్రొటోకాల్స్‌లో ప్రతిపాదించడాన్ని గోయల్ సమర్థించుకున్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూల్-11లో పేర్కొని, రక్షణ కల్పించిన ఏపీ, తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాలు కాకుండా మిగులు జలాలనే సరఫరా చేయాల్సి ఉంటుందని, అందుకే నెట్టెంపాడు ప్రాజెక్టును సైతం పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

పట్టాలెక్కనున్న మెగా సీడ్ పార్కు!

- డిల్లీరావుకు సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు

కర్నూలు జిల్లా తంగడంచలోని మెగా సీడ్ పార్కు మళ్లీ పట్టాలెక్కనుంది. ఏపీని ప్రపంచ విత్తన క్షేత్రంగా తీర్చిదిద్ది, రాష్ట్ర రైతాంగానికి నాణ్యమైన వంగడాలను సరఫరా చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం తంగడంచలో మెగా సీడ్ పార్క్ ప్రాజెక్టు చేపట్టగా, ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా పక్కనపెట్టింది. వాస్తవానికి.. 627ఎకరాల్లో రూ.650కోట్లతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో విత్తన తయారీని చేపట్టాలని, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో అత్యుత్తమ విత్తనాల రూపకల్పనకు కొత్త పరిశోధనలు నిర్వహించాలని గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. సీడ్ పార్క్‌కు 2017 అక్టోబరు 9న అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు నిర్వహణకు సీఈవోను నియమించి, 2018-19బడ్జెట్‌లో రూ.100కోట్లు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. ఈమేరకు మెగా సీడ్ పార్కు సీఈవోగా వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎర్రచందనం వేలానికి అనుమతి

అటవీశాఖ అధీనంలోని 905.671 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని వేలం వేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ నెల 20న 454.453 టన్నులు, 21న 451.218 టన్నులు గ్లోబల్ ఈ టెండరు ద్వారా వేలం వేయాలని, మొత్తం అమ్ముడుపోకపోతే 28న మరోసారి వేలం నిర్వహించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కాంట్రాక్ట్ బిడ్ కాలపరిమితి పదేళ్లకు పెంపు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల విషయంలో కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కాంట్రాక్ట్ బిడ్‌ల కాలపరిమితిని ఐదు నుంచి పదేళ్లకు పెంచింది. దీనివల్ల జగన్ జమానాలో బిల్లులు రాక, కొత్త వర్క్‌లు చేయలేక నష్టపోయిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లకు మేలు జరుగుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల ఆర్అండ్‌బీ ప్రస్తుతం చేపడుతున్న పనులు, భవిష్యత్‌లో చేసే పనులకు బిడ్‌లు వేసేందుకు కాంట్రాక్టర్లకు అవకాశం దక్కుతుందన్నారు.

కాలేజీల ఖాతాల్లోకే ఫీజులు: లోకేశ్

ఈ విద్యా సంవత్సరం నుంచి నేరుగా కాలేజీ యాజమాన్యాల ఖాతాలకే ఫీజులు జమ చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. బకాయిలు రూ.3,500 కోట్లను దశలవారీగా చెల్లిస్తామన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, ఇతర అంశాల్లో కాలేజీలతో సానుకూల దృక్పథంతో పనిచేస్తామన్నారు. విద్యార్థుల సమస్యలపై అన్ని విధాలా అండగా ఉంటానని ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయమూర్తుల విచారణకు..

ముందస్తు అనుమతి తప్పనిసరి

- మనీలాండరింగ్ చట్టం ఇందుకు అతీతం కాదు: సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయమూర్తులను విచారించడానికి ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 197(1) కిందకు వచ్చే ప్రతి కేసులోనూ ఇది వర్తిస్తుందని తెలిపింది. ఇందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) అతీతమేమీ కాదని పేర్కొంది. జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో ఆయనకు లబ్ధి చేకూరేలా అప్పటి ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూకేటాయింపుల్లో అధికార దుర్వినియోగం, అనధికార రాయితీలు, ఆస్తులను తక్కువ అంచనా వేయడం మొదలైనవాటి వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక నష్టం జరిగిందని, లావాదేవీలను సులభతరం చేయడానికి కొందరితో కలిసి ఆచార్య కుట్ర పన్నారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ యాక్టు కింద కేసు నమోదు చేసింది. ఈ కేసును ప్రత్యేక న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకున్నారు. ఈడీ తీరును వ్యతిరేకిస్తూ ఆచార్య తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 197(1) కింద ప్రభుత్వ ఉద్యోగిని విచారించాలంటే ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తప్పనిసరని ఆయన తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అయితే పీఎంఎల్‌ఏలోని 65,71 సెక్షన్ల కింద తమకు ప్రత్యేక అధికారాలు ఉన్నందున ఎలాంటి అనుమతీ తీసుకోవలసిన అవసరం లేదని ఈడీ పేర్కొంది. అయితే ప్రభుత్వ అనుమతి తీసుకోవలసిందేనని 2019లో తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఆచార్యకు ఈ కేసు నుంచి విముక్తి కల్పించింది. ఈ తీర్పును ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈడీ న్యాయవాదుల వాదనలతో విభేదించిన ధర్మాసనం తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ.. ఈడీ పిటిషన్‌ను కొట్టివేసింది.

5 రోజుల్లో.. 20.17 లక్షలు!

- ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల (దీపం-2) పథకానికి విశేష స్పందన వస్తోంది. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని సీఎం చంద్రబాబు ఈ నెల 1న ప్రారంభించగా... నాటినుంచి మంగళవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 20,17,110 మంది సిలిండర్లు బుక్ చేసుకున్నారు. అందులో 11,84,900 మందికి సిలిండర్లు డెలివరీ చేశారు. వీరి ఖాతాల్లో రూ.18 కోట్ల మేర సబ్సిడీని ప్రభుత్వం జమ చేసింది. సిలిండర్ బుక్ చేసుకున్నవారికి 48 గంటల్లోపు డెలివరీ చేయాల్సి ఉండగా.. రోజూ లక్షల సంఖ్యలో బుకింగ్‌లు వస్తుండటంతో గ్యాస్ కంపెనీలపై ఒత్తిడి పెరిగి, సిలిండర్ల డెలివరీ ఆలస్యమవుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పీఎం-విద్యాలక్ష్మి

మొదటిపేజీ తరువాయి

విద్యార్థులు ఈ రుణాలను వినియోగించుకోవచ్చు. ఈ పథకం కోసం రూ.3600 కోట్లు కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఏటా 22 లక్షల మంది విద్యార్థులు పీఎం-విద్యాలక్ష్మి పథకం పరిధిలోకి వస్తారన్నారు. 'జాతీయ ర్యాంకింగ్ విధివిధానాల సంస్థ (ఎన్ఐఆర్ఎఫ్)' ఇచ్చే ర్యాంకుల ఆధారంగా క్యూహెచ్ఈఐల జాబితాను రూపొందిస్తారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల ఆధారంగా ఈ జాబితాను ఏటా అప్‌డేట్ చేస్తారు. ప్రస్తుతం 860 క్యూహెచ్ఈఐల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు వైష్ణవ్ తెలిపారు. క్యూహెచ్ఈఐల్లో ప్రవేశాలు పొందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.7.50 లక్షల వరకు రుణం లభించనుందని, అందులో 75 శాతం వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వనుందని చెప్పారు. తద్వారా విద్యార్థులకు ఎడ్యుకేషన్ లోన్లు ఇవ్వడానికి బ్యాంకులకు మద్దతుగా నిలిచినట్లవుతుందన్నారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల్లోపు ఉన్న కుటుంబాల్లోని విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఇతర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, వడ్డీ రాయితీ పథకాలు పొందుతున్న వారు పీఎం-విద్యాలక్ష్మికి అనర్హులని మంత్రి వెల్లడించారు. అలాగే ఏటా లక్ష మంది విద్యార్థులకు వడ్డీ రాయితీ కింద ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వడ్డీ రాయితీ పథకం కింద 7 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఉన్నత విద్యా శాఖ రూపొందించిన 'పీఎం-విద్యాలక్ష్మి' పోర్టల్‌లో రుణాలు, వడ్డీ రాయితీ పథకాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాత్రికిరాత్రే బుల్డోజర్లతో రాలేరు

నోటీసులు ఇవ్వకుండా చాటింపు వేస్తారా?.. ఇది అహంకారం, అరాచకం

- ఆక్రమణల పేరుతో ఇళ్లను కూల్చలేరు
- నిబంధనలు పాటించాల్సిందే
- యూపీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణల తొలగింపు పేరుతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందంటూ సుప్రీంకోర్టు బుధవారం తీవ్రంగా తప్పు పట్టింది. అక్రమ నిర్మాణాల కూల్చివేత నెపంతో రాత్రికిరాత్రే బుల్డోజర్లు పంపలేదని స్పష్టం చేసింది. 3.7 చదరపు మీటర్ల స్థలాన్ని ఆక్రమించారన్న కారణంతో ఇల్లును కూల్చి వేసినందుకు బాధితునికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఇందుకు బాధ్యులైన అధికారులపై దర్యాప్తు జరపాలని సూచించింది. రోడ్డు విస్తరణ సమయంలో ఎలా వ్యవహరించాలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. 2019లో రోడ్డు విస్తరణ పేరుతో.. ఆక్రమణలో ఉందంటూ తన ఇంటిని కూల్చి వేశారని ఉత్తరప్రదేశ్‌లోని మహరాజ్‌గంజ్‌కు చెందిన మనోజ్ తిబ్రేవాల్ ఆకాశ్ 2020 నవంబర్ 7న పిటిషన్ దాఖలు చేశారు. దానిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం విచారణ జరిపింది. "ఇళ్లను కూల్చివేయడానికి మీరు రాత్రికి రాత్రే రాలేరు. ఖాళీ చేసేందుకు ఆ కుటుంబానికి సమయం కూడా ఇవ్వలేదు. ఇంట్లోని సామాను మాటేమిటి?" అని ధర్మాసనం యూపీ ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. "ఇది అహంకారంతో చేసిన చర్యే తప్ప చట్టబద్ధమైనది కాద"ని స్పష్టం చేసింది. 2019లో మహరాజ్ గంజ్ జిల్లాలో ఇదే పద్ధతిలో 123 నివాసాలను కూల్చి వేశారని తెలిపింది. "ఇలా ఇళ్లను ఎలా కూల్చి వేస్తారు? ఇది పూర్తి అరాచకం కాదా? నడుచుకుంటూ వస్తారు... ఎవరో ఒకరి ఇంటిని కూల్చి వేస్తారు... నోటీసు లేదు, ఏమీ లేదు" అని వ్యాఖ్యానించింది. హద్దులు గుర్తించకుండా, నిబంధనలు పాటించకుండా, నోటీసులు ఇవ్వకుండా ఎందుకు ఇలా చేశారని ప్రశ్నించినప్పుడు "తుడుం దెబ్బ (మునాది), లౌడ్ స్పీకర్ ద్వారా చాటింపు వేశామ"ని ప్రభుత్వ న్యాయవాది సమాధానం ఇచ్చారు. "అంటే ఏ వ్యక్తికీ నోటీసు ఇవ్వలేదన్న మాట" అని ధర్మాసనం మళ్లీ ప్రశ్నించింది. దేన్ని ఆధారం చేసుకొని అక్రమ కట్టడంగా గుర్తించారని అడిగింది. రోడ్డు విస్తరణ కోసం ఆ స్థలాలను తీసుకున్నామని న్యాయవాది జవాబిచ్చారు. "అదొక సాకు మాత్రమే. మీ వద్ద నిజమైన కారణాలు ఉన్నట్టు కనిపించడం లేద"ని వ్యాఖ్యానించింది. "తుడుం ద్వారా చాటింపు వేసి ఇళ్లను ఖాళీ చేయండి. మేం కూల్చడానికి వచ్చామని చెప్పలేరు" అని స్పష్టం చేసింది. ఇలాంటి ఇతర సంఘటనలపైనా దర్యాప్తు జరిపి, బాధ్యులైన కాంట్రాక్టరు, అధికారులను గుర్తించాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచించింది.

రాష్ట్రాలకు మార్గదర్శకాలు

- తొలుత మ్యాపులు, రికార్డుల ఆధారంగా సర్వే జరిపి రోడ్డు వెడల్పు ఎంత ఉందో తెలుసుకోండి
- దాని ఆధారంగా ఆక్రమణలను గుర్తించండి
- ఆక్రమణ ఉన్నట్టు గుర్తిస్తే దానిని తొలగించాలంటూ ఆక్రమణదారుకు నోటీసు ఇవ్వండి
- ఈ నోటీసుపై అభ్యంతరాలు ఉంటే దానిని చెప్పేందుకు వీలుగా 'స్పీకింగ్ ఆర్డర్' ఇవ్వండి. సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఇది తప్పనిసరి.
- ఒకవేళ అధికారులు ఆ అభ్యంతరాలను తిరస్కరిస్తే తగిన వ్యవధిలో ఆక్రమణలు తొలగించాలంటూ నోటీసు ఇవ్వాలి
- అప్పటికీ ఆ నోటీసుకు స్పందించకపోతే ఆక్రమణలు తొలగించవచ్చు.
- రోడ్డు విస్తరణ విషయానికి వస్తే.. సంబంధిత రహదారి పక్కన తగినంత స్థలం, ప్రభుత్వ స్థలం లేనప్పుడు మాత్రమే పక్కనున్న జాగాలను భూసేకరణ విధానం ద్వారా తీసుకోవాలి.

గోరక్షణ పేరుతో మూక హత్యలు


- సుప్రీంకోర్టు ఆందోళన
- అఫిడవిట్లు ఇవ్వనందుకు

తెలంగాణ సహా 5 రాష్ట్రాలపై ఆగ్రహం

న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతో సహా అయిదు రాష్ట్రాల్లో పెరుగుతున్న మూక హత్యలు, హింసాకాండలపై సుప్రీంకోర్టు బుధవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా గోరక్షక దళాల పేరుతో జరుగుతున్న దాడులపై ఈ రాష్ట్రాలను తీవ్రంగా హెచ్చరించింది. ఈ దాడులపై కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయనందుకు తెలంగాణ, అస్సాం, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర , బిహార్ రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వాటిని నాలుగు వారాల్లోగా సమర్పించాలని నోటీసులు జారీ చేసింది. కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయకపోతే ఈ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు డిసెంబర్ 10న కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది. వారిపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలని న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్. గవాయి, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌ల ధర్మాసనం ఆ నోటీసుల్లో పేర్కొంది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఏప్రిల్ 16నే ఆదేశాలు జారీ చేసినా స్పందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

శ్వేతసౌధం మళ్లీ ట్రంపేదే





(మొదటి పేజీ తరువాయి)

కేసులు వెంటాడుతున్నా.. ప్రచారంలో హత్యాయత్నాలు జరిగినా.. తెంపరిగా పేరున్న ట్రంప్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా.. వ్యూహాత్మకంగా ముందుకు సాగి.. గమ్యాన్ని ముద్దాడారు. 2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత ట్రంప్ మద్దతుదారులు చట్టసభల మీద జరిపిన దాడితో ఆయన రాజకీయ జీవితం ముగిసిందని అంతా భావించారు. మాజీ అధ్యక్షుడు అయి ఉండి నాలుగు క్రిమినల్ కేసుల్లో కోర్టు విచారణలను ఎదుర్కోవడంతో.. ఇక రాజకీయాల నుంచి ట్రంప్ వైదొలగడమే తరువాయి అని విశ్లేషకులు భావించారు. గత ఏడాది రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థులుగా భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామితోపాటు.. నిక్కీహేలి పేరు వినిపించినా.. తనను మించి పోటీదారు ఎవరున్నారంటూ ట్రంప్ పదేపదే ప్రకటనలు చేశారు. ఈ ఏడాది మార్చిలో అధికారికంగా ట్రంప్‌నే ప్రకటించినా.. అధ్యక్షుడు జోబైడెన్‌తో డిబేట్‌లో ఆధిపత్యం చూపినా.. డెమొక్రాట్ల తరఫున కమలాహ్యారిస్ బరిలోకి దిగడంతో గట్టిపోటీని ఎదుర్కొన్నారు. స్వింగ్ రాష్ట్రాల్లోనూ ప్రతికూల పవనాలున్నాయని సర్వేలు చెబుతున్నా.. మొక్కవోని ధైర్యంతో ప్రచారాలు చేశారు. రెండు సార్లు జరిగిన హత్యాయత్నాలు సానుభూతిని తీసుకురాగా.. అక్రమ చొరబాట్లకు చెక్, చొరబాటుదారులను వెనక్కి పంపడం, ఉద్యోగాలు, వేతనాల విషయంలో అమెరికా ఫస్ట్ నినాదం, ద్రవ్యోల్బణం తగ్గించడం వంటి హామీలతో ముందుకు సాగారు. ఫలితంగా.. స్వింగ్ రాష్ట్రాల్లోని జార్జియా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, మిషిగాన్, విస్కాన్సిన్‌లలో ఏకపక్షంగా ట్రంప్ హవా కొనసాగింది. మిగతా 2 రాష్ట్రాల్లోనూ(ఇంకా ఫలితాలు వెలువడాల్సి ఉంది) ట్రంప్ ఆధిపత్యం కనిపిస్తోంది. ఇజ్రాయెల్-హమాస్, హిజ్బుల్లా పోరు.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలను బైడెన్ సర్కారు నియంత్రించే ప్రయత్నం చేయలేదని, ఉక్రెయిన్‌కు ఆయుధ, ఆర్థిక సహకారం అందించి, పోరును కొనసాగించడాన్ని ట్రంప్ తన ప్రచారంలో అస్త్రాలుగా వాడుకున్నారు. తాను అధికారంలో ఉండగా.. అఫ్ఘానిస్థాన్ యుద్ధాన్ని ఆపిన తీరును గుర్తుచేశారు. తాను అధికారంలోకి వస్తే.. అమెరికా ఏ యుద్ధంలో పాల్గొనదని, ఇప్పుడున్న యుద్ధాలను ఆపేస్తుందని హామీ ఇచ్చారు. ఈ హామీలతో జార్జియా వంటి రాష్ట్రాల్లో ఉన్న అరబ్బులు, ముస్లింలు ట్రంప్‌కే జైకొట్టినట్లు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. వలస విధానాలపైనా ట్రంప్ హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. 1798 నాటి 'ఏలియన్ ఎనిమీస్ యాక్ట్'ను తాను తిరిగి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. రెండో ప్రపంచయుద్ధం సమయంలో జర్మనీ, జపాన్, ఇటలీ వాసులను కట్టడి చేయడానికి ఈ చట్టాన్ని ఉపయోగించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఓటర్లు ట్రంప్‌కే జైకొట్టడంతో ఆయన విజయం మరింత సులువైంది.

ట్రంప్ సరికొత్త చరిత్ర!

రెండోసారి అమెరికా అధ్యక్ష పదవి చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్.. సరికొత్త ఘనత సాధించారు. తొలిసారి పోటీలో అధ్యక్షుడిగా గెలిచి.. రెండోసారి ఓడి.. మూడోసారి పోటీలో విజయం సాధించి అధ్యక్ష పీఠం అధిష్ఠించనున్న నాయకుడిగా నిలిచారు. గతంలో ఈ రికార్డు మాజీ అధ్యక్షుడు గ్రోవెర్ క్లీవ్‌ల్యాండ్ పేరిట ఉంది. 131 ఏళ్ల తర్వాత ఆ రికార్డును ట్రంప్ సమం చేశారు. క్లీవ్ ల్యాండ్ 1884 ఎన్నికల్లో గెలిచి తొలిసారి అధ్యక్ష పీఠమెక్కారు. ఆ తర్వాత నాలుగేళ్లకు 1888లో పోటీ చేసి ఓడారు. మళ్లీ 1892లో మూడోసారి పోటీ చేసిన ఆయన.. విజయం సాధించి రెండో సారి శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. ఇక ట్రంప్ 2016 ఎన్నికల్లో గెలిచి తొలిసారి అధ్యక్షుడయ్యారు. రెండోసారి 2021 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా కమలను ఓడించి అధ్యక్ష పీఠం అధిష్ఠించబోతున్నారు.

బంగారు భవితకు..

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తన విజయం ఖరారైనట్లు తేలగానే.. ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్ బంగళా వద్ద ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడారు. తనను 47వ అధ్యక్షుడిగా ఎన్నుకొన్న అమెరికన్లకు ధన్యవాదాలు తెలుపుతూ.. ట్రంప్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తన విజయం నభూతో నభవిష్యత్ అని వ్యాఖ్యానించారు. తన ఊపిరి ఉన్నంత వరకు అమెరికా బంగారు భవిత కోసం, అమెరికన్ల కోసం అవిశ్రాంతంగా పనిచేస్తానని ప్రకటించారు. అమెరికాకు సరిహద్దులను నిర్ణయించబోతున్నామని మెక్సికో గోడ అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. తన ప్రసంగంలో ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కానున్న జేడీ వాన్స్, ఆయన భార్య, తెలుగమ్మాయి అయిన ఉష చిలుకూరి వాన్స్‌ను, స్పేస్ ఎక్స్ అధినేత ఈలాన్ మస్క్, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఆగస్టులో తప్పుకొన్న రాబర్ట్.ఎఫ్.కెన్నడీలను ట్రంప్ పొగడ్తలతో ముంచెత్తారు. ఈలాన్ మస్క్‌ను ఏకంగా ఆకాశానికి ఎత్తారు. "అమెరికా వినీలాకాశంలో సరికొత్త తార ఆయన(మస్క్). అలాంటి మేధావులను మనం మరిచిపోకూడదు" అని ప్రకటించారు. తనపై హత్యాయత్నాలు జరిగాక.. దేవుడు పునర్జన్మనిచ్చారని మిత్రులు అనేవారని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అమెరికన్ల శ్రేయస్సుకు పాటుపడతానన్నారు.

ట్రంప్‌కు అభినందనల వెల్లువ

ట్రంప్‌కు వివిధ దేశాల అధినేతల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అమెరికాతో తమ ప్రత్యేక బంధం కొనసాగుతుందని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. ట్రంప్ చరిత్రాత్మక విజయం అమెరికాకు కొత్త ప్రారంభాన్ని ఇస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. శాంతి, శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పనిచేస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ పేర్కొన్నారు. సెప్టెంబరులో ట్రంప్‌ను కలిసినప్పుడు.. రష్యా దురాక్రమణకు ముగింపు పలికే అంశంపై చర్చించామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

వ్యాపారం నుంచి రాజకీయాల్లోకి..

డొనాల్డ్ ట్రంప్ 1946 జూన్ 14న న్యూయార్క్ నగరంలోని క్వీన్స్‌లో ఫ్రెడ్రిక్ క్రీస్ట్ ఫ్రెడ్ ట్రంప్, మేరీ ట్రంప్ దంపతులకు డొనాల్డ్ ట్రంప్ జన్మించారు. తండ్రికి జర్మనీ మూలాలుండగా.. తల్లి స్కాట్లాండ్ వాసి. 13వ ఏట న్యూయార్క్ సైనిక అకాడమీలో చేరిన ట్రంప్.. ఆ వయసు నుంచే ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలకు మారుపేరుగా నిలిచేవాడు. ఫోర్డామ్ యూనివర్సిటీలో రెండేళ్లు చదివాక.. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారు. తన తాత నిర్వహించే సంస్థ 'ఎలిజబెత్ ట్రంప్ అండ్ సన్స్'లో వ్యాపార మెలకువలు నేర్చుకున్నారు. ఓవైపు వ్యాపార దిగ్గజంగా ఎదుగుతూనే.. నటనపై ఆసక్తితో పలు హాలీవుడ్ చిత్రాల్లో నటించారు. 1977లో ఇవానాను పెళ్లాడగా.. వారి బంధం 1992 వరకు కొనసాగింది. 1993లో మార్లాను పెళ్లాడారు. 1999లో విడాకులు తీసుకున్నారు. ప్రస్తుతం మెలానియాతో కలిసి ఉంటున్నారు. ట్రంప్‌నకు ఐదుగురు పిల్లలు. 1970లోనే వేల కోట్లకు పడగలెత్తిన ట్రంప్.. రాజకీయాల్లో చక్రం తిప్పాలని పలుమార్లు ప్రయత్నించారు. మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌కు మద్దతుదారుగా పనిచేశారు. 1987లో తనకుతాను రిపబ్లికన్ నేతగా ప్రకటించుకున్నారు. 1988లో ఉపాధ్యక్ష పదవికి పోటీచేద్దామనుకున్నా.. పార్టీలో అంతర్గత విభేదాలతో ఆయనకు అవకాశం దక్కలేదు. తర్వాత పలుమార్లు పార్టీలు మారారు. 2009లో రిపబ్లికన్ అభ్యర్థి జాన్ మెక్‌కెయిన్‌కు మద్దతిచ్చారు. 2016లో ప్రతికూలతలను తట్టుకుని.. మొదటిసారి అధ్యక్షుడిగా విజయం సాధించారు.

విజయానికి అడ్డురాని వివాదాలు!

న్యూఢిల్లీ, నవంబరు 6: డొనాల్డ్ ట్రంప్ రాజకీయవేత్తగా ఎంత దూకుడైన నాయకుడో.. ఆయన చుట్టూ వివాదాలు కూడా అంతేస్థాయిలో ఉన్నాయి. చట్టాలను ఉల్లంఘించారని, ఓటమిని అంగీకరించకుండా ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలే కాకుండా.. పలువురు మహిళలతో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నారన్న ఆరోపణలు కూడా ట్రంప్‌పై ఉన్నాయి. అయినా.. ఎన్నికల్లో విజయానికి ఇవేవీ అడ్డురాలేదు. ట్రంప్ తమను లైంగికంగా వేధించారంటూ ఇద్దరు మహిళలు కోర్టుకు ఎక్కగా, స్టార్మీ డేనియల్స్ అనే పోర్న్ స్టార్ ఏకంగా మీడియా ముందుకు వచ్చి.. ట్రంప్ తనతో వివాహేతర సంబంధాన్ని కొనసాగించారని, ఆయన తొలిసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన 2016లో ఈ విషయాన్ని బయటపెట్టకుండా ఉండేందుకు తనకు లక్షా 30 వేల డాలర్లు ఇచ్చారని వెల్లడించారు. ఈ అంశం పెద్ద దుమారమే రేపింది. ఈ ఆరోపణలపై విచారణ కూడా జరిగింది. కాగా, ఒకప్పటి ప్లేబాయ్ పత్రిక మోడల్ కారెన్ మెక్ డౌగల్.. 2006లో తనతో ట్రంప్ లైంగిక సంబంధం కొనసాగించినట్లు తెలిపారు. వీరే కాకుండా మరికొంత మహిళలు కూడా ట్రంప్ తమపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇక ట్రంప్ మూడు పెళ్లిళ్ల సంగతి తెలిసిందే. ఇన్ని వివాదాలున్నా ట్రంప్ విజయంపై ఇవేవీ ప్రభావం చూపలేదు.



ట్రంప్ మద్దతుదారుల సంబరాలు

కేసులు నిలుస్తాయా?

వాషింగ్టన్, నవంబరు 6: ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన తరుణంలో.. ఆయనపై గతంలో నమోదైన క్రిమినల్ కేసుల పరిస్థితేంటన్న చర్చ ముందుకొస్తోంది. క్రిమినల్ కేసులు ఎదుర్కొన్న తొలి మాజీ అధ్యక్షుడు ఈయనే. నాలుగు తీవ్ర అభియోగాలపై ఈ ఏడాదే నాలుగు సమాంతర విచారణలు జరిగాయి. ఇందులో పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్ కేసు.. 2020లో జార్జియాలో ఎన్నికల తీర్పును ఆయన తారుమారు చేయడానికి ప్రయత్నించారన్న అభియోగం తీవ్రమైనవి. అధికారిక రహస్య పత్రాలను చట్టవిరుద్ధంగా తన ఇంట్లో దాచారని నిరుడు బైడెన్ యంత్రాంగం ఆయనపై ఆరోపణలు చేసింది. ఈ కేసును ఫ్లోరిడా జిల్లా జడ్జి కొట్టివేశారు. దీనిపై ప్రాసిక్యూషన్ అప్పీల్ దాఖలు చేసింది. వాస్తవానికి తనపై ఉన్న ఫెడరల్ కేసులను స్వయంగా మాఫీ చేసుకునే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. కానీ ఇంతవరకు అమెరికా అధ్యక్షుడెవరూ ఇలాంటి పని చేయలేదు. అయితే న్యాయశాఖ ఆ అభియోగాలను ఉపసంహరించుకుంటే మాత్రం ట్రంప్‌కు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని అమెరికా న్యాయవాద వర్గాలు అంటున్నాయి.


పెన్సిల్వేనియా సభలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగినప్పటి ఫొటో(ఫైల్)

ట్రంప్ సంపద... రూ.56,502 కోట్లు!

న్యూఢిల్లీ, నవంబరు 6: అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండోసారి అధిరోహించనున్న డొనాల్డ్ ట్రంప్ వ్యాపారం రియల్ ఎస్టేట్ నుంచి మీడియా రంగం వరకూ విస్తరించింది. ఆయన నికర ఆస్తుల విలువ నవంబరు 5 నాటికి 6.7 బిలియన్ డాలర్లకు పెరిగిందని ఫోర్బ్స్ తెలిపింది. ఇది రూ.56,502 కోట్లతో సమానం. డీజేటీ యూఎస్ ఈక్విటీ కింద ట్రేడవుతున్న ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్‌లో ఆయనకు 57శాతం వాటా ఆయనకున్న అతిపెద్ద ఆస్తి. తన తండ్రి ఫ్రెడ్ ట్రంప్ నుంచి వారసత్వంగా చేపట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించారు. ఎన్నో విలాసవంతమైన భవనాలను నిర్మించారు. క్రిప్టో కరెన్సీ, ఎన్ఎఫ్‌టీ వంటి డిజిటల్ ఆస్తుల్లోనూ ట్రంప్ పెట్టుబడులు పెట్టారు. పుణె, ముంబైలో ఇప్పటికే రెండు ట్రంప్ టవర్లు పూర్తయ్యాయి. కోల్‌కతా, గురుగ్రామ్‌లలోనూ రెండు టవర్లు నిర్మాణంలో ఉన్నాయి. అయితే ట్రంప్ టవర్‌తో పాటు ఇతర ఆస్తులు తాకట్టులో ఉన్నాయని, కోర్టు తీర్పుల తర్వాత కొత్త అప్పులు కూడా వచ్చాయని ట్రంప్ ఎన్నికల సమయంలో ప్రకటించారు.

ట్రంప్ విజయం వెనుక మస్క్

ప్రచారానికి విరాళాలుగా మిలియన్ల డాలర్లు

» స్వింగ్ రాష్ట్రాల్లో మస్క్ వ్యూహాలు విజయవంతం



వాషింగ్టన్, నవంబరు6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించడంలో ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలకంగా వ్యవహరించారు. ఎన్నికలకు చాలా కాలం ముందు నుంచే ట్రంప్‌ను గట్టిగా వెనకేసుకొచ్చిన ఆయన ఇటీవల రిపబ్లికన్ల తరఫున పొలిటికల్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి రూ.1500 కోట్లకు పైగా విరాళాలు ఇచ్చారు. కీలకమైన స్వింగ్ రాష్ట్రాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాలు రూపొందించి అమలు చేశారు. వాక్ స్వాతంత్ర్యం, తుపాకీ కలిగి ఉండే హక్కులపై రూపొందించిన పిటిషన్‌పై సంతకాలు చేసే ఓటర్లకు లాటరీ ద్వారా ప్రైజ్‌మనీ ఇచ్చారు. రిపబ్లికన్లకు అనుకూలంగా ఓటర్లను ప్రలోభపెడుతున్నారంటూ డెమొక్రాట్లు ఎంత అభ్యంతరం వ్యక్తం చేసినా లెక్కచేయలేదు. రోజుకు మిలియన్ డాలర్ల చొప్పున ప్రైజ్ మనీ పంచుతూ పోయారు. స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్ భారీ విజయంలో మస్క్ లాటరీ పేరిట డబ్బు పంచడం కూడా ప్రధాన కారణమని ప్రచారం జరుగుతోంది. ట్రంప్‌ను గెలిపించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న మస్క్.. ఫిలడెల్ఫియాలో సోలోగా కూడా ప్రచారం చేశారు. ట్రంప్‌పై కాల్పులు జరిగిన పెన్సిల్వేనియా సభకూ హాజరయ్యారు. ట్రంప్ అధికారంలోకి వస్తే అక్రమ వలసల విధానాన్ని కఠినతరం చేస్తారని కూడా ఆయన ప్రచారం చేశారు. తన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్రంప్‌ను స్వయంగా ఇంటర్వ్యూ చేసి ఆయన గెలిస్తే తీసుకోబోయే నిర్ణయాలపై ప్రచారం కల్పించి లక్షల మంది ఓటర్లను ప్రభావితం చేశారు.

మస్క్‌కు పదవి

తాను అధికారంలోకి వస్తే మస్క్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటానని, లేదంటే సలహాదారుగా నియమించుకుంటానని ట్రంప్ ప్రచార సమయంలోనే ప్రకటించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ విభాగానికి అధిపతిగా చేస్తే ఓకేనని మస్క్ కూడా తన అంతరంగాన్ని బయటపెట్టారు. ఎన్నికల్లో విజయం సాధించాక చేసిన ప్రసంగంలో ట్రంప్ మస్క్‌ను స్టార్‌గా, అద్భుతమైన వ్యక్తిగా అభివర్ణించారు.

'పెద్దన్న'కు పెను సవాళ్లు!

(సెంట్రల్ డెస్క్)



రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత డొనాల్డ్ ట్రంప్‌కు పెను సవాళ్లే ఎదురు కానున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-గాజా పోరుతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, నాటో, వివిధ దేశాలకు సాయం, వాణిజ్యం వంటి అనేక సవాళ్లను ఆయన ఎదుర్కోవాల్సి ఉంటుంది. తొలిసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్.. 'అమెరికా ముందు' అన్న నినాదాన్ని ఎత్తుకున్నారు. దానివల్ల అంతర్జాతీయ వేదికపై అమెరికాకు ఉన్న గౌరవం తగ్గినట్లు కనిపిస్తోందని.. దాన్ని తిరిగి తీసుకొస్తానని ట్రంప్ ప్రచారంలో పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అమెరికా విదేశాంగ విధానాలను మార్చేయడం, మానవ హక్కుల ఉల్లంఘనలను కొట్టిపారేయడం, నియంత పాలకులతో సన్నిహితంగా మెలగడం వంటి చరిత్ర కలిగిన ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం కొందరు ప్రపంచ నేతలకు మింగుడుపడని విషయమే. అమెరికా ముందున్న ప్రధాన సమస్యల్లో ఇజ్రాయెల్-గాజా యుద్ధం ఒకటి. ఈ యుద్ధానికి ముగింపు పలకాలని ట్రంప్ ఇప్పటికే సూచించారు. కానీ, దానికి మార్గం ఏంటన్నది మాత్రం చెప్పలేదు. గాజాలో హమాస్‌పై, లెబనాన్‌లో హెజ్‌బొల్లాపై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు వ్యక్తిగతంగా మద్దతు తెలిపిన ట్రంప్.. ఇటీవల 'మీరేం చేయాలనుకుంటున్నారో అది చేయండి' అని సూచించడం గమనార్హం. ఇక ట్రంప్ ముందున్న మరో ప్రధాన సమస్య రష్యా-ఉక్రెయిన్ యుద్ధం. బైడెన్ సర్కారు ఉక్రెయిన్‌కు ఆర్థిక సాయం చేయడాన్ని ట్రంప్ బహిరంగంగానే విమర్శించిన సంగతి తెలిసిందే. ట్రంప్‌తో ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న జేడీ వాన్స్ కూడా అమెరికా ఆర్థిక సాయంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రతిసారీ అమెరికా వస్తారు. 60 బిలియన్ డాలర్లు తీసుకొని వెళ్తారు. ఆయనో గొప్ప సేల్స్‌మ్యాన్" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తైవాన్ విషయంలోనూ ట్రంప్ విధానాలు ఆందోళనకరమేనని నిపుణులు చెబుతున్నారు. చైనా నుంచి తైవాన్‌కు రక్షణ కల్పించే విషయంలో ఆయన ముందుకు రారని పేర్కొంటున్నారు. రక్షణ రంగ సాయానికి తైవాన్ సొమ్ములు చెల్లించాలన్న ట్రంప్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమంటున్నారు.

వాన్స్.. ఆంధ్రా అల్లుడే!

అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి తూర్పు గోదావరి అమ్మాయే

వాషింగ్టన్, నవంబరు 6: అమెరికా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జేడీ వాన్స్‌కు తెలుగు నేలకు మధ్య ప్రత్యేక సంబంధం ఉంది. ఆయన ఆంధ్రప్రదేశ్ అల్లుడు. వాన్స్ భార్య ఉష చిలుకూరి ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఉండ్రాజవరం మండలం వడ్లూరు. ఉషను వాన్స్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఉష భర్త అమెరికా ఉపాధ్యక్షుడు కాబోతుండడంతో పాటు ఉష సెకండ్ లేడీ ఆఫ్ అమెరికా కాబోతున్న నేపథ్యంలో వడ్లూరు ప్రజలు సంబరాలు చేసుకున్నారు. కాగా, అమెరికా 'సెకండ్ లేడీ'గా వ్యవహరించనున్న తొలి భారత సంతతి మహిళ కూడా ఉషే కావడం విశేషం. ఉష తాతముత్తాతల స్వగ్రామం వడ్లూరు. అయితే, తర్వాత కాలంలో వారు ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం పలు ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ క్రమంలో ఉష తల్లిదండ్రులు కృష్ణాజిల్లాలోని ఉయ్యూరు సమీపంలో ఉన్న సాయిపురం ఉండేవారు. ఆ తర్వాత వారు అమెరికా వెళ్లి అక్కడే స్థిర పడ్డారు. ఉష అక్కడే జన్మించారు. ఆమె బాల్యం అంతా శాన్ ఫ్రాన్సిస్కోలోనే గడిచింది. యేల్ యూనివర్సిటీ నుంచి హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీ పట్టాపుచ్చుకున్న ఆమె.. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఎంఫిల్ పూర్తిచేశారు. తర్వాత లా కెరీర్ ప్రారంభించారు. సుప్రీం కోర్టు జడ్జీలు జాన్ రాబర్ట్స్, బ్రెట్ కవనాగ్ వద్ద సహాయకురాలిగా పనిచేసి మంచి పేరు సంపాదించారు. యేల్ లా స్కూల్‌లో ఉన్నప్పుడే వాన్స్‌తో ఉషకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. 2014లో వారు హిందు సంప్రదాయంలో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇవాన్, వివేక్ అనే ఇద్దరు అబ్బాయిలు, మిరాబెల్ అనే అమ్మాయి ఉన్నారు. కాగా, వాన్స్ బాల్యం అంతా కష్టాల మధ్య గడిచింది. బేవర్లీ కరోల్, డొనాల్డ్ రే బౌమాన్ దంపతులకు 1984, ఆగస్టు 2న వాన్స్ ఓహియోలో జన్మించారు. ఆయన చిన్నప్పుడే తల్లిదండ్రులు విడాకులు తీసుకోవడంతో కష్టాలు మొదలయ్యాయి. వాన్స్ 17 ఏట క్యాషియర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. అయితే 2003లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత యూఎస్ మెరైన్ కార్ప్స్‌లో చేరి నాలుగేళ్ల పాటు సేవలు అందించారు. ఆ తర్వాత యేల్ లా స్కూల్‌లో చేరారు.


ఉష చిలుకూరి, జేడీ వాన్స్

మా ఊరికి గర్వకారణం

నిడదవోలు నియోజకవర్గం, వడ్లూరు గ్రామానికి చెందిన చిలుకూరి వారి ఆడపడుచు ఉష అమెరికా రెండో మహిళ కావడం ఆనందంగా ఉంది. మా గ్రామానికి ఒక్కసారిగా ప్రపంచ గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. ఉష తాతముత్తాతలు ఉన్న గ్రామంలో వారికి చెందిన ఇంటిస్థలం నేడు ప్రజలకు ఉపయోగ పడేలా తీర్చిదిద్దాం. ఉష కుటుంబం మూలాలు ఇక్కడ ఉండటం మా ఊరికి గర్వకారణం.

- పెన్మత్స శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్, వడ్లూరు

వాన్స్ గెలుస్తారని ముందే అనుకున్నా!

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన మనుమరాలి భర్త జేడీ వాన్స్ అమెరికాకు ఉపాధ్యక్షుడు కావడం పట్ల విశాఖపట్నంలో ఉండే ఉష సమీప బంధువు శాంతమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఆయన విజయాన్ని ముందే ఊహించానని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో శాంతమ్మ అనేక విషయాలు పంచుకున్నారు. "ఉదయం నుంచి గెలుపు ఖరారయ్యే వరకు టీవీ చూస్తూనే ఉన్నాను. ఇప్పటివరకూ ఉష, ఆమె భర్తతో మాట్లాడలేదు. విజయోత్సవాలు ముగిసిన తర్వాత మాట్లాడతాను భారత్, అమెరికా మధ్య సత్సంబంధాలు బలోపేతం చేసేలా చూడాలని వాన్స్‌ను కోరతాను" అని ఆమె అన్నారు.

మిత్రమా.. కలిసి పని చేద్దాం

» డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేసి ప్రధాని మోదీ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ, నవంబరు 6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన ట్రంప్‌కు భారత ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రంప్‌తో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి మరీ అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తనతో మాట్లాడిన తొలి విదేశీ నేత భారత ప్రధాని మోదీ అని ట్రంప్ ఈ సందర్భంగా అన్నారని పీఎంవో పేర్కొంది. అలాగే, భారత్, మోదీ తనకు నిజమైన స్నేహితులని, ప్రపంచమంతా మోదీని ప్రేమిస్తుందని ట్రంప్ అన్నారని వెల్లడించింది. అంతకముందు.. ట్రంప్‌ను 'మై ఫ్రెండ్' అని పేర్కొంటూ ప్రధాని మోదీ ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. "గతంలో మీ పాలనలో సాధించిన విజయాలకు కొనసాగింపుగా భారత్-అమెరికా వ్యూహాత్మక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా మనం కలిసి పని చేయాలని ఆశిస్తున్నా" అని పోస్ట్ చేశారు. కాగా, ట్రంప్‌కు కాంగ్రెస్ పార్టీ కూడా శుభాకాంక్షలు తెలియజేసింది. ట్రంప్ తన పాలనలో సక్సెస్ కావాలని ఖర్గే, రాహుల్ గాంధీ ఆకాంక్షించారు.

ఫలించని పోరాటం!

ట్రంప్‌పై విజయానికి శాయశక్తులా కృషి చేసినా కమలకు తప్పని ఓటమి

వాషింగ్టన్, నవంబరు 6: ట్రంప్‌పై మూడు నెలల క్రితం బరిలోకి దిగే వరకూ కమల పట్ల ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. కానీ, ఒకసారి రంగంలోకి దిగిన తర్వాత ట్రంప్‌నకు కమల చెమటలు పట్టించారనటం అతిశయోక్తి కాదు. ప్రెసిడెంట్ బైడెన్ మీద అలవోకగా విజయం సాధించే అంచనాల్లో ఉన్న ట్రంప్.. ఒక్కసారిగా వాస్తవంలోకి వచ్చారు. కమలతో జరిగిన డిబేట్‌లో ట్రంప్ పూర్తిగా తేలిపోయారు. దాంతో, ఇకమీదట ఆమెతో మరో డిబేట్‌లో పాల్గొనని చేతులెత్తేశారు.అయితే, ప్రారంభంలో ఉన్న కమల దూకుడు క్రమంగా తగ్గుముఖం పట్టింది. సర్వేల్లో ట్రంప్‌పై ఆధిక్యత చూపిన కమల మెల్లగా వెనుకబడిపోయారు. ధీరోదాత్తమైన పోరాటం జరిపిన కమల ఓటమి పాలయ్యారు. ఇంతకూ కమలా హ్యారిస్ ఓటమికి కారణాలేమిటి???

వ్యవధి: అన్నింటికన్నా పెద్ద కారణం.. ఆమెకు లభించిన స్వల్ప వ్యవధి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బరిలో ఉండే అభ్యర్థులు సంవత్సరాల ముందుగానే ప్రణాళికలు రచించుకొని, సాధనసంపత్తిని సమకూర్చుకుంటారు. కానీ, కమలకు ఆ అవకాశం లభించలేదు. అధ్యక్షుడిగా ఉన్న జో బైడెన్.. ఈసారి కూడా తానే బరిలో ఉంటానని చివరివరకూ భీష్మించుకొని కూర్చున్నారు. వయసు మీద పడిన బైడెన్ ఆరోగ్యంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. ఆయన కుర్చీని వదులుకోవటానికి సిద్ధపడలేదు. చివరికి జూలై 21న తాను అధ్యక్ష రేసు నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. ఆయన స్థానంలో కమల ముందుకొచ్చారు. అంటే, ట్రంప్‌తో తలపడటానికి కమలకు కేవలం 3 నెలల సమయం మాత్రమే లభించింది.


తమిళనాడులో కమల పూర్వీకుల ఊరు తులసేంద్రపురంలో అమెరికా ఎన్నికల ఫలితాలను టీవీలో ఆసక్తిగా చూస్తున్న గ్రామస్థులు



జాతి వివక్ష: అగ్రరాజ్యం అమెరికాలో శ్వేత జాతి ఆధిపత్య ఛాయలు పోలేదు. నల్లవారిపై అప్పుడప్పుడూ జరిగే దారుణమైన దాడులే దీనికి నిదర్శనం. ట్రంప్‌ను ఈ శ్వేతజాతి ఆధిపత్యవాదానికి ప్రతీకగా జరిపిన ప్రచారం శ్వేతజాతీయుల్లో ఆయన పట్ల గణనీయమైన మద్దతు పెంచింది. ఇదే అంశం ఆఫ్రికా, ఆసియా వారసత్వం కలిగి ఉన్న కమలకు ప్రతికూలంగా పరిణమించింది. దీంతోపాటు, అమెరికా రాజకీయాల్లో పురుషాధికత్యనే అక్కడ రాజ్యమేలుతోంది. దీనివల్లే ఆ దేశంలో ఇప్పటికీ ఒక మహిళ అధ్యక్షురాలు కాలేకపోయారు. వైస్ ప్రెసిడెంట్ పదవిని ఒక మహిళ తొలిసారిగా చేపట్టటం.. కమలా హ్యారిస్‌తోనే ప్రారంభమైంది.

కీలక రాష్ట్రాల్లో కిందికి


'స్వింగ్ స్టేట్స్'గా పేరొందిన 7 రాష్ట్రాలు చివరి క్షణం వరకూ ఎటువైపు ఉంటాయో తెలియని పరిస్థితి ఈసారి నెలకొంది. ఈ రాష్ట్రాలను ఎవరు కైవసం చేసుకుంటే వారే అధ్యక్ష పదవిని చేపడతారని విశ్లేషణలు వచ్చాయి. దీనికి తగినట్లుగానే, ఈ స్వింగ్ స్టేట్స్‌లో ట్రంప్ గెలిచి అధ్యక్ష ఎన్నికల్లో విజేతగా నిలిచారు. ఈ రాష్ట్రాల్లో కమల ఎందుకు ఓడిపోయారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. పోలైన ఓట్ల తాలూకు పూర్తి సమాచారం వెల్లడైన తర్వాతే కారణాలేమిటో తెలుస్తాయి.

పార్టీపై అసంతృప్తి

డెమోక్రటిక్ పార్టీలో గత నాలుగేళ్లుగా పటిష్ఠమైన నాయకత్వం లేకపోవటంతో.. ఆ పార్టీ అభిమానుల్లో, ఓటర్లలో కొంత నిస్తేజం నెలకొంది. మరోవైపు, ట్రంప్ దూకుడు వైఖరి రిపబ్లికన్ ఓటర్లలో ఉత్సాహం నింపింది.

నెల రోజుల్లో సెట్ చేస్తా

మంచితనాన్ని అసమర్థతగా చూస్తున్నారు
ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం



- సోషల్ సైకోలపై పోలీసుల ఉదాసీనతపై సీరియస్
- అరాచక పోస్టులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ
- గట్టి చర్యలు ఉండాల్సిందేనన్న డిప్యూటీ సీఎం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సోషల్‌మీడియా పోస్టులు కట్టు తప్పుతుండటం... అరాచక పోస్టులతో వైసీపీ మూకలు రెచ్చిపోతున్న తీరుపై రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలువురు మంత్రులు...వైసీపీ సోషల్ సైకోల కట్టడి విషయంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. దీనిపై కూటమి పార్టీల కేడర్‌లో తీవ్ర అసంతృప్తి ఉందని ప్రస్తావించారు. 'మన ప్రభుత్వం వచ్చినా మనల్నే తిడుతుంటే తట్టుకోలేక పోతున్నాం' అంటూ కార్యకర్తలు తమవద్ద వాపోతున్నారని చంద్రబాబు దృష్టికి తెచ్చారు. జిల్లాల్లో ఎస్పీలకు ఫోన్లు చేసినా స్పందన ఉండట్లేదని, వైసీపీ వాసనలు ఇంకా పోలీసుల్లో పోలేదని పెదవి విరిచారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం తాను చేసిన వ్యాఖ్యలను మంత్రివర్గంలో ప్రస్తావించి గట్టి చర్యలు తీసుకోకపోతే లాభం ఉండబోదన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు గట్టిగా స్పందించారు. 'చట్ట ప్రకారమే మనం వెళదాం. తప్పు చేసిన వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు. కచ్చితంగా నెల రోజుల్లో ఏపీలో పోలీసింగ్ ఎట్లా ఉంటుందో చూపిస్తా' అని మంత్రులకు భరోసా ఇచ్చారు. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. పోలీసులపై తాను చేస్తున్న వ్యాఖ్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేబినెట్‌లో ప్రస్తావించారు. సోషల్ మీడియాలో నేతల కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్టు చేస్తున్న అంశాన్ని ఆయన లేవనెత్తారు. దీంతో కేబినెట్ సమావేశంలో సుమారు 25నిమిషాల పాటు చర్చ జరిగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ సోషల్ మీడియా శ్రుతిమించి పోతోందని, ప్రభుత్వాన్ని కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నారని సీఎం పేర్కొన్నారు. ముందుగా తనపైనా, తన కుటుంబంపైనా పోస్టులు పెట్టారని, ఆ తర్వాత పవన్‌కల్యాణ్ కుటుంబంపైనా, ఇటీవల హోంమంత్రి అనితను టార్గెట్ చేశారని చంద్రబాబు అన్నారు. తన మంచితనాన్ని అసమర్థతగా తీసుకుంటున్నారని, అసత్య పోస్టులను ఇక ఉపేక్షించేది లేదన్నారు. ఈ చర్చ జరుగుతున్న సమయంలో పవన్ వచ్చారు. ఆయన కూడా.. జగన్ ప్రభుత్వంలో చట్టాలు పక్కనపెట్టి మరీ ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు చేసిన పోలీసులు.. ఇప్పుడు చట్టబద్ధంగా కూడా స్పందించడం లేదని అన్నారు. అందుకే తాను అంత తీవ్రంగా స్పందించాల్సి వచ్చిందని... రెండు రోజులుగా తానుచేస్తున్న వ్యాఖ్యలపై ఆయన వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్టులకు తన ఇంటి ఆడబిడ్డలు కంటతడి పెట్టుకోవడం చూసి తట్టుకోలేకపోయానన్నారు. దీనిపై గట్టిగా చర్యలు తీసుకోవాల్సిందేనని పలువురు మంత్రులు కూడా అభిప్రాయపడ్డారు. పలు జిల్లాల ఎస్పీలు మంత్రుల ఫోన్లకు సైతం సరిగా స్పందించడం లేదని, కింది స్థాయిలో డీఎస్పీ, సీఐలపై నెపం నెట్టి తప్పుకుంటున్నారని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు అధికారుల తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని సీఎం దృష్టికి కొందరు మంత్రులు తీసుకొచ్చారు. వివిధ శాఖల్లో పలువురు అవినీతిపరులు అధికారులుగా చలామణి అవుతున్నారని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని పలువురు మంత్రులు కోరినట్లు సమాచారం. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు నిరసనలు తెలిపిన తమను అరెస్టు చేయడానికి వచ్చిన సీఐకు... ఈ ప్రభుత్వంలో కూడా మంచి పోస్టు ఇచ్చిన విషయం మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు.

కేబినెట్ భేటీ సమయం
ఆదా చేయాలి: చంద్రబాబు

కేబినెట్‌లో అజెండాను చదివేందుకు సమయాన్ని వృథా చేయకుండా త్వరగా సమావేశాన్ని ముగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. అజెండాపై ముందే మంత్రులు అధ్యయనం చేసి రావాలని, దానిపై చర్చను త్వరగా ముగించి.. రాజకీయ అంశాలపై దృష్టి సారించేలా ఏర్పాటు ఉండాలని సూచించారు. "ప్రధాని నిర్వహించే కేంద్ర కేబినెట్ సమావేశం ఒక్క గంటలో పూర్తవుతుంది. అలాంటిది మన కేబినెట్ 3 గంటలకు పైగా నడుస్తోంది. అజెండాపై చర్చ జరిగిన తర్వాత రాజకీయ సంబంధమైన ముఖ్యమైన విషయాలపై చర్చించుకునేలా ఉండాలి" అని చంద్రబాబు అన్నారు.

రుషికొండ భవనాలు ఏంచేద్దాం?....

రుషికొండ ప్యాలెస్‌పై కేబినెట్ సమావేశంలో చర్చ జరిగింది. రుషికొండ ప్యాలెస్‌ను తాను ఇటీవల చూశానని, తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ అటువంటి ఇంద్రభవనాన్ని చూడలేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రుషికొండపై ఏంచేద్దామనేది మంత్రులు సలహాలివ్వాలని సీఎం కోరారు. ఎవరైతే పేద వర్గాలు, ఇల్లు లేని వారు ఉన్నారో వారినీ, పల్లెల నుంచి రైతులను తీసుకెళ్లి రుషికొండ భవనాలను చూపించాలని మెజారిటీ మంత్రులు కోరారు. త్వరలో దీనిపై ఒక నిర్ణయం తీసుకుందామని సీఎం తెలిపారు.

పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం తీసుకున్న క్రమంలో ఆ పేరును పిలవడం ఇబ్బందిగా ఉన్నదని పవన్ కల్యాణ్ అన్నారు. "పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని పుడాగా వ్యాఖ్యానిస్తున్నారు. అదే రీతిలో పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని పీడాగా పిలవాల్సి ఉంటుంది. అలా పలకడం ఇబ్బంది. దాన్ని మరో రకంగా పిలిచే విధంగా పేరు మార్చాలి" అని పవన్ సూచించినట్లు సమాచారం.

సోషల్ సైకోలకు చెక్


సస్పెండ్ అయిన సీఐ తేజోమూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పోస్టులు పెట్టిన వ్యక్తికి నోటీసు ఇచ్చి వదిలేసిన చిన్నచౌక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసి, గట్టి సంకేతాలు పంపింది. తనతోపాటు జీవిత భాగస్వామిని, కుమార్తెలను, ఆఖరికి కన్నతల్లిని కూడా అనడంతో తట్టుకోలేని పవన్ కల్యాణ్, రెండురోజుల క్రితం చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగింది. ఉలిక్కిపడ్డ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పందించి పోలీసింగ్‌లో వేగాన్ని పెంచే ప్రయత్నం చేశారు. ఏకంగా ఎస్పీనే బదిలీపై పంపించారు.

అసలేం జరిగింది?

మాజీ సీఎం వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోని వేముల మండలం కొండ్రెడ్డి గారిపల్లెకు చెందిన వర్రా రవీంద్రారెడ్డి ఓ జులాయి. 2011లో జగన్ వైసీపీని స్థాపించిన తరువాత పులివెందులలో కీలకంగా ఎదిగాడు. ఎంపీ అవినాశ్ అనుచరుడిగా ఉంటూ జగన్ భార్య భారతికి పీఏగా ఉండేవాడు. వేముల పోలీసుస్టేషన్‌లో ఆయనపై రౌడీషీట్ ఓపెన్ అయింది. జగన్ సీఎం అయిన తరువాత రవీంద్రారెడ్డి అరాచకాలకు అడ్డు లేకుండాపోయింది. సోషల్‌మీడియా వేదికగా రెచ్చిపోయాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుటుంబసభ్యులు, హోంమంత్రి అనితతో పాటు జగన్ సోదరి షర్మిల, ఆమె తల్లి విజయలక్ష్మి, మరో చెల్లి సునీతపై కూడా అసభ్యకరంగా పోస్టులు పెట్టేవాడు. అతనిపై కడప, మంగళగిరి, హైదరాబాద్, రాజంపేట, ఇతర ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. వర్రాపై గతంలోనే వైఎస్ సునీత హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక మరింత రెచ్చిపోయాడు. ఆడవారే లక్ష్యంగా ఘోరంగా పోస్టులు పెట్టేవాడు. వర్రాపై ఇటీవల ఐపీసీ 509, 505, 66ఇ, 67ఆఫ్ ఐటీ యాక్ట్ నమోదైంది. అరాచక పోస్టులపై రెండు రోజుల క్రితం పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం దరిమిలా పోలీసు యంత్రాంగం కదిలింది. కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప చిన్నచౌక్ సీఐ తేజమూర్తి ఆధ్వర్యంలో వర్రాను మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకుని కడప పోలీసు స్టేషన్ తీసుకువచ్చారు. అయితే, ఆ వెంటనే 41ఏ నోటీసులు ఇచ్చి వదిలిపెట్టారు. అదుపులోకి తీసుకున్న సమయంలో వర్రా వెంట కడపకు చెందిన ఓ వైసీపీ అనుకూల అడ్వకేట్ మహేశ్వర్‌రెడ్డి వచ్చారు. వర్రాపై అన్నమయ్య జిల్లాలోని రాజంపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కావడంతో.. ఆ జిల్లా పోలీసులు కడపకు చేరుకున్నారు. ఇక్కడ నోటీసులు ఇచ్చిన తరువాత రాజంపేట పోలీసులకు అప్పజెప్పాల్సి ఉంది. అయితే.. 41ఏ నోటీసులు ఇచ్చి వర్రాను తేజమూర్తి వదిలేశారు. దీనివెనుక పెద్ద గూడుపుఠాణినే ఉందంటారు. 41ఏ నోటీసు ఇచ్చి పంపిస్తామని వైసీపీ ముఖ్యనేత సోదరుడికి ముందే పోలీసులు హామీ ఇచ్చారని, ఆ మేరకు తప్పించారని ప్రచారం ఉంది.


జగన్‌తో రవీంద్రారెడ్డి (ఫైల్)

కడప ఎస్పీపై బదిలీ వేటు

రాష్ట్రంలో కొందరు పోలీసులు సోషల్ సైకోలపై చట్టపరమైన చర్యలు తీసుకొంటుంటే, అందుకు భిన్నంగా వ్యవహరించిన కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌పై ప్రభుత్వం బదిలీ వేటువేసింది. వర్రా రవీందర్ రెడ్డిని మంగళవారం పులివెందులలో అదుపులోకి తీసుకున్న చిన్నచౌక్ (కడప టౌన్) పోలీసులు నిందితుడిని వదిలిపెట్టారు. సీఎం చంద్రబాబు ఈ విషయం తెలిసిన వెంటనే కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను హుటాహుటిన కడపకు పంపారు. పోలీసుల నిర్లిప్తత ఉందని తేలడంతో వెంటనే ఎస్పీ హర్షవర్ధన్ రాజును బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లా ఎస్పీ వీవీ సాగర్ నాయుడుకు కడప జిల్లా బాధ్యతలు అప్పగించింది. మరోవైపు చిన్న చౌక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను డీఐజీ కోయ ప్రవీణ్ సస్పెండ్ చేశారు.

ఇంత బరితెగింపా!

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రెచ్చిపోయిన సైకో సోషల్ మూక రాష్ట్రంలో ప్రభుత్వం మారినా అదేపంథా కొనసాగిస్తోంది. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌పై పత్రికల్లో రాయలేని దారుణమైన భాషలో దూషిస్తున్నారు. పవన్ కల్యాణ్ కుమారుడు అకీరా నందన్ తన చెల్లెల్ని ఎత్తుకున్న ఫోటో పెట్టి చేసిన కామెంట్ చదివితే ఎవరికైనా రక్తం మరుగుతుంది. లోకేశ్ పుట్టుక నుంచి బాడీ షేమింగ్ వరకూ దేన్నీ వదలట్లేదు. హోంమంత్రిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వర్రా రవీందర్ రెడ్డి గతంలో జగన్ సోదరి షర్మిలపైనా అత్యంత హేయమైన కామెంట్లు పోస్టు చేశాడు. వివేకా కుమార్తె సునీతను కూడా వదల్లేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తన సోషల్ మీడియా అకౌంట్ హ్యాక్ అయిందంటూ పులివెందులలో పోలీసులకు ఫిర్యాదు చేసి డ్రామాలాడాడు. వీరి వికృత చేష్టలను జగన్ రేత పత్రిక భావ ప్రకటనా స్వేచ్ఛ అంటూ సమర్థించడం హేయమైన చర్యగా కొందరు పోలీసులు అభివర్ణిస్తున్నారు.

భూ ఆక్రమణలపై కొరడా!

కబ్జాకోరులకు 14 ఏళ్లు జైలు శిక్ష!

- ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిషేధ బిల్లుకు కేబినెట్ ఆమోదం
- నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి


రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, సీఎస్



అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణదారులకు టీడీపీ కూటమి ప్రభుత్వం షాకివ్వబోతోంది. రాష్ట్రంలో ప్రభుత్వ, పట్టా భూములను ఆక్రమించే కబ్జాకోరులను కఠినంగా శిక్షించాలని, భారీగా జరిమానాలు కూడా విధించాలని నిర్ణయించింది. ఈ దిశగా ప్రస్తుత భూ ఆక్రమణ నిరోధక చట్టాన్ని రద్దుచేసి.. దాని స్థానంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఏపీ ల్యాండ్ గ్రాబింగ్(నిషేధం)బిల్లు-2024 ముసాయిదాను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దీనిప్రకారం.. భూ ఆక్రమణలకు పాల్పడే వారికి 10 నుంచి 14 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. ఆక్రమించిన భూమి విలువతోపాటు నష్టపరిహారాన్ని కూడా వసూలు చేస్తారు. బుధవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024-25 నుంచి ఎస్సీలు కాకుండా విగతా విద్యార్థులందరికీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు(ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్) కళాశాలల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని నిశ్చయించింది. గత ప్రభుత్వం చెల్లించకుండా నిలిపేసిన ఫీజులను తల్లుల ఖాతాల్లోనే వేయాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం చెల్లించే రీయింబర్స్‌మెంట్ మాత్రం కళాశాలల ఖాతాలకే జమచేయాలని నిర్ణయించారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి ఆ తర్వాత విలేకరులకు వివరించారు.

మరిన్ని కేబినెట్ నిర్ణయాలివీ..

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పథకం కింద చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లింపు. 4.45 లక్షల పనులకు 12% వడ్డీతో రూ.331కోట్ల చెల్లింపునకు ఆమోదం.
- ఏపీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్‌యాన్యుయేషన్) చట్టం-1984 పరిధిలోకి వచ్చే జ్యుడీషియల్ అధికారుల పదవీ విరమణ వయసు 61 ఏళ్లకు పెంపు. సదరు సవరణ బిల్లుకు ఆమోదముద్ర.
- ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ (సవరణ) ఆర్డినెన్స్-2024, ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ (సవరణ) ఆర్డినెన్స్-2024, ఏపీ ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్, ఫారిన్ లిక్కర్‌లో వాణిజ్య నియంత్రణ ఆర్డినెన్స్-2024 స్థానంలో రూపొందించిన మూడు ముసాయిదా బిల్లులకు ఆమోదం.
- కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పునరుద్ధరణకు జారీ చేసిన జీవో 59కు ధ్రువీకరణ. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ఆమోదం.
- పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 100 పడకల ప్రాంతీయ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్. కొత్తగా 66 నూతన పోస్టుల మంజూరుకు ఆమోదం.
- 8,352.69 చదరపు కిలోమీటర్ల మేర ఏపీసీఆర్‌డీఏ సహజ పరిధి పునరుద్ధరణ.
- ఆంధ్రప్రదేశ్ వస్తువులు, సేవల పన్ను చట్టం-2017 సవరణ బిల్లు ముసాయిదాకు ఓకే.
- ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ(సవరణ) చట్టంలోని సెక్షన్ 3కి సవరణ.. ముసాయిదా బిల్లుకు ఆమోదం.
- 50 ఎకరాల వరకు ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమల యూనిట్లకు భూమిని కేటాయించే విధానం పునరుద్ధరణ.
- అమరావతి ఓఆర్ఆర్ పరిధిలోకి బెంగుళూరు-విజయవాడ కారిడార్, విజయవాడ-నాగపూర్ కారిడార్. దీంతో ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65, ఎన్‌హెచ్-30, ఎన్‌హెచ్-216, ఎన్‌హెచ్-544, ఎన్‌హెచ్-541జీ అనుసంధానం.

కబ్జాలపై ఆరు నెలల్లో విచారణ..!

కేబినెట్ ఆమోదించిన ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) బిల్లు-2024 చట్ట రూపం దాలిస్తే.. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు భూములన్నిటికీ వర్తిస్తుంది. చట్టం అమల్లో భాగంగా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తారు. జిల్లాస్థాయి జడ్జి లేదా సెషన్స్ జడ్జిని వీటిలో నియమిస్తారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కూడా ప్రభుత్వం నియమిస్తుంది. భూ ఆక్రమణ అంశాలపై కోర్టులు సుమోటోగా విచారణ చేపట్టవచ్చు. భూములు కోల్పోయిన బాధితులు, ప్రభుత్వం నేరుగా విచారణ కోరవచ్చు. భూములు ఆక్రమణకు గురయ్యాయని జిల్లా కలెక్టర్ గుర్తిస్తే వాటిని విచారించాలని కోర్టులకు సిఫారసు చేయవచ్చు. ప్రత్యేక కోర్టులకు సివిల్, క్రిమినల్ అధికారాలు ఉంటాయి. ఏళ్ల తరబడి విచారణ సాగకుండా.. ఆరు నెలల్లోగా ముగించేలా క్లాజులను ప్రతిపాదించారు. విచారణ సందర్భంగా ఆక్రమణదారు తన ఆదాయానికి మించిన భూములను కలిగి ఉన్నట్లు గుర్తిస్తే.. అవి ఎలా వచ్చాయో విచారిస్తారు. అవి కూడా కబ్జా చేసినవేనని తేలితే కొత్త చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటారు. ఈ అంశంపై ప్రజలు, ప్రజాసంఘాలు, సంస్థల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీసీఎల్ఏ నేతృత్వంలో రాష్ట్ర స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

3 కీలక పాలసీలకు పచ్చజెండా

డేటా సెంటర్, సెమీ కండక్టర్, డ్రోన్ విధానాలకు మంత్రివర్గం ఆమోదం

- డిజిటలైజేషన్, 5జీ, క్లౌడ్ మార్కెటింగ్, మొబైల్, ఏఐ మార్కెట్‌కు ప్రోత్సాహం
- 'డేటా'లో 20 కోట్లు పెట్టుబడి పెట్టే సంస్థలకు ఏడేళ్లు వంద శాతం ఎస్‌జీఎస్టీ రాయితీ

అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంకేతిక, ఆర్థిక ప్రగతిని మార్చేందుకు దోహదపడే మూడు కీలక పాలసీలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. 2024-29 నడుమ ఐదేళ్లపాటు ఉండే డేటా సెంటర్, సెమీ కండక్టర్ ఎఫ్ఏబీ, డ్రోన్ పాలసీలకు పచ్చజెండా ఊపింది. వీటితో రాష్ట్ర ఆర్థిక ప్రగతి వేగం పుంజుకుంటుందని.. ఉద్యోగ కల్పనలో జోరు పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అమెరికా, ఐరోపా దేశాల వాణిజ్య రంగాన్ని ప్రభావితం చేస్తున్న సెమీ కండక్టర్ పరిశ్రమ.. ప్రస్తుతం గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రల్లో వర్ధిల్లుతోంది. చిప్‌లు, సెమీ కండక్టర్ తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ఆ రాష్ట్రాలు మంచి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇదే తరహాలో రాష్ట్రంలోనూ ప్రోత్సహించాలని.. డ్రోన్, డేటా సెంటర్ పాలసీలను కూడా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

డేటా సెంటర్ రంగంలో 5,000 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో డేటా సెంటర్ రంగంలో రూ.5,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడమే కొత్త విధానం లక్ష్యం. డిజిటలైజేషన్ మార్కెట్‌ను ప్రోత్సహించేందుకు వీలుగా ఈ పాలసీని ప్రభుత్వం తీసుకొచ్చింది. డేటా సెంటర్ ఆధారిత వాణిజ్య నిర్వహణలో ముంబై 39 శాతంతో ప్రథమ స్థానంలో ఉంది. తర్వాత హైదరాబాద్ 23 శాతంతో రెండో స్థానంలో ఉంది. ప్రభుత్వాలు, ప్రైవేటు వ్యక్తులు క్లౌడ్ విధానంలో తమ సమాచారాన్ని నిక్షిప్తం చేసుకుంటున్నారు. ఇందుకోసం నెలావారీ, త్రైమాసిక, వార్షిక అద్దెలూ చెల్లిస్తున్నారు. డిజిటలైజేషన్, 5జీ ఇంటర్నెట్, క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ విధానాల్లో డేటాను నిక్షిప్తం చేసే విధానాలను రాష్ట్రంలోనూ అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించాలని నిశ్చయించారు. ఈ రంగంలో రూ.20కోట్లు పెట్టుబడి పెట్టే సంస్థలకు ఏడేళ్ల కాలానికి వంద శాతం ఎస్‌జీఎస్టీ, పదేళ్లపాటు ఏడు శాతం పెట్టుబడి రాయితీ, భూమి కొనుగోళ్లపై సబ్సిడీలు, స్టాంప్ డ్యూటీలో 100 శాతం రాయితీ ఇవ్వనున్నారు. డ్యూయల్ పవర్ గ్రిడ్ విద్యుత్ సరఫరా ఉంటుంది. పరిశ్రమలకు వర్తించే రాయితీలిస్తారు.

రూ.60 వేల కోట్ల పెట్టుబడులు..

సెమీ కండక్టర్ రంగంలో రూ.60,000 కోట్ల విదేశీ పెట్టుబడులు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే కీలక పాలసీని ఆమోదించింది. సెమీ కండక్టర్ ఫ్యాబ్, డిస్‌ప్లే ఫ్యాబ్, కాంపౌండ్ ఫ్యాబ్/ఒశాట్/ఏటీఎంపీ తయారీ పరిశ్రమలను ఆహ్వానించనుంది. ఈ ప్రాజెక్టులను స్థాపించే కంపెనీలకు 30% క్యాపిటల్ సబ్సిడీ అందిస్తుంది. ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్ రూ.3కే ఇస్తుంది.

300 ఎకరాల్లో డ్రోన్ కేంద్రం..

కొత్త డ్రోన్ పాలసీలో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ తయారీ.. పరిశోధన.. పైలట్ శిక్షణ కేంద్రాన్ని 300ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వందకు పైగా డ్రోన్ తయారీ పరిశ్రమలు వస్తాయని.. రూ.1,000 కోట్ల పెట్టుబడులు, రూ.3,000 కోట్లకుపైగా ఆదాయం వస్తాయని ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఆశిస్తోంది. డ్రోన్ల వినియోగానికి 25,000 మందికి పైగా పైలట్ శిక్షణ ఇవ్వనుంది. డ్రోన్ ఎగుమతులు 20% ఉండేలా లక్ష్యాలను నిర్దేశించుకుంది.

వారంలో నామినేటెడ్ భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

ఉండగా, అందులో 30-35 వరకు పదవులు ఈ విడతలో భర్తీ చేస్తారని తెలుస్తోంది. వీటితో పాటు మరికొన్ని ఇతర కార్పొరేషన్ పదవుల నియామకం చేపడతారు. కార్పొరేషన్ పదవుల్లో టీడీపీతో పాటు కూటమి భాగస్వామ్య పార్టీలు జనసేన, బీజేపీ నేతలకు ప్రాధాన్యం ఇస్తారు. దీనిపై బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు ఐదారు గంటలు కసరత్తు చేసినట్టు తెలుస్తోంది. ఈ నెల 11నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలోపు ప్రకటించే అవకాశముంది. పార్టీ కోసం కష్టపడినవారికి తగిన ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇప్పటికే నేతలు, కార్యకర్తలు పార్టీ కార్యాలయాలకు వందల సంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 56 బీసీ కార్పొరేషన్లు ఉన్నాయి. ఈ కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు ఒక్కో కార్పొరేషన్‌కు 12మంది సభ్యులను నియమించుకునే అవకాశముంది. అంతేకాకుండా కొన్ని కులాలకు సంబంధించి అదనంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని సర్కార్ నిర్ణయించింది. అందులో భాగంగా ఇప్పటికే స్వర్ణకార కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. బీసీలకు పదవులివ్వడమే కాకుండా ఆయా కార్పొరేషన్లకు నిధులిచ్చి ఆయా కులాలవారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. కూటమి నేతలతో చర్చించి పదవుల పందేరం చేయనున్నారు. ఇప్పటివరకు భర్తీచేసిన నామినేటెడ్ పదవుల విషయంలో అసంతృప్తులు, విభేదాలు రానందున ఇదే పద్ధతిలో పంపిణీ జరగాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీకి సేవలందించిన వారిని గుర్తుపెట్టుకుని వారి శ్రమకు తగ్గ ఫలితం అందేలా నిర్ణయం తీసుకుంటారు. ఏ పదవులకు ఎవరు సమర్థులో పరిశీలించి పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీలోని అన్ని స్థాయి నేతలతో మాట్లాడి, జాబితాను ప్రాథమికంగా తయారు చేసినట్లు తెలుస్తోంది. పదవులిచ్చిన తర్వాత ఎలాంటి విమర్శలకు తావు లేకుండా ఆయా నేతల వ్యక్తిగత వివరాలు కూడా సేకరించినట్లు సమాచారం. వచ్చే అసెంబ్లీ సమావేశాలలోపు పార్టీ నేతలు, కార్యకర్తలకు పదవుల పందేరంతో తీపికబురు అందించే అవకావముంది.

పోలవరం నిర్మాణాలను పరిశీలించిన అంతర్జాతీయ నిపుణులు


డయాఫ్రం వాల్ వద్ద ఫొటో ప్రదర్శనను పరిశీలిస్తున్న విదేశీ నిపుణుల బృందం

అమరావతి, పోలవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్క్‌షాపులో భాగంగా పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బృందం బుధవారం పరిశీలించింది. అమెరికా, కెనడాకు చెందిన ప్రాజెక్టుల ఇంజనీరింగ్ నిపుణులు సీన్ హించ్ బెర్గర్, డేవిడ్ బి.పాల్, జియాన్ ఫ్రాంకో, డి.సిక్కో, రిచర్డ్ డొనెల్లీ, కేంద్ర జలసంఘం, వాప్కోస్, బావర్, కెల్లర్ సంస్థల ప్రతినిధులతో పాటు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. డయాఫ్రం వాల్‌ను, ఎగువ-దిగువ కాఫర్ డ్యాం, సీపేజీ తీవ్రత తెలిపే పీజియో మీటర్లను పరిశీలించారు. గ్యాప్-2లో డయాఫ్రం వాల్ ప్లాట్‌ఫాం, వాల్ నిర్మాణానికి అవసరమైన ఓడోమీటర్లు, నూతన వాల్ నిర్మాణం కోసం ఎర్త్ కం రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం కుడివైపు జరుగుతున్న మట్టి పనులు, దిగువ కాఫర్ డ్యాం వద్ద డీవాటరింగ్ పనులను పరిశీలించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.